నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ గురువారం 19-12-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :31 సంచిక:107 పేజీలు:6 వెల: రూ.1/-

నమ్మలేని నిజాలు

ప్రశ్నల వర్షం
జవాబుల గొడుగు
గెలుపు జాడ
దీపంత చలి
మంచుకొండంత చలి
ఉన్నితో సరి
ఖడ్గ ధారులు
తీవ్ర ధ్వంసమార్గాలు
బందిగా స్వేచ్ఛ
నరక వధ
చెడుపై జయం కథ
దీప పుష్పాలు
ఒక మరణం
జ్ఞాపకాల తోరణం
తీరిన రుణం

– రేడియమ్
సెల్: 9291527757

శ్రీనిజాలు

అప్పులు మీ వల్లేనని
పరస్పర ఆరోపణలు !
ఒకరొకరు విమర్శ వల్ల
రాష్ట్రానికవరోహణలు !
అందరికి అందించాలి
సుభిక్షమైన పాలనా !
పనికిరానివి ప్రభుత్వా
లెందుకు నిలువు కూలనా ?

– కందుకూరి శ్రీరాములు
సెల్:9440119245

కాంగ్రెస్ 'చలో రాజ్‌భవన్' .. రోడ్డుపై బైఠాయించిన రేవంత్, భట్టి

హైదరాబాద్, డిసెంబర్ 18:మణిపుర్ అల్లర్లు, గౌతమ్ అదానీపై వచ్చిన ఆర్థిక అవకతవకల ఆరోపణల అంశంలో కేంద్రం వైఖరికి నిరసనగా తెలంగాణ కాంగ్రెస్ నేతలు 'చలో రాజ్‌భవన్' చేపట్టారు.

పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌గౌడ్ ఆధ్వర్యంలో నెక్లెస్ రోడ్డులోని ఇందిరాగాంధీ విగ్రహం నుంచి రాజ్‌భవన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు.సీఎం రేవంత్‌రెడ్డి , డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు, పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కాంగ్రెస్ నేతలు దీనిలో పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వ వైఖరిని వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ముందుకు కదిలారు. అనంతరం రాజ్‌భవన్ సమీపంలో రోడ్డుపై సీఎం రేవంత్, మంత్రులు, నేతలు బైఠాయించి నిరసన తెలిపారు.

టీఎఫ్‌డీసీ చైర్మన్‌గా దిల్‌రాజుకు బాధ్యతలు

-సినీ పరిశ్రమ అభివృద్ధికి తనవంతు సహకారం
-సింగిల్ విండో ద్వారా షూటింగ్‌లకు అనుమతి

హైదరాబాద్, డిసెంబర్ 18: తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీఎఫ్‌డీసీ) ఛైర్మన్‌గా సినీ

నిర్మాత వి.వెంకటరమణ రెడ్డి అలియాస్ దిల్ రాజు బుధవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. మాసాబ్ ట్యాంక్‌లోని టీఎఫ్‌డీసీ కార్యాలయంలో వేదపండితుల మంత్రోచ్చారణ మధ్య ఆయన బుధవారం పదవీ ప్రమాణం చేశారు. ఈ సందర్భంగా దిల్‌రాజుకు సమాచార పౌర సంబంధాల ప్రత్యేక కమిషనర్ డాక్టర్ హరీశ్ పుష్పగుచ్చాలతో శుభాకాంక్షలు చెప్పారు. కార్యక్రమానికి పలువురు సినీ రంగ ప్రముఖులు హాజరై దిల్ రాజును అభినందించారు.

పదవీ భాధ్యతలు చేపట్టిన అనంతరం, తెలంగాణ రాష్ట్ర చలన చిత్ర అభివృద్ధి సంస్థ చైర్మన్ దిల్ రాజు మాట్లాడుతూ తెలంగాణలో సినీ పరిశ్రమ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. తెలుగు చలన చిత్ర పరిశ్రమకు, రాష్ట్ర ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ సమస్యల పరిష్కారానికి తగిన ప్రాధాన్యత ఇస్తానని చెప్పారు. ఇండియన్ ఫిలిం ఇండస్ట్రీ కి చెందిన షూటింగ్స్ తెలంగాణలో మరింత ఎక్కువగా జరిగే విధంగా ప్రయత్నిస్తానని అన్నారు. ఎగ్జిబిటర్స్ సమస్యల పరిష్కారంతో పాటు, సినీ నిర్మాతలకు షూటింగ్ ల అనుమతులను సింగల్ విండో ద్వారా లభించేందుకు కృషి చేస్తానని అన్నారు.

రచయిత కాటూరు రవీంద్రత్రివిక్రమ్ అస్తమయం

హైదరాబాద్, డిసెంబర్ 18:ప్రముఖ కథా. నవలా రచయిత, ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం గౌరవ సలహాదారులు కాటూరు రవీంద్ర త్రివిక్రమ్ ఈ రోజు తెల్లవారుజామున వారి స్వగృహంలో మరణించారు. వారి వయస్సు 80 సంవత్సరాలు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు.

డిసెంబర్ 18 1946న కృష్ణాజిల్లాలో జన్మించిన త్రివిక్రమ్, పుట్టిన రోజునే మరణించడం యాదృచ్ఛికం. ఆయన తొలి కథ 1974 నవంబర్ 10న ప్రచురింపబడి తన రచనా వ్యాసంగాన్ని ప్రారంభించగా, ఆ తరువాత పలు పత్రికలు నిర్వహించిన దీపావళి కథల పోటీలలో వరుసగా వీరి రచనలు బహుమతులు పొందడం విశేషం. ముఖ్యంగా 'కార్గిల్ కథలు' వీరికి మంచి పేరును సంపాదించిపెట్టాయి. ఆకాశవాణిలో పలు కథలు, నాటకాలు, వ్యాఖ్యానాలు ప్రసారమైయ్యి గుర్తింపు తెచ్చిపెట్టాయి. కాలమిస్టుగా అనేక పత్రికలలో 'అంతర్యామి, 'లా' సలహాలు వంటి అనేక శీర్షికలు నాలుగు ఢాబాలుగా నిర్వహించిన వీరు, గత రెండేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతూ ఉన్నారు. 1965 నుంచి 75 వరకు భారతీయ వైమానిక దళంలో పనిచేసిన కాటూరు, పంజాబ్ నేషనల్ బ్యాంకులోను, హైకోర్టు లాయరుగాను పలు బహుముఖీన సేవలు అందించారు. ఆయన రచించిన పలు రచనలకు జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలూ లభించాయి. ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘానికి గత కొంతకాలంగా గౌరవ సలహాదారులుగా వీరి సేవలు అందిస్తున్నారు. కాటూరు మరణ వార్త తెలియగానే ఆంధ్రప్రదేశ్ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి చలపాక ప్రకాష్, కార్యదర్శి శర్మ సి.హెచ్. ప్రముఖ విద్యావేత్త ఎం.సి.దాస్, సాహితీవేత్త గుమ్మా సాంబశివరావు, ప్రపంచ తెలుగు రచయితల సంఘం అధ్యక్ష కార్యదర్శులు గుత్తికొండ సుబ్బారావు, డా. జి.వి.పూర్ణచంద్ తదితర ఇతర సాహితీ సంస్థల ప్రతినిధులు త్రివిక్రమ్ భౌతికకాయాన్ని సందర్శించి ఘన నివాళులర్పించారు.

చురక

అప్పుచేసి పప్పు కూడు
ఆరగింపే కదా ఇప్పుడు
సర్కారు ఎవరిదైనా
సమర్థనే సదా ఎప్పుడు
కాదంటరా ఎటుచూసిన
కడుపునింపే కమీషన్లు
అభివృద్ధి పథకాల్లో
అడుగడుగున కరెప్షన్లు

–వేల్పుల నారాయణ
9440433475

నేటి కందం– నేటికి అందం

ఆషాఢుల్లా మరియును
రోషను ఠాకూరు,రాము క్రోధోద్ధతిలో?
ఘోషించెడి మన భారత
యోషను రక్షించు కొరకు నొడ్డిరి తనువుల్ !!
(19-12-1927 ఆషాఢుల్లా, రామ్ బిస్మిల్లా, రోషన్ ఠాకూర్ ఆత్మార్పణ చేసిన రోజు)

–రాధశ్రీ
సెల్:9494481210

సచివాలయ ఉద్యోగుల సంఘం ఎన్నికల నోటిఫికేషన్ విడుదల

హైదరాబాద్, డిసెంబర్ 18:డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ తెలంగాణ సచివాలయ ఉద్యోగుల సంఘం ఎన్నికలకు నోటిఫికేషన్ బుధవారం విడుదలైంది. ఈ ఎన్నికల ప్రక్రియలో భాగంగా నామినేషన్ల దాఖలు, స్క్రూటినీ, ఉపసంహరణ, పోలింగ్, ఫలితాల ప్రకటన తదితర తేదీలను అధికారులు వెల్లడించారు. తాజాగా ప్రకటించిన ఎన్నికల షెడ్యూల్ ఇలా ఉంది.

నామినేషన్ల దాఖలు:

18.12.2024 నుండి 19.12.2024 వరకు సాయంత్రం 4.00 గంటల వరకు.

నామినేషన్ల చెల్లుబాటు జాబితా ప్రచురణ: 19.12.2024 సాయంత్రం 5.00 గంటలకు.

నామినేషన్ల ఉపసంహరణ: 20.12.2024 నుండి 21.12.2024 మధ్యాహ్నం 3.00 గంటల వరకు.

తుది జాబితా ప్రచురణ: 21.12.2024 సాయంత్రం 5.00 గంటలకు.

పోలింగ్ తేదీ: 04.01.2025 (ఉదయం 11.00 గంటల నుండి మధ్యాహ్నం 3.00 గంటల) వరకు.

ఫలితాల ప్రకటన: 04.01.2025 సాయంత్రం 5.00 గంటల నుండి.

అసెంబ్లీలో భూభారతి -2024 బిల్లు ప్రవేశపెట్టిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

హైదరాబాద్, డిసెంబర్ 18: తెలంగాణలో సామాన్యుల భూహక్కుల పరిరక్షణే ధ్యేయంగా 2024 ఆర్వోఆర్ -భూభారతి చట్టాన్ని రూపొందించామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి శ్రీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రకటించారు. బుధవారం శాసనసభలో మంత్రి భూభారతి బిల్లును ప్రవేశపెట్టారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇటువంటి అద్భుత చట్టాన్ని ప్రవేశపెట్టే అవకాశం తనకు లభించడం మరచిపోలేని విషయమని అన్నారు. 1971లో నాటి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆర్వోఆర్ చట్టం 49 ఏళ్లపాటు ఉపయోగపడిందని, ముఖ్యంగా రాష్ట్ర విభజన తర్వాత కూడా ఏడేళ్ల పాటు కూడా ప్రజోపయోగంగా ఉపయుక్తమయ్యిందని తెలిపారు. తర్వాత అర్ధరాత్రి నాలుగు గోడల నడుమ రూపొందిన ధరణి చట్టం వలన సమస్యలు పరిష్కారం కాకపోగా లక్షలాది సమస్యలను తెచ్చిపెట్టిందని చెప్పారు. కొండనాలుకకు మందేస్తే ఉన్న నాలిక ఊడిందన్నట్లు ధరణి పోర్టల్‌తో లెక్కలేసన్ని ఇబ్బందులు ఎదురయ్యాయని వివరించారు.

లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ, నాటి ప్రతిపక్షనేత , నేటి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి , నేటి ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తమ పాదయాత్రల సందర్భంగా ధరణిని అరేబియా సముద్రంలో కలుపుతామని ఇచ్చిన హామీని ప్రజలు విశ్వసించారని మంత్రి పొంగులేటి తెలిపారు.

ఆమేరకు ఇందిరమ్మ రాజ్యాన్ని తెచ్చుకున్నారని, ఒక్క గుంట భూమి ఉన్న వారు కూడా తమను నమ్మారని, వారి నమ్మకాన్ని నిలబెట్టేందుకుగాను ఆర్వోఆర్ 2020ను పూర్తిగా ప్రక్షాళన చేసి భూభారతిని రూపొందించామని చెప్పారు.

తాము ఆగస్టు 2న ముసాయిదాను ప్రవేశపెట్టడమేగాక ప్రత్యేకంగా 40 రోజుల పాటు వెబ్ సైట్‌లో పెట్టి ప్రజాప్రతినిధులు,కవులు , మేధావులు, విశ్రాంత అధికారుల సలహాలు సూచనలు స్వీకరించి కొత్త చట్టానికి రూపకల్పన చేశామని తెలిపారు.

మాజీ మంత్రి హరీష్ రావు 7 పేజీలు, వినోద్‌రావు 5 పేజీల సలహాలు . సూచనలు చేశారని వాటిని కూడా పరిగణనలోకి తీసుకున్నామని మంత్రి పొంగులేటి తెలిపారు.

33 జిల్లాలలో ఒక్కోరోజు ప్రత్యేక చర్చావేదికలు నిర్వహించి అందరి అభిప్రాయాలు తీసుకున్నామని చెప్పారు. 18 రాష్ట్రాలలోని ఆర్వోఆర్‌లను అధ్యయనం చేసి , ఉత్తమ విధానాలను క్షుణ్ణంగా పరిశీలించి వాటిని భూభారతిలో పొందుపరిచామని మంత్రి తెలిపారు

ధరణి కారణంగా ఎంతోమంది తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని, కేనముద్రం మండలం నారాయణపురంలో కె. రవి అనే ఎంపీటీసీ సభ్యులు భూ సమస్యలను బిఆర్ఎస్ ప్రభుత్వ పెద్దలందరి దృష్టికి తీసుకువెళ్లారని , ఏళ్ల తరబడి గతంలో నిర్మించిన వాల్ చిన్నగా ఉండడం ప్రమాదాలకు అనువుగా మారిందని అన్నారు. వాల్ కు ఐదు ఫీట్ల ఎత్తుతో ఇనుప కంచే ఏర్పాటుకు ప్రతిపాదనలు చేస్తున్నట్లు తెలిపారు. దీంతోపాటు నదిపై సీసీ కెమెరాలు అమర్చి స్థానిక పోలీస్ స్టేషన్‌కు అనుసంధానం చేసి నిరంతరం పర్యవేక్షిస్తూ పోలీసు సిబ్బంది మహిళ హోంగార్డులను అందుబాటులో ఉంచుతామని అన్నారు. ప్రతిరోజు గోదావరి నదిపై బ్లూ కోట్ సిబ్బంది పర్యవేక్షిస్తుంటారని పేర్కొన్నారు.

పరిష్కారం కాలేదని చెప్పారు.

అంతేగాక సర్వేనెంబర్లు 149,150, 154,156, 168 తదతరాల్లోని 1398 ఎకరాల భూమి తరతరాలుగా అక్కడి గిరిజనుల సాగుబడిలో ఉన్నాయని మంత్రి పొంగులేటి తెలిపారు.

ధరణి -2020 ఆర్వోఆర్ చట్టం వచ్చాక వారి హక్కులకు భంగం వాటిల్లేలా సదరు భూములు అటవీ భూములని తేల్చిచెప్పారని దీంతో గిరిజనులు తీవ్ర మనోవేదననకు గురయ్యారని మంత్రి వివరించారు. గత ప్రభుత్వ హయాంలో 4 నెలల పాటు రిజిస్ట్రేషన్‌లు ఆపివేశారని, దీంతో భూములు అమ్ముకొని కుటుంబంలో పెళ్లిళ్లు, చదువుల కోసం ఖర్చుచేద్దామనుకొనే సామాన్య రైతులకు తీవ్ర అసౌకర్యం కలిగిందని మంత్రి వివరించారు.

భూభారతి బిల్లుకు సంబంధించి 22-23 సార్లు అభిప్రాయాలు తీసుకున్నామని, అందువల్లే బిల్లు ప్రవేశపెట్టడంలో .జాప్యం జరిగిందని చెప్పారు. ప్రజలకు పూర్తిస్థాయిలో ఉపయోగపడేలా బిల్లు తయారుచేసేందుకు కృషి చేశామని, సాదాసీదా బిల్లును ప్రజలపై రుద్దే ఆలోచన తమ ప్రభుత్వానికి లేదని మంత్రి స్పష్టం చేశారు.

ఎమ్మెల్యే వివేక్ వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలి.. మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్, డిసెంబర్ 18: తెలంగాణ అసెంబ్లీ చర్చలో ఇటీవల జరిగిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే వివేక్ చేసిన వ్యాఖ్యలను సీరియస్‌గా తీసుకోవాలని స్పీకర్‌ను శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్ బాబు కోరారు. వివేక్ ఫస్ట్ టైం ఎమ్మెల్యే కాదని, ఆయన 2014లోనే అసెంబ్లీకి వచ్చారని, ఇంకా అవగాహన లేకుండా, ఆధారాలు లేకుండా ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు.

వివేక్ తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోవాలని ఆయన సూచించారు. 2014లో బీఆర్ఎస్ ప్రభుత్వమే రూల్ ఫ్రేమ్ చేసి, అసెంబ్లీలోకి ఇతర దుస్తులు వేసుకురావద్దని నియమాలు పెట్టిన విషయాన్ని మంత్రి శ్రీధర్ గుర్తు చేశారు. మంగళవారం నల్ల దుస్తులు వేసుకొస్తే, అయ్యప్ప భక్తి అనుకున్నాం,, కానీ, ఈ రోజు ఆటో డ్రైవర్ దుస్తులు వేసుకొచ్చారని తెలిపారు.

అధికారంలో ఉన్నప్పుడు ఒక విధంగా, ప్రతిపక్షంలో ఉన్నప్పుడు మరో విధంగా వ్యవహరిస్తున్నారంటే అది బీఆర్ఎస్ వ్యవహారం అని మంత్రి శ్రీధర్ మండిపడ్డారు. ఈ క్రమంలో, బీఆర్ఎస్ ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేసిందని విమర్శించారు. వివేక్ చేసిన వ్యాఖ్యలను 320 రూల్ ప్రకారం తొలగించినట్లు స్పీకర్ ప్రకటించారు.

ఆత్మహత్యలకు పాల్పడకుండా చర్యలు.. ఎస్పీ జానకి షర్మిల

-బాసర గోదావరి నది బ్రిడ్జి పై రక్షణ
-చుట్టూ కంచె ఏర్పాటు
-సీసీ కెమేరాల ఏర్పాటు
-నిరంతర పర్యవేక్షణ
-నిర్మల్ ఎస్పీ జానకి షర్మిల

ఆదిలాబాద్, డిసెంబర్ 11:: బాసర పుణ్య క్షేత్రం వద్ద గోదావరి నది బ్రిడ్జి పై నుండి గోదావరిలోకి దూకి తరచూ ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. బాసర బ్రిడ్జి పై నుంచి కుటుంబాలతో సహా ఆత్మహత్యలు జరిగిన సంఘటనలు ప్రతి ఒక్కరినీ కలచివేసింది. గోదావరి నదిలోకి దూకేందుకు ఆస్కారం లేకపోతే కొంత సమయం గ్యాప్ దొరకడంతో ఆత్మహత్యకు పాల్పడిన వారు తన నిర్ణయాన్ని మార్చుకుంటారని పోలీసుల అభిప్రాయం. అందులో భాగంగా పుణ్యక్షేత్రమైన ఇక్కడ ఇలా ఆత్మహత్యలకు ఆస్కారం లేకుండా నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిల చర్యలు చేపట్టారు.

బ్రిడ్జి పరిశీలన

గోదావరి నదిపై ఉన్న బ్రిడ్జిని జిల్లా ఎస్పీ జానకి షర్మిల బుధవారం పరిశీలించారు. ఆమెతోపాటు భైంసా ఏఎస్పీ అవినాష్ కుమార్, ముధోల్ సీఐ మల్లేష్, ఎస్ఐ గణేష్ తదితరులు ఉన్నారు. బాసర పుణ్య క్షేత్రం నుండి నిజామాబాద్ జిల్లాకు వారధిగా ఉన్న ఈ బ్రిడ్జిపై నిర్మించిన వాల్ చిన్నదిగా ఉండడంతో క్షణకావేశంలో వచ్చిన వారు వెంటనే ఆత్మహత్యకు పాల్పడుతున్నట్లు ఎస్పీ గుర్తించారు. అయితే బ్రిడ్జికు ఇరువైపులా ఇనుప కంచె ఏర్పాటు చేస్తే ఆత్మహత్యలకు వచ్చే వారు మళ్లీ వెనుక్కు తగ్గే అవకాశాలు వుంటాయని ఆమె భావించారు.

ఇనుప కంచె ఏర్పాటుకు ప్రతిపాదనలు

స్థానిక పోలీస్ స్టేషన్ లో విలేకరులతో ఎస్పీ జానకి షర్మిల మాట్లాడారు. గోదావరి నది బ్రిడ్జిపై గతంలో నిర్మించిన వాల్ చిన్నగా ఉండడం ప్రమాదాలకు అనువుగా మారిందని అన్నారు. వాల్ కు ఐదు ఫీట్ల ఎత్తుతో ఇనుప కంచే ఏర్పాటుకు ప్రతిపాదనలు చేస్తున్నట్లు తెలిపారు. దీంతోపాటు నదిపై సీసీ కెమెరాలు అమర్చి స్థానిక పోలీస్ స్టేషన్‌కు అనుసంధానం చేసి నిరంతరం పర్యవేక్షిస్తూ పోలీసు సిబ్బంది మహిళ హోంగార్డులను అందుబాటులో ఉంచుతామని అన్నారు. ప్రతిరోజు గోదావరి నదిపై బ్లూ కోట్ సిబ్బంది పర్యవేక్షిస్తుంటారని పేర్కొన్నారు.

నాయకులకోసం ప్రజలు కాదు ప్రజల కోసం ప్రభుత్వం

తెలంగాణ ఇప్పుడిప్పుడే గాడిన పడుతుంది ప్రజాస్వామ్య. దేశంలో రాజకీయ పార్టీలు ప్రజల మన్నలను అందుకుని అధికారంలోకి రావడం, ప్రజల తిరస్కారం ఎదుర్కోని అధికారం కోల్పోవడం అనేది సర్వసాధారణం. అధికారంలోకి రావడం కోసమే ఎత్తులు పై ఎత్తులు వేసి అధికారం లోకి వచ్చిన తర్వాత ప్రజలను విస్మరించి.. తిరిగి ఎన్నికల నాటికీ మళ్లీ ప్రజల మధ్యలోకి వచ్చి ఓట్లు అడుక్కోవడం రాజకీయ పార్టీలకు షరా మామూలే. అయితే ప్రస్తుతం తెలంగాణ రాష్ట్రంలో విచిత్రమైన పరిస్థితి నెలకొన్నది. తెలంగాణ అస్తిత్వం నినాదంతో అధికారంలోకి వచ్చి పదేళ్ల కాలంలో ప్రజల ఆత్మగౌరవం ప్రగతి భవన్ ముందు ఏర్పాటు చేసిన ఇనుప కంచెలు దాటి రాకుండా అడ్డగించిన రాజకీయ నాయకులు ప్రజల విశ్వాసానికి దూరమై అధికారం కోల్పోయిన ప్రతిపక్షం స్థానం దక్కించుకున్నారు. ఓటమి కన్నా తమకు నచ్చని వ్యక్తి ముఖ్యమంత్రి అయ్యారన్న అక్కసు ప్రతి నిమిషం వెళ్లగక్కుతున్నారు. వ్యక్తిగా గౌరవించకపోయినా కనీసం ముఖ్యమంత్రి స్థానానికి అయినా గౌరవం ఇవ్వాలని పదేపదే చేసిన సూచనలకు కాస్త పద్దతి మార్చుకున్నారు ప్రతిపక్షనేతలు. అయితే అధికారం కోల్పోవడం ఒకవైపు.. తాము పదేళ్లలో ప్రజలను ఎన్నో విధాల మభ్యపెట్టిన విషయాలు, జరిగిన అవినీతి ఒక్కటొక్కటిగా బయటకు రావడంతో బెంబెలెత్తి ప్రభుత్వం పనిచేయకుండా అడ్డంకులు సృష్టిస్తున్నారు. రైతు రుణమాఫీ విషయంలో మహిళా జర్నలిస్టులను ఫీల్డ్ లోకి ముఖ్యమంత్రి ఊరు పంపించి చాలా పెద్ద సీన్ క్రియేట్ చేశారు. మహిళలంటే గౌరవం లేదంటూ ప్రభుత్వాన్ని విమర్శిస్తూ మరోవైపు ఉచిత ప్రయాణం చేస్తున్న మహిళల పట్ల అగౌరవంగా మాట్లాడారు. మహిళా కమిషన్ జోక్యం చేసుకోవడంతో మహిళల విషయంలో కాస్త తగ్గారు.

అధికారులపై దాడులు..ఆ వెనువెంటనే రైతులపై ముసలి కన్నీరు కారుస్తూ వారి సమస్యలు తలకు ఎత్తుకున్నట్టు నటిస్తూ రైతుల ముసుగులో కలెక్టర్ మీద దాడికి ప్రయత్నం చేసి ప్రభుత్వాన్ని రైతు వ్యతిరేక ప్రభుత్వంగా చిత్రికరించే ప్రయత్నం చేశారు. అయితే బడా రైతుల రాళ్లరప్పల భూములకు రైతు బంధు ఇచ్చి వేలకోట్ల ప్రజాధనాన్ని గత ప్రభుత్వం భూస్వాముల పరం చేస్తే అధికారంలోకి వచ్చిన ప్రజా ప్రభుత్వం చిన్నకారు, సన్నకారు రైతుల రుణాలను మాఫీ చేసి రైతుల ఆర్థిక సమస్యలు తీర్చడం చరిత్రలోనే ఒక మరచిపోలేని ఘట్టం. అయితే ప్రజలల్లో పెరుగు తున్న మద్దతు, గాడీన పడుతున్న ప్రజా పాలన చూసి ఓర్వలేక కలెక్టర్ గారిపై దాడికి రైతుల ముసుగులో ప్రణాళిక వేసి ప్రభుత్వ అధికారుల్లో ఒక భయం సృష్టించి రైతు వ్యతిరేక ప్రభుత్వంగా చిత్రికరించే ప్రయత్నం చేశారు. అయితే సమర్థవంతమైన పోలీసు అధికారులు రైతుల ముసుగులో దాడి చేసిన వారి గుట్టు రట్టు చేయడంతో రైతుల సమస్యల డ్రామాకు తెరపడింది.

నగరాన్ని ముంచెత్తి.. హైదరాబాద్ నగరంలో ఉన్న చెరువులు బెంగళూరు వానాకాలంలో ఎంతటి దుర్భరమైన పరిస్థితులు ఉన్నాయో చూస్తునే ఉన్నాం. శతాబ్దాల కిందట మూసీ నది నుంచి జల రవాణా జరిగిన దాఖలు ఉన్నాయి. మంచి రేవుల వరకు పడవలు వచ్చేవని, నదిలో ప్రయాణం చేసి సముద్రయానం ద్వారా విదేశాలకు వర్తకవ్యాపారాలు చేసేవారని చరిత్ర లో ఆధారాలు ఉన్నాయి. జల రవాణాను పెంపొందిస్తామని, మూసి ప్రక్షాళన చేస్తామని గతంలో చెప్పిన ప్రభుత్వం అదే పని ప్రజా ప్రభుత్వం చేస్తుంటే పెద్ద రాద్ధాంతం చేశారు. ప్రభుత్వాన్ని ఉపరి తీసుకోనివ్వకుండా చేశారు. మహిళల గౌరవానికి భంగం కలిగించే వ్యాఖ్యలు చేసి ప్రభుత్వాన్ని అబాసుపాలు చేయాలన్న ఆలోచన బెడిసి కొట్టడం, రైతు సమస్యల పేరుతో అధికారులను భయభ్రాంతులకు గురిచేయాలన్న డ్రామాకు తెరపడటంతో ఇక విద్యార్థుల వైపు దృష్టి మళ్లించారు. విద్యార్థుల ఆరోగ్యం అందరికీ ముఖ్యమే.. ప్రభుత్వ పాఠశాలను దాదాపు కబ్జాలకు గురయ్యాయి. తెలంగాణలో నీటివనరులకు చెరువులే ప్రధాన అదెరువు. అయితే పదేండ్లలో హైదరాబాద్ నగరంలో చాలా చెరువులు కబ్జాకు గురయ్యాయి. స్వయంగా గత ముఖ్యమంత్రి వానకాలంలో నీటి మునిగిన హైదరాబాద్ లోని అనేక కాలనీలను, లే అవుట్ లను చూసి చెరువుల జాగకు మీరు పోతే.. వాటి జాగకు అవి వచ్చాయి అని వ్యాఖ్యనిం చారు. దేశంలోని ప్రధాన నగరాలు చెన్నై, నిర్లక్ష్యం చేసి ప్రైవేటు సంస్థలకు కోట్లాది రూపాయలు కట్టబెట్టి, తన నాయకుల అరకొరవసతుల భవనాలకు గురుకులాలకు అద్దెకు ఇచ్చి కేజీ టూ పీజీ ఉచితం అంటూ చాలా తెలివిగా ప్రజలను మోసం చేశారు. అయితే గతంలో ఎన్నో సార్లు విద్యార్థులు అనారోగ్యం బారిన పడితే ఆ వార్తలు కూడా చాలావరకు బయటకు రాకుండా నివారించారు. అనివార్య కారణాలతో మరణించిన విద్యార్థుల కుటుంబాలను పట్టించుకోలేదు. కానీ ప్రజా ప్రభుత్వం అనుకోని పరిస్థితి ల్లో చనిపోయిన విద్యార్థుల కుటుంబాలకు అండగా నిలిచింది. విద్యార్థుల విషయంలోనూ ప్రతిపక్ష నేతల దుష్ప్రవన్నాగాలు పటాపంచల్ కావడంతో దిక్కు తోచని స్థితిలో తెలంగాణ తల్లి విగ్రహం వారికి పెద్ద టాపిక్ గా మారింది.

అవును తెలంగాణ తల్లి మారిపోయింది... పదేండ్లు తెలంగాణ ప్రజలను పరిపాలించిన ప్రభుత్వంలోని ముఖ్యనేతలు వేలాది కోట్ల రూపాయల ఆస్తులు కూడబెట్టుకుంటే వారికి అధికారం ఇచ్చిన తెలంగాణ తల్లి నేడు తమ ప్రాబల్యం కోల్పోయి అతి సామాన్యమైన రూపంలో తెలంగాణ తల్లిగా నిండుగా నిలిచింది. పదేండ్ల పాలనలో తెలంగాణలో జరిగిన దోపిడికి , ప్రస్తుత తెలంగాణ పరిస్థితికి నిలువెత్తు రూపంగా తెలంగాణ తల్లి విగ్రహం సాక్షాత్కరించింది. ఇలా ఎన్నో ఉదాహరణలు ప్రజా ప్రభుత్వం ముందరకాళ్లకు బంధం వేసినట్టుగా ప్రతిపక్షం తీరును గమనించవచ్చు.

తమ ప్రభుత్వంలో సమస్యలే లేవు అంటూ ధర్నా చౌక్ ను ఎత్తివేసి సమస్యలు చెప్పుకోవడానికి కూడా ఒక వేదిక లేకుండా చేశారు. ఈ రోజు సమస్యలు ఉన్న ప్రజలు నేరుగా ప్రగతి భవన్ కు వచ్చిన ప్రజావాణి ద్వారా సమస్యలను పరిష్కరించుకుంటున్నారు. ప్రగతి భవన్ లో ఉన్న వారు ధర్నా చౌక్ వద్దకు చేరుకుంటే ప్రజలు నేరుగా ప్రజా వాణితో తమ సమస్యలు అధికారులకు విన్నవించి పరిష్కారాలు పొందుతున్నారు. అస్తిత్వం అంటూ వచ్చిన తెలంగాణలో ఆత్మగౌరవం కోల్పోయి..ఆస్తులు పోయిన తెలంగాణ ఇప్పుడిప్పుడే తిరిగి గాడిన పడుతుంది. ప్రజల సమస్యలు వినే అధికారులు ఉన్నారు.. ప్రజా ప్రతినిధులు కనిపిస్తున్నారు. నాయకుల కోసం ప్రజలు కాదు ప్రజల కోసం ప్రభుత్వం అన్నది ప్రజలకు తిరిగి అర్థమవుతుంది.

– విధాత్రి,
హైదరాబాద్

అస్తిత్వం అంటూ వచ్చిన తెలంగాణలో ఆత్మగౌరవం కోల్పోయి..ఆస్తులు పోయిన తెలంగాణ ఇప్పుడిప్పుడే తిరిగి గాడిన పడుతుంది. ప్రజల సమస్యలు వినే అధికారులు ఉన్నారు.. ప్రజా ప్రతినిధులు కనిపిస్తున్నారు. నాయకుల కోసం ప్రజలు కాదు ప్రజల కోసం ప్రభుత్వం అన్నది ప్రజలకు తిరిగి అర్థమవుతుంది.

ముట్టూరి కమలమ్మ ఫౌండేషన్

ఆహ్వానము

సాహితీకిరణం సౌజన్యంతో నిర్వహించిన 11 వ జాతీయస్థాయి చిన్న కథలపోటీ - 2024 బహుమతి ప్రదానోత్సవం

ముఖ్యఅతిథి : శ్రీ ఎస్.వి.రామారావు
సభాధ్యక్షులు : శ్రీ లైస దేవరాసు
విశిష్ట అతిథి : శ్రీ డా.నా.వై.రామకృష్ణారావు
సభాప్రారంభం : శ్రీ పాతూరి సుబ్బారావు
బహుమతి కథల : శ్రీమతి పాతూరి జయలక్ష్మి
విశ్లేషణ : శ్రీ పెద్దూరి వెంకటరామ
కార్యక్రమ నిర్వహణ : శ్రీ పెద్దూరి వెంకటరామ

అమృతస్రవైన పాటలు
సినీ మధుర గానలహరి
నిర్వహణ : శ్రీమతి ఆర్.దమయంతి

ఆత్మీయ స్పందనలు

కథల పోటీ-2024 విజేతలు
కందర్భపురం-పూడి,జాజిరోలు దుర్గమ్మ-సంబరాలు
గరిమేళతో మార్మోగుతూ,ఆకట్టుకున్న ఎ.సి.ప్రసాద
కాలం బాగోస్తుంది-ప్రసాదాచారి,పి.సి.పోచన్న-తిరుగుబాటు
మానవసేవే శ్రీనివాసరావు-శ్రీకృష్ణ
ప్రశ్నే సమాధానమంటూ ప్రభుత్వ-దొంగలాట

తేదీ:21.12.2024 శనివారం సా॥5.00 గం॥లకు
వేదిక:కళా మారుతి కళావేదిక (శ్రీ త్యాగరాయ గానసభ) చిక్కడపల్లి, హైదరాబాద్

పాతూరి జయలక

నేటినిజం
సాహితీ కెరటాలు
E-mail : netinijam93@gmail.com
website: www.netinijam.com
2 హైదరాబాద్ ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 గురువారం 19-12-2024

పంచారామం

కోపిష్టిలా మారుతున్నారంటే
కాపురంలో కలతలొస్తున్నట్లే
దాపరికాలు దరువేస్తున్నాయంటే
దాంపత్యం దూరమవుతున్నట్లే
మరొకరిని ద్వేషిస్తున్నామంటే
మనం పరాధీనమైనట్లే
వారి గురించే ఆలోచిస్తున్నామంటే
వారు మననావహించినట్లే.

పని స్వభావాన్ని
ప్రతిభ నిర్ణయిస్తుంది
పని సామర్థ్యాన్ని
ప్రవర్తన నిర్ణయిస్తుంది
నజరానా
చెల్లింపు
నజర్
మళ్ళింపు

-గంటా మనోహర్‌రెడ్డి
సెల్:9949992964

నిజాలు!

ఏ దేశంలో కరెన్సీని వెదజల్లితే
ఎగబడి ప్రజలు ఏరుకోరో!.
ఏ దేశంలో ఉచితాలిస్తామంటే
వద్దని వ్యతిరేకిస్తారో!
అదే నిజమైన ప్రజాస్వామ్య దేశం
ఏ దేశంలో వైద్య విద్యా రంగాలు
కేవలం
ప్రభుత్వ రంగంలో ఉంటాయో!.
అక్కడ .....
సౌభాగ్యం వెల్లివిరుస్తుంది
శ్రమజీవనం శోభిస్తుంది

-రాఘవ మాస్టారు కేదారి
97414 07099

సాహిత్యాన్ని సాహితీసంస్థలు ఆదుకోవాలి
-డా॥ఓలేటి పార్వతీశం

కొసరాజు సామ్రాజ్యం సంపాదకత్వంలో వెలువడిన 'ఎదురుచూపులు' కవితాసంకలనం ఆవిష్కరణలో కొసరాజు సామ్రాజ్యం, డా॥పులిపర్తి కృష్ణమూర్తి, గుదిబండి వెంకటరెడ్డి ఆవిష్కర్త డా॥ ఓలేటి పార్వతీశం, బైస దేవదాసు, డా॥ వై. రామకృష్ణారావు, పొత్తూరి సుబ్బారావు, పెద్దూరి వెంకటదాసు.

తెలుగు సాహిత్య వ్యాప్తికి సాహితీసంస్థల తోడ్పాటు ప్రశంసనీయం. సాహిత్యాన్ని అటువంటి సంస్థలు ఆదుకోవటంవల్లే మరింత సాహిత్యాభివృద్ధి జరుగుతుందని ప్రముఖ సాహితీవేత్త డా॥ఓలేటి పార్వతీశం అన్నారు. డిసెంబర్ 11న శ్రీ త్యాగరాయ గానసభ కళామారుతి కళావేదికపై కొసరాజు ఆర్తి & జాహ్నవి మెమోరియల్ ఛారిటబుల్ ట్రస్ట్ సాహితీకిరణం సౌజన్యంతో **'కన్నవారి కలలు -పిల్లల బాధ్యతలు'** అనే అంశంపై నిర్వహించిన జాతీయ స్థాయి కవితలపోటీ విజేతలకు వారు ముఖ్యఅతిథిగా విచ్చేసి బహుమతులందజేశారు. అనంతరం ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షురాలు కొసరాజు సామ్రాజ్యం సంపాదకత్వంలో వెలువడిన **'ఎదురుచూపులు'** కవితాసంకలనాన్ని వారు ఆవిష్కరించారు. పొత్తూరి సుబ్బారావు-జయలక్ష్మి దంపతులు 'సాహితీ కిరణం' మాసపత్రికను క్రమం తప్పకుండా వెలువరిస్తు ఎన్నో శీర్షికలను, పలు అంశాలపై కథలు, కవితల పోటీలు నిర్వహిస్తు చేస్తున్న సాహిత్య కృషిని అభినందించారు. సాహిత్యం అందరిని కలుపుతుందని సాహిత్యంపట్ల ప్రతి ఒక్కరు మక్కువ పెంచుకోవాలని డా॥ఓలేటి పార్వతీశం అన్నారు.

"కొసరాజు ఆర్తి మరియు జాహ్నవి మెమోరియల్ చారిటబుల్ ట్రస్ట్" వ్యవస్థాపక అధ్యక్షురాలు కొసరాజు సామ్రాజ్యంను సత్కరిస్తున్న అతిథులు.

అనివార్య కారణాల వల్ల ఆర్తి, జాహ్నవి చిన్నారులు భౌతికంగా దూరం కావడం కాసరాజు సామ్రాజ్యానికి జీవితంలో ఒక విషాద సంఘటన అయినప్పటికీ వారి జ్ఞాపకాల్లో జీవిస్తూ కొసరాజు ఆరి మరియు జాహ్నవి మెమోరియల్ ట్రస్టు ఏర్పాటు చేసి పలు కవితా సంకలనాలను వెలువరించడం ఓ గొప్ప సాహిత్యకృషి అని కొనియాడారు. కవితా సంకలనానికి **'ఎదురు చూపులు'** అని చేసిన నామకరణం చేయడం బాగుందని పార్వతీశం అభినందిం చారు.

సభకు అధ్యక్షత వహించిన బైసదేవదాసు ప్రస్తుత పరిస్థితుల్లో తల్లిదండ్రులను పిల్లలు ఏ విధంగా చూస్తున్నారో అనేది ఒక చర్చనీయాంశమైనదని, అయితే అందరు పిల్లలను ఒకే గాటికికట్టడం సమంజసం కాదని, ఈ కవితాసంకలనంలో ప్రచురించబడిన కవితలను చదివితే వారిలో మార్పు తప్పకుండా వస్తుందని పేర్కొన్నారు. సభలో విశిష్ట అతిథిగా పాల్గొన్న డా॥వై.రామ కృష్ణారావు మాట్లాడుతూ ఒకే అంశంపై ఇంతమంది రచయితలు, ఇన్ని భావాలను ప్రస్ఫుటం చేయటం అనేది చెప్పుకోదగ్గ విషయమని, కవిత్వానికున్న ప్రత్యేకతకూడా అదేనని అన్నారు. ఆధ్యాత్మిక రచయిత డా॥పులిపర్తి కృష్ణమూర్తి పుస్తకాన్ని ఆసాంతం సమీక్షించారు. గుదిబండి వెంకటరెడ్డి తన ప్రసంగంలో సాంస్కృతిక సంస్థలు సాహిత్యాభివృద్ధికికూడా తోడ్పడుతున్నాయని అన్నారు. సాహితీకిరణం సంపాదకులు పొత్తూరి సుబ్బారావు సభను ప్రారంభిస్తూ కొసరాజు సామ్రాజ్యంగారు ఇంతకుముందుకూడా **'అనాథబాలల అవస్థలు', 'ఆత్మహత్యలు'** అనే ఇతర అంశాలమీదకూడా కవితాసంకలనాలను ప్రచురించారని తెలియజేశారు. పెద్దూరి వెంకటదాసు కార్యక్రమాన్ని నిర్వహించగా కొసరాజు బాబూ రాజేంద్రప్రసాద్ అతిథులకు సత్కారం కావించారు.

కొసరాజు సామ్రాజ్యం స్పందనలో తమ సంస్థ చేస్తున్న కార్యక్రమాలని వివరించారు. పొత్తూరి జయలక్ష్మి సభను సమన్వయ పరిచారు. సభకు ముందు కడియాల ప్రభాకరరావు గానం చేసిన లలిత సంగీతం ప్రేక్షకులను అలరించింది.

కవితలపోటీ విజేతలైన డా॥ సోమిశెట్టి వేణుగోపాల్, పేరి అన్నపూర్ణ, జె.శ్యామల, ఎన్.లహరి, సయ్యద్ జహీర్ అహ్మద్, కృష్ణ పొట్లచెరువు కార్యక్రమానికి విచ్చేసి బహుమతులను స్వీకరించగా..... కవితా సంకలనంలో కవితలు రాసిన కవులైన కాచాపురం పాపేశ్వరశర్మ, పి.శ్రీధర్, ఎ.బాబురావు, పరిమి వెంకట సత్యమూర్తి, తంగిరాల చక్ర వర్తి, చోడవరపు నాగేశ్వర రావు, ముఖచిత్రం అందించిన కె.వి.కృష్ణారావు వేదికపైన పుస్తకాన్ని స్వీకరించారు.

కవితల పోటీ విజేతలు

'ఎదురు చూపులు' కవితా సంకలనాన్ని అందుకుంటున్న కవులు

అపురూప రేఖావతారం!

వచనమై ప్రవచనమై
మాటలకు మూలమై
మనోభావాలకు ప్రత్యక్ష రూపమై
అంతరంగాలకు ఆత్మ చక్షువై
గాన హారమై
గళ రవళియై
వాదమై వాయిద్యమై
ధ్వని శ్రేణులకు ప్రాణ తరంగమై
కళల మాలలకు మూల దారమై
సకల జీవన రంగులకు
అభినవ కుంచెయై
సంస్కృతి పాదాలకు పారాణి రేఖయై
భాషలకు ఆత్మయై
సాహితీ సామ్రాజ్ఞియై
మనుష్య మనుగడకు సదా
సవ్య మార్గదర్శినియై
విశ్వనయనమై
జీవ చేతనమై
విడివిడిగా ఒదిగితే
పరిమళించు పద ప్రసూనమై
గుంపుగా గుమిగూర్చితే
ఒంపుసొంపుల గుణ గుచ్ఛమై
అలంకరణకు జ్ఞాన కంకణమై
గుర్తింపునకు శిరోమకుటమై
ప్రపంచ ప్రగతి రథానికి
ప్రత్యక్ష ఇంధనమై
పరిపరి విధముల ప్రజ్వలించే
పర్యాయం లేని ప్రదాయినిగా
వెలుగొందే అక్షరం..
ఓ అపురూప రేఖావతారం.
మానవజాతిని అనుగ్రహించిన
ఏకైక శక్తి స్వరూపిణి!

-ఆచార్య కడారు వీరారెడ్డి
9392447007

శూన్యం..

ప్రేమనంతా నీరు చేసి
పూలమొక్కలకే పోసెను
బిందుబిందువు సేకరించి
మొక్కమొక్కకొరకు దాచెను
మొక్క పెరిగెను మొగ్గ విరిసెను
పూలుపూలుగ తోట మురిసెను..!.
ఇటుక ఇటుక పేర్చుకుంటు
పటుతరమ్ముగ గోడగట్టెను
కుంగకుండగ వంగకుండగ
వెన్నుపూసనె ఖర్చుపెట్టెను
నీడనిచ్చే గూడుగా
గోడ నిలిచెను
గూడు గెలిచెను..,
ఉన్నదంతా ఊడ్చి ఊడ్చి
కన్నబిడ్డల కలలకిచ్చెను
చెమట చుక్కల చేర్చిచేర్చి
భవిష్యపథమును తీర్చిదిద్దెను
బిడ్డలంతా
ఎదిగిపోయిరి
రెక్కలొచ్చి లెక్కలొచ్చి
బిడ్డలంతా ఎగిరిపోయిరి
వెనుకచూపె లేకుండా
ఎటకు ఎటకో వెళ్ళిపోయిరి...,
తోట నిలిచెను
గూడు తలచెను
శూన్యమొక్కటి ఆవరించగ
మనిషి ఒక్కడె ఆగిపోయెను
కూలిపోయెను
వాడిపోయెను.
వెర్రికలలు వెక్కిరించగ
మనిషి మాత్రమె
ఓడిపోయెను!

-డా॥కాసర్ల నరేశ్ రావు
9441406252

తెలుగు భాష వైభవాన్ని నేటి తరాలకు తెలపాలి
-డా॥కె.వి.రమణాచారి

పుస్తకాన్ని ఆవిష్కరించిన డా॥కె.వి.రమణాచారి.

తెలుగు భాష సంపద అనంతరం. అపురూపం అని దాని వైభవాన్ని నేటి తరానికి తెలపాలని విశ్రాంత ఐఏఎస్ అధికారి డా॥ కే.వీ. రమణాచారి అన్నారు. చిమ్మపూడి ఫౌండేషన్ పంచమ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం త్యాగరాయ గానసభలో యువ భువన విజయం సాహిత్యం సంగీత రూపకం ప్రదర్శించారు. హైస్కూల్ విద్యార్థులతో పాటు ఇంజనీరింగ్ విద్యార్థులు కూడా ఈ రూపకంలో పాల్గొని పద్యాలతో సంభాషణలతో రక్తి కట్టించారు. అనంతరం జరిగిన సభలో డా॥ రమణాచారి ముఖ్య అతిథిగా పాల్గొని కళాకారులను సత్కరించి మాట్లాడారు. పెద్దలు ఎందరో గతంలో భువన విజయం రూపకం ప్రదర్శించి ప్రాచుర్యం కల్పించారని దాని కొనసాగింపుగా యువత అందిపుచ్చుకుని కొనసాగించడం ప్రశంసనీయమన్నారు. సాధన నరసింహాచార్య, రచయిత్రి డా॥ ముక్తేవి భారతి, లలితాణి, మల్లాప్రగడ శ్రీ మన్నారాయణమూర్తి, యదుమోహన్ పాల్గొన్నారు. చిమ్మపూడి శ్రీరామమూర్తి కార్యక్రమం నిర్వహించారు. మురళీకృష్ణ చిమ్మపూడి సుభాషిణి అరుణకుమారి, అప్పాజీ, శ్రీనివాస్ సమన్వయం చేశారు.

జయరాములు రచించిన మూడు గ్రంథాల ఆవిష్కరణ

పుస్తకాలను ఆవిష్కరిస్తున్న తెలుగు యూనివర్శిటీ వి.సి. ఆచార్య వెలుదండ నిత్యానందరావు తదితరులు

ప్రముఖ రచయిత డా॥ బి.జయరాములు రచించిన అమెరికా- హైదరాబాద్-2, ఆత్మీయులు, శ్రీ శంభులింగేశ్వర శతకం గ్రంథాల ఆవిష్కరణ సభ ఆదివారం త్యాగరాయ గానసభలో కమలాకృష్ణ కళాకౌముది, కుసుమ ధర్మన్న కళాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించారు. పుస్తకాలను ఆవిష్కరించిన తెలుగు యూనివర్సిటీ వీసీ ఆచార్య వెలుదండ నిత్యానం దరావు మాట్లాడుతూ ఈ రచనలు బాల్యస్మృతులు, విదేశీ విశేషాలు, కుటుంబ సంబంధాలను వివరించాయన్నారు. ఆవిష్కృత గ్రంథాలను ఆచార్య పి. వారిజారాణి విశ్లేషణాత్మకంగా పరిచయం చేశారు. ఆచార్య కసిరెడ్డి వెంకటరెడ్డి, రాధాకుసుమ, సుశీల, దశరథరామయ్య, సోమయ్య శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

పుస్తక సమీక్ష

మంచిని పంచే (పెంచే) కథలు

ప్రతులకు:
డా॥డి. ప్రేమ్‌చందర్
ఎం.ఎస్. ఓఫ్ సర్జియన్,
ఫ్లాట్ నెం.3బి, విశ్వసాయి
ఎస్.ఆర్.కె. స్కూల్, స్ట్రీట్ నెం.3,
మాగుంట లేఅవుట్,
నెల్లూరు-524 004. ఏపి

కాలం గడిచిన కొద్దీ, తెలుగు సాహిత్యంలో కథా ప్రక్రియ ప్రముఖ స్థానాన్ని ఆక్రమిస్తున్నది. కథా ప్రక్రియ తెలుగు సాహిత్యం అంత ప్రాచీనం కాకున్నా, బ్రిటీష్‌వారి పాలన, వారి సాహిత్యం మనల్ని ప్రభావితం చేసింది. క్షుప్తత, నీతబోధ, సన్మార్గ ప్రేరేపణ కథల ముఖ్య లక్షణాలు. వీటికి తోడు పత్రికలు, అన్-లైన్, వాట్సాప్, ఆడియో, వీడియో సౌకర్యాలు వీటి బహుళ ప్రాచుర్యానికి దోహదం చేసింది. ఎక్కువ మంది రచయితలు/ రచయిత్రులు కూడా, ఈ ప్రక్రియను ఎంచుకుంటు న్నారు.

రచయిత్రి సందడి అరుణకు మారి అలియాస్ అరుణ సందడి (కలం పేరు రాగ) విద్యాధికురాలు. బహుముఖ ప్రజ్ఞాశాలి. చిత్రలేఖనం సాహిత్యం, వీణానాదం, నాట్యం వీరి అభిరుచులు. సాహిత్య ప్రక్రియలో వచన కవిత్వం, భావ కవిత్వం, లఘు కవిత్వం, నానీలు కథలు, సమీక్షలు వ్యాసాలు, గజల్స్ రాస్తారు. పుష్కరకాలంగా పలు పురస్కారాలు, సన్మానాలు బిరుదులు అందుకున్నారు. **'చిగురించిన చిరునవ్వు' 'ఆత్మీయ బంధాలు'** వీరు రచించిన కథా సంపుటాలు.

చిరునవ్వు చిగురింపచేసే వీరి కథా సంపుటిలో 25 కథలున్నాయి. చిత్రలేఖనం ఇష్టమైన కళ. అట్టమీది బొమ్మకు అరుణగారే రూపకల్పన చేసారు. ఆకట్టుకునే సౌరభ సుమాలు, శిఖరాయమానంగా చిరు నవ్వు చిందించే ప్రౌఢముఖ చిత్రమై అలరారే ఈ సంపుటిలో ఆచార్య కొలకలూరి ఇనాక్ డా॥ ఏనుగు నరసింహారెడ్డి, డా॥ పెళ్ళకూరు జయప్రద-నెల్లూరు, మన్నెం శారద, డా॥ పాతూరి అన్నపూర్ణ మరియు రచయిత్రి శాంతికృష్ణగారలు తమ ముందు మాటలతో సంపుటికి అందం చేకూర్చారు. పటాటోపంలేని ఆడంబరంలేని, సుందర భాషా ప్ర యోగంగా ఇనాక్‌గారు కొనియాడారు. కథా గమనం, భాషశైలి, బావున్నాయన్న 'కితాబు' ఏనుగువారు ఇచ్చారు. కథల్లో రచయిత్రి మంచి మనసు కనిపించిందంటూరు డా॥. జయప్రదగారు. ఎత్తుగడ, కథనం, బావుందన్నారు మన్నెం శారదగారు.

అవసరాల కోసం బతకటం, ఆశయాల కోసం బతకటంలోని తేడా మొదటి కథ **'స్వయం కృతం'**లో చెప్పారు. విద్యార్థి దశలోనే కష్టపడితే తప్ప మంచి భవిష్యత్తు ఉండదని ఈ కథ చెబుతుంది. అనాథాశ్రమంలో దివ్య వైశాలికి పరిచయం అవుతుంది. భర్త ప్రకాశ్ కొడుకులు ఇద్దరు. జీవితం సాఫీగా నడుస్తోందనుకున్న సమయాన ప్రకాశ్ మరణిస్తాడు. విదేశాల్లో ఉన్న బిడ్డలు ఆదుకోరు. ఆనాథాశ్ర మంలో ఉన్న ఆ వైశాలికి ఆసరా అవుతుంది. పేగు బంధం కన్నా, ఆత్మీయ బంధం చాలా గొప్పదిగా నిరూపించే ఈ **'అమ్మ విలువ'** కథలో కరుణ చిప్పిలుతుంది. వీరే కాదు.. స్నేహిత (కలిసిన మనసులు- కథ). అవయవదానాన్ని ప్రోత్సహించే కథ **'చీకటి కన్నుల్లో వెలుగుల నవ్వులు'**, భార్యకాని, భర్తకాని పిల్లల్ని కనే స్థితిలో లేకపోతే ఏం చేయాలి? సూచించే మా (విడాకులు). ఎంత ధనం ఉన్నదనేది కాదు! ఎంత గొప్ప మనసు ఉన్నదనేదే ముఖ్యం అని చెప్పే **'మారిన మనసు'** కథ. దివ్యాంగ రాలైన బిడ్డను అసహ్యించుకోకుండా, ప్రేమామృతాన్ని కురిపించితే- ఆ దంపతుల జీవితాల్లో చిరునవ్వు చిగురిస్తుందని చెప్పే టైటిల్ కథ. నమ్మకం మనిషిని ఉన్నతంగా తీర్చిదిద్దుతుందని చెప్పే మరో కథ- ఇవన్నీ మంచి కథలు మనలో మంచిని పెంచే కథలు.

రచయిత్రి రెండవ సంపుటి **'ఆత్మీయ బంధాలు'** డా॥ పాతూరి అన్నపూర్ణ, ఎ. జయప్రకాశ్, ప్రముఖ కథకులు వడలి రాధాకృష్ణ, మౌనశ్రీ మల్లిక్, రచయిత్రి గజల్స్, పద్యరచనా కవయిత్రి చయనం అరుణాశర్మ (బెంగుళూరు) వంటి ప్రముఖులు తమ ముందు మాటలతో సందడి చేసారు. జీనామోద యోగ్యంగా రచనలు అరుణ 'సందడి'గారు చేస్తున్నారని ప్రశంసలు కురిపించారు.

పిల్లలను తమ తమ అభిరుచు లకు అనుగుణంగా పెంచితే, శిక్షణ ఇప్పించితే వారు ప్రావీణ్యత సంపా దిస్తారు. తమకూ, తమ తల్లిదండ్రు లకు మంచిపేరు తెస్తారు అని చెప్పే కథ **'పట్ట గొలుసులు'**. పిల్లల అభిరు చులకు అనుగుణంగా వారి కెరీరు లేదా పెళ్లి నిర్ణయించాలన్న మరో కథ సంతృప్తి. కూరగాయలమ్ముకునే రామయ్య కూతురు నీరజ. నీరజకు పై చదువులుకు పోవాలని ఉంటుంది. చదివించే శక్తిలేని రామయ్య నీరజపెళ్ళి తలపెడుతాడు. సంతోష తీసుకున్న 'బోల్డు స్టెప్' వల్ల నీరజ పై చదువులకు పోతుంది. ఎదుటివారి సంతోషంలోనే తన సంతోషం దాగి ఉంటుందన్న మంచి మాటలో రచయిత్రి మంచి మనసు తేటతెల్లం అవుతుంది. ఒకరికి సాయపడటమే తన కర్తవ్యం. వారిని ఎండవానల నుండి, తాను ఎండుతూ తడుస్తూ కాపాడుతుంది. గొడుగు ద్వారా రచయిత్రి పాఠకులకు మంచి సందేశం ఇచ్చారు. కొన్ని బంధాలు ఎలా ఏర్పడుతాయో తెలియదు. కాని మంచులా మల్లెలా చల్లదనం పంచుతాయి. చేయవలసిందల్లా, మనకు చేతనయినంత వరకు వారికి సాయం చేయటమే! అలా సరస్వతి (సరు)కు చేసిన సాయం. సరస్వతి జీవితం ఎంతటి విలువైనదో టైటిల్ కథ **'ఆత్మీయ బంధం'** చదవాల్సిందే!

చిన్న కథలు (ఒకటి రెండు తప్పించి) అయినా, కథల నిండా మానవత్వం, మంచిదనంతో నింపి రచయిత్రి తన సహృదయతను చాటుకున్నారు. అభినందనలు.

- కూర చిదంబరం
సెల్: 8639338675

చరిత్ర గర్భంలో దాగిన పురైల కథ చెప్పగలిగిన వాడు కదా కవి!

పొగ మంచుతో ఢిల్లీ కప్పబడుతుంది
జనానికి ఊపిరి ఆడటం లేదు
ఆక్సిజన్ అందడం లేదు
హర్యానా పంజాబ్ నుండి
పొగ ప్రవాహంగా వస్తుంది
తగలబెట్టబడిన పంటలు
కమురువాసన వస్తున్నాయి
గాజాపై అగ్నివర్షం
విద్యాలయాలు ఆసుపత్రులపై పెనుదాడి
కరుణ చెందాల్సిన చోట కన్నీరు కురుస్తుంది
రష్యా దాడులతో ఉక్రెయిన్ విధ్వంసం అవుతుంది
కార్ల్‌మార్క్స్ చెప్పిన సామ్రాజ్యవాదం
రష్యా నియంతృత్వంలో ఈనాడు కనిపిస్తుంది
వర్షం కురుస్తున్నట్లు మారణాయుధాలు
ప్రపంచం రాను రాను సంక్షోభంలో ఉంది
భూమి పొరలను తవ్వి
ఇసుక, గ్యాస్, గ్రానైట్ పాలకులు అమ్ముకుంటున్నారు
కొందరు దేహాన్ని మేధస్సును కుదువ పెడుతున్నారు
దేహానికి ఉన్న శిల్పాన్ని ఛిద్రం చేస్తున్నారు
ఒకనాడు వారి రూపు అపురూపం
ఇప్పుడు వారి రూపం వికృతం
ఏమి తింటున్నారు?
ఏం అనుభవిస్తున్నారు?
వారు గుర్తించడం లేదు!
అనుభూతి లేని యాంత్రిక గమనం
నోరూ రుచి తప్పింది
తినడం శక్తి కోసమో ఆకలి తీరడం కోసమో కాదు
అదొక వ్యసనం
ఇకపోతేఅతన్ని ప్రేమించి చేసుకుంది
అతన్ని కోర్కెలు ఇచ్చే
యంత్రంగా మార్చాలని చూసింది
"నువ్వు నన్ను ప్రేమించావా?
నీ కోర్కెలను ప్రేమించావా"
అని ఆమెను అడిగాడు
ఆమె రెండు అన్నది
"రెండు సాధ్యం కాదు
నన్ను ప్రేమిస్తేనే కలిసుందాం" అన్నాడు
ప్రేమకు తర్కం ఉంది
ప్రేమకు విశ్లేషణ ఉంది
ప్రేమకు వాదం ఉంది
ప్రేమ సమన్వయంలో ప్రతిఫలిస్తుంది
ప్రేమలో త్యాగాలు కరువవుతున్నాయి
ప్రేమ ఆకర్షణ కాదు సుమా!
ఒకనాడు భర్త చేత పీడించబడే వారుఎక్కువ
ఇప్పుడు భార్యా బాధితులకు కూడా ఎక్కువే!
ఆహారం, ఆహార్యం, నివాసం
వాహనాన్ని దాటారు
మై పూతలు, విహారాలు, ఆడంబరాలకు
అలవాటు పడుతున్నారు
పేరుకు డిగ్రీలు చదివారు
సినిమా పేర్లే చెప్పగలరు
దేశాల పేర్లు కూడా తెలియదు
వస్తు వ్యామోహితమైన ముచ్చట్లు
ఏడు రంగుల చీరల కోసం
ఏడు లక్షల మాటలు
మార్కెట్ చేసిన బొమ్మల వీరు?
మన దేశానికి హెూం మినిస్టర్ పేరు చెప్పలేరు!
"చైల్" రెండో పెళ్లిలో ఆర్భాటాల చెప్పుకుంటారు
ఎవరి విడిపోయి
రెండవ పెళ్లి చేసుకుంటున్నారు
వీరికి కంతకా వచ్చును!
ఈ మధ్య విస్కీ బ్రాండ్ల గురించి
మాట్లాడుకుంటున్నారు
పబ్బులకు క్యూ కడుతున్నారు
'సిగార్' కాల్చటం ఫెమినిజం అంటున్నారు
'ఎక్స్ఫోజ్' కల్చర్‌తో మురిసిపోతున్నారు
పెద్ద పెద్ద కులాలు వారమని చెప్పుకుంటున్నారు
చిన్న చిన్న బుద్ధులు
మళ్లీ గుడి గోపురాలు తిరుగుతుంటారు
పిల్లలు మీద చూపులేదు
చిన్నప్పుడే పిల్లలకు సెల్‌ఫోన్స్,
ట్యాబ్‌లు అందిస్తున్నారు
బూతు బొమ్మల కల్చర్‌కు అలవాటు పడుతున్నారు.
క్రెడిట్ కార్డుల వినియోగం పెరిగి
డిప్రెషన్‌కు గురి అవుతున్నారు
నిజానికి!
యువత ఇన్‌స్టాగ్రామ్‌లో తనకు
లైక్ చేసిన వాడి కోసం
గోడలు దూకుతున్నారు
తల్లిదండ్రులతో అన్నతాలు చెబుతున్నారు
స్వీయ వ్యక్తిత్వాన్ని పోగొట్టుకుంటున్నారు
ఒక ప్రక్క పురుష పుంగవులు
అక్రమ సంపాదనతో
కొంపలు నింపుతున్నారు
ఇప్పుడు
అధికారుల పిట్టగోడల్లో ఇటుకలు లేవు
బంగారు బిళ్ళలు దొరుకుతున్నాయి
ఆ కవులు భజంత్రీలు అయ్యారు
పదవుల కోసం పాలకుల
చరణ కింకిణులయ్యారు
అక్షరంలోని శిల్పాన్ని ధ్వంసించి
స్తుతులకు నుతులకు
తలలు అమ్ముకుంటున్నారు
కవి అంటే ఎవరు?
చరిత్ర గర్భంలో దాగిన
పురైల కథ చెప్పగలిగినవాడు కదా!
నడిసంద్రలో నావికుడి
గుండె చప్పుడు వినగలిగినవాడు కదా!
సమరంలో కొడుకు తుపాకుల మధ్యలో ఉన్నప్పుడు
తల్లి కన్నీటి కథ చెప్పగలిగిన వాడు కదా!
ఆ చిత్రకారుని చిత్రంలోని
పడితి కన్నుల్లో దాగిన
వ్యంగ్య భాషను
అభివ్యక్తి చేయగలిగిన వాడు కదా!
అక్షరం ఒక జీవన పతాక!
ఐదు వాక్యాలతో ప్రపంచాన్నే
తథాగతుడు మార్చలేదా?
మూడు నినాదాలతో బాబాసాహెబ్
అస్పృశ్యల్లో అగ్ని కణాలు రగిలించలేదా?
ఒక వేమన కవి జీవిత సత్యాలను
అక్షరాల్లో పొదగలేదా!
అక్షరానికి భయం లేదు
అక్షరం మౌఖికమైనదైనా,
లిఖితమైనదైన అది జీవన చిత్రమే
అక్షర కిరీటాన్ని దరిద్దాం!
వ్యక్తిత్వ నిర్మాణ దక్షులమవుదాం!
ఇది వ్యక్తిత్వ నిర్మాణ యుగం!
నిన్ను ఎవరో శిల్పించరు
నీ జీవన శిల్పానికి శిల్పివి నీవే
అదే ఈ యుగ సూత్రం

-డాక్టర్ కత్తి పద్మారావు
9849741695

డా॥పి. విజయలక్ష్మి పండిట్ "హృదయాంజలి" గజళ్ళు-4 పుస్తకానికి కవి, సినీ గేయ రచయిత, గజల్ కవి, గజల్ విశ్లేషకులు బిక్కి కృష్ణ రాసిన ముందు మాట ఇది.

అద్భుత గజల్ యోగ సంపాత 'హృదయాంజలి'

Ghazal is the pride of urdu poetry

- Rashid Ahmed Siddiqui

గజల్ ఉర్దూ కవిత్వంలో ప్రాముఖ్యం వహించిందని ఆర్.ఎ. సిద్దిక్ అన్నా, వాస్తవానికి గజల్ ప్రక్రియకు మూల లక్షణాలు 7వ శతాబ్దంలోనే అరబిక్ కావ్యాలలో తళుక్కుమన్నాయి. ఇస్లామిక్ సుల్తానుల, సూఫీ అతీంద్రియ గురువుల ప్రభావంతో గజల్ ఒక గేయ ప్రక్రియగా ప్రారంభమైంది. 'ఖసీదా' పేరుతో ఆనాటి రాజులను కీర్తించే గేయం తర్వాతి కాలంలో గజల్‌గా ఆవిర్భవించడం చారిత్రక శుభపరిణామం. గజల్ ఎప్పుడో (7వ శతాబ్దం) పుట్టినా అది 12వ శతాబ్దానికి భారత ఉపఖండం చేరింది.

తెలుగులో ఈ ప్రక్రియ దాశరథితో మొదలై డా॥ సి. నారాయణ రెడ్డితో బహుళ ప్రాచుర్యంలోకి వచ్చింది. 2012 వరకూ ఒకరో ఇద్దరో గజల్ కవులుగా చెలామణి అయినా.. గత ఐదారేళ్లుగా తెలుగులో వందలాదిమంది గజల్ కవులు ఒక ప్రవాహంలాగా దూసుకొచ్చారు. దానికి కారణం గజల్‌ను తెలుగు కవులు బాగా ఆకళింపు చేసుకోవడమే. అందుకు కెరియరిస్టు గజల్ కవులను పక్కకు తోసి సోషలిస్ట్ గజల్ కవులు విస్తృతంగా కొత్త కవులకు శిక్షణనిచ్చి వారిచేత గజల్స్ రాయించడమే. అంతేగాక డా॥ విజయలక్ష్మి పండిట్‌గారి లాంటి సహృదయులు గజల్ ప్రక్రియను ప్రేమించి, ఆరాధించి, ఆస్వాదించి, అనురక్తితో, భక్తితో గజల్స్ రాయడమే గాక... గజల్ కవుల సూఫీతత్వ ప్రభావితురాలై 'యోగరేఖలు', 'రాగరేఖలు', 'విశ్వరాగం'- ఇప్పుడు 'హృదయాంజలి' వెలువరించే వరకు ఆగిపోలేదు. ఇంతవరకు ఆమె కేవలం గజల్ కవయిత్రిగా ఆగిపోక 'విశ్వపుత్రిక గజల్ ఫౌండేషన్' బిక్కి కృష్ణతో కలిసి స్థాపించి, తెలుగు గజళ్లను విశ్వవ్యాప్తం చేయడానికి విశ్వప్రయత్నం చేస్తున్నారు. హైదరాబాద్, విజయవాడ లాంటి నగరాల్లో పెద్ద పెద్ద గజల్ సభలు, వర్క్‌షాప్‌లు, ముషాయిరాలు, గాన విభావరులు నిర్వహించి వందలాది మంది గజల్ కవులను వెలుగులోకి తెచ్చారు. ఎందరో గజల్ కవుల సంకలనాలు, పరిశోధనా గ్రంథాలు ప్రచురిస్తూ.. తెలుగు గజల్ కవులకు రచయితలకు, పరిశోధకులకు పెద్ద దిక్కుగా నిలిచారు. యూనివర్సిటీలు, అకాడమీలు చేయాల్సిన గజల్ సాహిత్య సేవను డా॥ పి. విజయలక్ష్మి పండిట్ లక్షలాది రూపాయల తన సొంత డబ్బును వెచ్చించి తెలుగు గజల్ ప్రక్రియ సేవకు అంకితం కావడం నిజంగా.. తెలుగు గజల్ కవుల అదృష్టం. ఈ నేపథ్యంలో ఆమె - మరో గజల్ సంకలనం తెస్తున్నారు. అదే 'హృదయాంజలి' నవ్యభావాల రసాంజలి.

గతంలో ఉర్దూ సాహిత్యంతో గాఢ పరిచయమున్న దాశరథి, సినారెలు తెలుగు గజల్ ప్రక్రియకు ఆద్యులు, పూజనీయులయ్యారు. ఇప్పుడు వారి వారసురాలుగా వందలాదిమంది గజల్ కవుల వందలాది గజల్ సంకలనాలు వెలువరించడం తెలుగు సాహిత్యంలో గొప్ప పరిణామం. వస్తువు, ప్రతీకలు, గజల్ భాష, అభివ్యక్తి, కాఫియా, రదీఫ్‌లు, ఉర్దూ గజల్ వాతావరణ కల్పన- తెలుగులో సాధ్యంకాకపోయినా తెలుగు గజళ్లను తెలుగు సౌందర్యం, తెలుగు సంస్కృతి, తెలుగు తాత్వికత, తెలుగు కవితాత్మక ప్రతీకలతో గతం కన్నా ఇప్పుడే చాలామంది గజల్ కవులు అద్భుత గజల్ సంపుటాలు వెలువరిస్తున్నారు. వీరు విమర్శకుల గజల్ సూత్రాలను పట్టించుకోక తమదైన శైలిలో, తమదైన భావుకతతో, చమత్కారంతో, తాత్వికతతో అద్భుతమైన గజల్స్ రాయడానికి డా॥ విజయలక్ష్మి పండిట్, వి.జి.ఎఫ్ ఫౌండేషన్ వర్క్‌షాపులు కూడా ప్రధాన కారణమనే చెప్పవచ్చు.

తెలుగు గజళ్లపై సామల సదాశివ, గుంటూరు శేషేంద్రశర్మ, డా॥ కోవెల సంపత్‌కుమారాచారి, పటేల అనంతయ్య లాంటి పెద్దలు తమవైన అభిప్రాయాలు వ్యక్తం చేశారు. వీరు కొందరి గజళ్లను పరిశీలించి, వాటికి ముందుమాటలు రాస్తూ పరోక్షంగా తెలుగులో గజల్ ప్రక్రియ అభివృద్ధి, రచనా శిల్పం అసాధ్యమేమో అన్న అభిప్రాయాలు వెలిబుచ్చారు. దానికి కారణం వీరంతా ఉర్దూ గజల్ రూప నిర్మాణాలను, తాత్వికతను, దర్ద్ (బాధ)ను వ్యక్తం చేయడానికి అసలు సిసలైన భాష ఉర్దూ అని భావించడంగా నాకు అనిపిస్తుంది. పైగా ఉర్దూలోలాగ

> "తెలుగులో ఈ ప్రక్రియ దాశరథితో మొదలై డా॥ సి. నారాయణ రెడ్డితో బహుళ ప్రాచుర్యంలోకి వచ్చింది. 2012 వరకూ ఒకరో ఇద్దరో గజల్ కవులుగా చెలామణి అయినా.. గత ఐదారేళ్లుగా తెలుగులో వందలాదిమంది గజల్ కవులు ఒక ప్రవాహంలాగా దూసుకొచ్చారు. దానికి కారణం గజల్‌ను తెలుగు కవులు బాగా ఆకళింపు చేసుకోవడమే"

తెలుగులో కాఫియాలు వుండవని, దొరకవని, గజలియెత్, దవాదలీర్ టెక్నిక్‌లు తెలుగులో సాధించడం అసాధ్యమని మొదటితరం, రెండో తరం గజల్ కవులు పరిశోధకులు భావించడం వల్ల, భయపెట్టడం వల్ల చాలా కాలం తెలుగు కవులు గజల్స్ రాయడానికి భయపడ్డారు. దక్షిణాది భాషల్లో ముఖ్యంగా కన్నడం, తమిళ భాషల్లో కాఫియాల గురించి ఎవరూ పట్టించుకోరు. అందుకే కన్నడభాషలో కాఫియాలు లేని గజల్స్ రాస్తూ తెలుగులోకన్నా ఎక్కువ మంది గజల్ కవులు వెలుగులోకి వచ్చారు గతంలో...

ఇప్పుడైతే తెలుగులోనే వందలాది మంది (సుమారు 500 పైనే) గజల్ కవులు తమ ఉనికిని చాటుకోవడం ఆశ్చర్యమనిపిస్తుంది. దానికి చాలా సంస్థలు, వ్యక్తులు, డిజిటల్ మీడియా, వాట్సప్ గ్రూపులు కారణాలుగా నాకు కనిపిస్తాయి.

ఇక డా॥ పి. విజయలక్ష్మి పండిట్ రాసిన 'హృదయాంజలి' గజల్ సంపుటిలోకి తొంగి చూస్తే.. ఆమె పరిపూర్ణ భావస్థితిలో, పరిపక్వమైన ప్రతిభతో, సాధికారిక స్వరంతో, వస్తువైవిధ్యం తో, శిల్పశోభితమైన గజళ్లు రాసి.. ఇలా ఒక సంకలనంగా తెచ్చారని నాకనిపించింది.

'హృదయాంజలి' అన్న పేరులోనే ఒక దివ్యత్వం వుంది. ఒక హృదయార్పణ వుంది. మనోగత సమస్త రాగ కింకిణుల శబ్ద తరంగాలను ఎవరో ఒక వ్యక్తికో, ఏదోఒక శక్తికో వినిపించే నమ్రతతో కూడిన నివేదన వుంది. అందుకే-

విశ్వపుత్రిక నీ అక్షయ అక్షర అనురాగంలో

పరిమళించు నీ ప్రేమ భావనను స్మరించనీ!

అంటూ కవయిత్రి ఒక మక్తాలో తన హృదయ నివేదనను, బంధురహిత నిర్మల ప్రేమను భగవంతునికి అర్పిస్తూ అంజలి ఘటించారు. అసలు మతాల్లోని తొలి మిస్రాలోనే 'నీ నీడదారుల్లో నా ప్రేమను చూడనీ' అనడంలోనే కవయిత్రి తాత్విక తటిల్లత తళుక్కున మెరిసింది. 'రాగమాలికను ధరించి కదలనీ', 'ప్రాథమిక సుఖాలు నిష్ప్రయోజనాలు', 'ద్వందాతీత ప్రజ్ఞలో నిరంతరం నను నిలవనీ' ఇలాంటి ఉపనిషత్ వాక్యాల్లాంటి తాత్విక రసగుళికలు డా॥ విజయలక్ష్మి పండిట్‌గారి గజళ్లలో కోకొల్లలుగా కనిపిస్తాయి. ఇలాంటి భావాలు ఊరకే పుట్టవు. ఆత్మ తన అనుభవంతోనే 'ప్రాపంచిక సుఖాలు నిష్ప్రయోజనమన్న దశకు చేరుకుంటే తప్ప.. ఇలాంటి 'షేర్లు'రావు. అందుకే కఠోపనిషత్తు ఆత్మ ముంజిగడ్డ పొరలన్నీ ఊడదీస్తే లోపాలున్న కూసంలాంటి దంటుంది. ఈమె ఆ పొరలన్నీ (రాగద్వేషాలు) ఊడదీసి స్వచ్ఛమైన దైవ ప్రేమకోసం పరితపించే దశలో, యోగస్థితిలో సూఫీతత్వ ప్రభావితమైన ఇలాంటి గజళ్లెన్నో రాయగలిగింది.

'సప్తవర్ణ హరివిల్లుపై రసరమ్య ఊయలూగి తూగి

అనంతానంద దిగంతాల అంచులకేసి నడిచాయో' అంటారు రిమరో గజల్‌లో. ఈ భావన ప్రతీకాత్మక Bliss oriented expression 'సర్వజీవుల హృదయాకాశంలో నేనున్నాను' అన్న గీతాచార్యుని మాట ఈ మిశ్రాకు వర్తిస్తుంది. 'సప్తవర్ణ హరివిల్లు' మాయకు ప్రతీక.

ఊయలలూగి తూగడమంటే.. మాయామోహాజగతి నశ్వరసుఖాలు అనుభవించడమే. అందులో ఏమీ లేదని తెలుసుకున్నాక భగవంతుని జతలో అతని అవ్యాజపు ప్రేమనీడలో అనంతానంత దిగంతాల అంచులకేసి నడిచాయో అనగలుగుతుంది. అనుభవమైతే తప్ప, అనుభవించాక తప్ప ఇలాంటి ఆధ్యాత్మిక (సూఫీతత్వ) భావాలు గజల్ 'షేర్'లుగా శిల్పీకరించడం సాధ్యంకాదు. ఈ కవయిత్రి రవీంద్రుని గీతాంజలిని తెలుగులోకి అనువదించడం వల్ల ఇలాంటి Mystic symbolic poetic మిస్రాలు రాయగలిగింది.

నిరంతరం నీనామ జపతపమే ఈ విరహిణికి

నా జీవిత ఆలంబన నీవే ఈ మాయల లోకంలో!

ఇక్కడ కవయిత్రి ఎవరినామజపం కోసం తపిస్తోంది? ఈమె 'భౌతిక లోక విరహిణి' కాదు. భగవంతుని ప్రేమకోసం తపించే విరహిణి. ఎందుకు.. ఈ మాయాలోకంలో అలాంటి పవిత్రప్రేమ లభించదు. ఎందుకంటే భగవంతుని ప్రేమ ఒక్కటే నా జీవిత ఆలంబన అంటూ 'మిస్రా' లో కవయిత్రి ఆత్మ ధ్వనించింది. అందుకేనేమో.. ఇదే గజల్ రెండోషేర్ మొదటి మిస్రాలో..

"ఏమి మాయ చేసినావో ఈ ప్రేమ పిపాసినిని' అంటారు. 18వ శతాబ్దపు ఉర్దూ కవులలో అగ్రగణ్యుడైన మీర్ తఖ్ మీర్ తన గజళ్లలో ఇలాంటి భావాలే వ్యక్తం చేశారు.

క్యా యిష్మేమే హువాహై ఐ మీర్ తేరహోల్

(ప్రణయమెంత కుంగదీసె.. కాంచినావా కవీ ఓ మీర్) అంటారు. విజయలక్ష్మి పండిట్ ప్రేమ (సూఫీతత్వం) మీర్ ప్రణయం భౌతికమైన కోరిక (మోహం)

అమీర్ ఖుస్రూ ప్రేమ ఆధ్యాత్మికం. గాలిబ్ ప్రేమ భౌతికం. ఈ కవయిత్రి ఈ సంపుటిలో మీర్ భౌతిక ప్రేమను, అమీర్ ఖుస్రూ అలౌకిక ప్రేమను అనేక గజల్ షేర్లలో నిక్షిప్తం చేసి.. తెలుగు, ఉర్దూ భావాల సారళ్య సారూప్యత సాఫల్యతను సాధించారు.

ప్రణయమెంత మధురమో విరహమంత తీపి

నిరీక్షణెంత నరకమో నిను చేరని దినాన

అనడం.. గాలిబ్ 'అగర్ ఔర్ జీతే రహతే యహి ఇంతే జీర్ హోతా (ఎంత కాలమిక బతికిన ఎదురుచూపె గతిమాత్రము) అనడానికి (రెండు మిస్రాలు.. ఇద్దరి గజళ్లలో రెండో మిస్రాలు కావడం యాదృచ్ఛికం) ఎంత సామీప్యముంది? గాలిబ్ మిస్రా కన్నా డా. విజయలక్ష్మి పండిట్ మిస్రాలో వేదన తీవ్రత వియోగ పూరిత ఆత్మఘోషగా వినిపిస్తోంది.

సూఫీతత్వ గురువుల ప్రభావం 6వ శతాబ్దపు అరబ్ కావ్యాలలో గజల్ మూలతత్వమై ప్రకాశించాక ఇహ అప్పగినుండి అరబిక్, ఫారసీక గజల్ కవుల గజల్ ఆత్మగా సూఫీతత్వం మారింది. మీర్ తఖ్మీర్, అమీర్ ఖుస్రూ, వలీ మొహమ్మద్ వలీ, ఫైజ్, ఇక్బాల్,

> "డా॥ పి. విజయలక్ష్మి పండిట్ రాసిన 'హృదయాంజలి' గజల్ సంపుటిలోకి తొంగి చూస్తే.. ఆమె పరిపూర్ణ భావస్థితిలో, పరిపక్వమైన ప్రతిభతో, సాధికారిక స్వరంతో, వస్తువైవిధ్యంతో, శిల్పశోభితమైన గజళ్లు రాస్తారు."

పిరాఖ్, మోమిన్, అనీస్, ఔఖ్, హిస్రత్ అష్జర్ మొదలైన ఉర్దూ గజల్ కవులు తమ గజళ్లలో, రూబాయిలలో అనేక అంశాలతో పాటు తాత్వికాంశాలు స్పృశించారు. అయితే తెలుగులో సూఫీతత్వం ప్రభా విభాషితాలు, సుభాషితాలు లాంటి గజళ్లు రాసిన ఏకైక కవయిత్రి (యోగరేఖలు, రాగరేఖలు, విశ్వరాగం గజల్ సంపుటాలు) డా॥ విజయలక్ష్మి పండిట్‌గారనే చెప్పాలి. ఈమె గజళ్లలో అలౌకిక రాగతరంగాలు, యోగ తరంగాలు, అనురాగ బంధాలు, దైవసంబంధమైన భావాలు.. పురాకృత జన్మల విషయ వాసనలు అద్భుత గజల్ షేర్లుగా శిల్పీకరించబడటం నాకు ఆశ్చర్యం అనిపిస్తుంది. రసానందంలో తేలి, ఈమె ఒకానొక సమాధి భావస్థితిలో గజళ్లు రాస్తున్నారా అన్న అనుమానం కలుగుతుంది. లేకపోతే..

ఈ విశ్వజగతిలో జన్మపరంపరల విజయోత్సవాల్లో

తనివితీరని ఉత్సవ తిరునాళ్ల గమ్యాల కేసి నడిచామో!

అనగలరా? జన్మపరంపరలు, ఉత్సవ తిరునాళ్లు అంటే వాటిని గూడా దర్శించి అర్థం చేసుకునే అనుభవం కావాలి. జన్మపరంపరలను ఉత్సవ తిరునాళ్లుగా భావించడం ఎంత గొప్ప దివ్యానుభూతియో కదా! ఇంకా ఈ హృదయాం జలి సంపుటిలో..

దేవా! ఈ అనంతకాలచక్రం తిరుగుతూంది

నిను చేరని ఈ వృధాసమయం దుర్లభం కదా!

×××

నీ ఆలోచనలే నీ జీవితమని బుద్ధుని ఉవాచ

నీలో నిను దిగజార్చే నీ విరుద్ధ కోరికలు చెరగనీ!

×××

ఈ జీవితమే పరమపద సోపానపటం కదా

నిచ్చెనెక్కి పామునోట జారిపడే నాటకం కదా! అంటారు.

ఈ ప్రతీకలు భారతీయ వేద ఉపనిషత్ ప్రతీకల్లా లోతైన భావనలతో మెరవడమే అనలైన సూఫీతత్వజ్ఞానం. నిచ్చెన, పామునోట, పరమపద సోపానం, విరుద్ధ కోరికలు, బుద్ధుని ఉవాచ, అనంతకాలచక్రం.. హైందవ వాంఙ్మయంలోని తాత్విక ప్రతీకలను సూఫీతత్వ గజళ్లతో నిక్షిప్తం చేయడం డా॥ పి.విజయలక్ష్మి పండిట్ గారి విశ్వతాత్విక భావనకు పరాకాష్ట, బుద్ధిజం, హిందూయిజం, ఇస్లాం, క్రిస్టియానిటీ మతాలలో వున్న భగవతారాధనా.. అలౌకిక ప్రేమతత్వం ఈమె గజళ్ల శిల్పధ్వనిలో మౌనంగా, విశ్వధ్యానానాదంగా, మంద్రంగా వినిపిస్తాయి. ప్రేమ వర్షం కురిపిస్తాయి. ఈ ప్రేమ అభౌతికం, ఆధ్యాత్మికం.

విశ్వపుత్రిక నీ వెలుగుదారుల్లో నిత్యసాధనలో

అనన్య జ్ఞానచింతనలో నీను కొలుస్తూ ఉన్నది!

××9

విశ్వపుత్రిక మదిలో పొంగే ప్రేమ అలవు నీవే!

×××

ఈ లోకంలో నీమాయే ఈ దాగుడు మూతలెందుకోయి!

×××

విశ్వపుత్రిక వీక్షణము విశ్వమానవ విలీనం!

×××

ఈ విశ్వపుత్రిక విశ్వదారుల నిరంతర బాటసారి!

×××

విశ్వపుత్రిక జీవిత గమ్యం నీ దివ్యజపం తపం!

×××

ఇలా.. ప్రతి గజల్ మక్తాలో తనేమిటో, తన తాత్వికత, జీవితలక్ష్యం, యోగం, రాగం, భవబంధవిమోచనం, భగవత్ దర్శనం, సర్వమానవాళి హితం, రాగద్వేషాల ఖండనం, అరవిందుని సమగ్ర మూర్తిమత్వ భావన ఈమె గజళ్లలో అక్షరాకృతి దాల్చి దివ్యమధురభక్తి విలసితమై ఆత్మోన్నతిహేతువై, నిర్వాణ మార్గదర్శనమై 'అత్తదీపోభవ' అన్న బుద్ధుని సందేశమై ప్రతి గజల్ ధ్వనిస్తోంది. నాల్గురకాల మానవ చైతన్యం (జాగృత్ - స్వప్న-సుషుప్తి-తురీయ) మాండుకోపనిషత్ సారాంశం ఈమె గజళ్ల నిండా మధురభక్తిగా, సూఫీతత్వంగా, అలౌకిక పారవశ్య భావనాబలంగా, అతీంద్రియశక్తి అన్వేషణంగా, విశ్వప్రేమైక భావోన్మత్త ధ్యానముద్రగా ఈమె గజళ్లు అంతస్సారంగా నా ఆత్మదృగ్గోచరమైంది. ఈమె గజల్స్ చదివాక నాకు ప్రొ॥ డి.యం. రవిప్రసాద్ రాసిన Eternal God గ్రంథంలోని ఈ వాక్యాలు ఇక్కడ ఉటంకించాలని అనిపించింది.

Paramatma lives always in awareness. whoever people lives in awareness of truth and facts learning all the religions dust here become part of existance and travel to meet omnipotence known as eternal God.

ఆ దిశలో ప్రయాణిస్తున్న డా॥ పి. విజయలక్ష్మి పండిట్‌గారు ఎంతో అదృష్టవంతురాలు. ఆమె జన్మే దైవాశిస్సుల జ్ఞానప్రసూనం. ఆమె హృదయాలోచనలు సుమకోమల మంజుల 'రాగరేఖలు'. ఆమె భావాలు అభౌతిక 'యోగరేఖల' కాంతిపుంజాలు. ఆమె రాగద్వేషాతీతమైన విశ్వప్రేమతత్వం. 'విశ్వరాగ' రంజితమైన సూఫీతత్వం. ఆమె వ్యక్తిత్వం పరోపకార పాండిత్య, శౌముఖీప్రతిభావిలసిత మానవతా గ్రంథం.

ఇలాంటి సద్గుణాల ధామంగా, విశ్వచైతన్య జ్ఞానసముపార్జనాయోగంగా ఆమె జీవితం మారడానికి ఆమె తల్లిదండ్రుల ప్రభావం, సద్గురువుల మార్గం, సద్గ్రంథాల పఠనం, ముఖ్యంగా విశ్వకవి రవీంద్రుని గీతాంజలిని తలుగులో అనువదించిన (తొలి అనువాదకురాలు) అనుభవసారం, అనుభూతి సాంద్రత, తాత్వికత కారణభూతమై వుండొచ్చు. ఏది ఏమైనా ఈ హృదయాంజలి గజళ్ల సంపుటి తెలుగు గజల్ చరిత్రలో ఒక తాత్విక భావాల తటిల్లత, పవిత్ర భావాల విద్యుత్‌లత, విశ్వభావాల విశాల హృదయ రాగ యోగ అక్షర సంహిత. కవయిత్రిగారికి అభినందనలు.

-బిక్కి కృష్ణ,
8374439053

నా తెలుగు

తియ్యనైనది నా తెలుగుభాష
తేటయైనది నా తెలుగుభాష
తేనెలుచిందేది నా తెలుగుభాష
తెల్లారివెలుగు నా తెలుగుభాష ॥తియ్య॥.

అకారాంతమైనది నా తెలుగుభాష
అనేకాక్షరాలున్నది నా తెలుగుభాష
అమృతంలాంటిది నా తెలుగుభాష
అమ్మలాబహుగొప్పది నా తెలుగుభాష.
ఉగ్గుపాలతో వచ్చింది నా తెలుగుభాష
ఉయ్యాలూపులలో నేర్చింది నా తెలుగుభాష
గానానికి యోగ్యమైనది నా తెలుగుభాష
శ్రావ్యతకి పేరొందినది నా తెలుగుభాష ॥తియ్య॥.

నన్నయ్య గ్రాంధీకరించింది నా తెలుగుభాష
పోతన్న సొబగులుదిద్దింది నా తెలుగుభాష
గురజాడచేతిలో వ్యావహారికమైనది నా తెలుగుభాష
కందుకూరికలంతో నవలగావతరించింది నా తెలుగుభాష.
విశ్వనాథచే విఖ్యాతిపొందినది నా తెలుగుభాష
శ్రీశ్రీచేత మార్పులుసంతరించుకుంది నా తెలుగుభాష
దాశరథిద్వారా దేదీప్యమానమైనది నా తెలుగుభాష
సినారెచేతిలో పరిపక్వమైనది నా తెలుగుభాష ॥తియ్య॥.

త్యాగయ్యకృతులతో శ్రావ్యమైనది నా తెలుగుభాష
అన్నమయ్యకీర్తనలతో శ్రేష్ఠమైనది నా తెలుగుభాష
రామదాసుపాటలతో రమ్యనైనది నా తెలుగుభాష
ఘంటసాలగళంతో ఘనమైనది నా తెలుగుభాష.

పద్యకవితలతో ప్రత్యేకమైనది నా తెలుగుభాష
వచనకైతలతో వర్ధిల్లుచున్నది నా తెలుగుభాష
కవిసమ్మేళనాలతో కమ్మనైనది నా తెలుగుభాష
దేశవిదేశాలలో దివ్యమైనది నా తెలుగు భాష ॥తియ్య॥

దేశభాషలందు లెస్సయినది నా తెలుగుభాష
విదేశాలలందు వ్యాపిస్తున్నది నా తెలుగుభాష
కవితాసుమాలను కురిపించేది నా తెలుగుభాష
సుమసౌరభాలను వెదజల్లేది నా తెలుగుభాష

విప్లవసాహిత్యాన్ని వెల్లడిస్తున్నది నా తెలుగుభాష
భక్తితత్వాన్ని బోధిస్తున్నది నా తెలుగుభాష
సమాజరుగ్మతలను సరిచేయిస్తున్నది నా తెలుగుభాష
సక్రమమార్గాలను సూచిస్తున్నది నా తెలుగుభాష ॥తియ్య॥

నాలుకలలో నానుచున్నది నా తెలుగుభాష
మదులలో మెదులుచున్నది నా తెలుగుభాష
పుస్తకాలలో నిక్షిప్తమౌతున్నది నా తెలుగుభాష
మస్తిష్కాలలో నిలిచిపోతున్నది నా తెలుగుభాష

విశ్వమంతా వ్యాపిస్తున్నది నా తెలుగుభాష
విన్నూతనంగా ఎదుగుచున్నది నా తెలుగుభాష
భావకయితలందు బాసిల్లుచున్నది నా తెలుగుభాష
సాహితీజగతినందు సవ్వడిచెస్తున్నది
నాతెలుగుభాష ॥తియ్య॥

-గుండ్లపల్లి రాజేంద్రప్రసాద్
సెల్: 7981616630

అద్భుతం పద్మమోహన్ నృత్యం

పద్మమోహన్‌ను సత్కరిస్తున్న జస్టిస్ మాధవి

శరీర కదిలికలు, మనసు సమన్వయం అయితేనే నాట్యప్రదర్శన అర్థవంతంగా ఉంటుందని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మాధవి అన్నారు. వంశీ ఆర్ట్స్ థియేటర్స్ ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి త్యాగరాయ గానసభలో పద్మమోహన్ దెందులూరిచే ఆంధ్రనాట్య ప్రదర్శన అద్భుతంగా జరిగింది. అనంతరం జరిగిన సభలో ముఖ్య అతిథిగా జస్టిస్ మాధవి పాల్గొని పద్మమోహన్‌ను ఆంధ్రనాట్య పితామహుడు నటరాజ రామకృష్ణ పేరిట జీవిత సాఫల్య పురస్కారంతో సత్కరించి మాట్లాడారు. నాట్యకళాకారుడు డా॥ కళాకృష్ణ హరికథా కళాకారిణి ఉమామహేశ్వరి పాల్గొనగా వంశీరామరాజు అధ్యక్షత వహించారు.

ఆశతో పయనం

ఆకలి కి అన్నం తక్కువైనా
తొడగడానికి బట్టలు తక్కువైనా
ఉండటానికి ఇల్లు లేకున్నా
శాంతి, విశ్రాంతి,ఆరోగ్యం, సమయం
నాతో ఉండేవి
ఒక ముహూర్తంలో
ఆశ నా జీవితంలో ప్రవేశించింది,
నాకు లేనివన్నీ ఇస్తాను
తనతో రమ్మంది
పయనం సాగింది
మంచి భోజనం, ఖరీదైన బట్టలు,
మంచి భవనం
చేతినిండ డబ్బు సమకూర్చింది
పదవి ,డాబు దర్పం పెరిగాయి
ఆశ,ఇంకా ఇంకా ధనం ఇస్తూనేవుంది
గౌరవాలు కలిగించింది
కాని, విశ్రాంతి కోరితే ఇవ్వనంది
తినేందుకు,పడుకునేందుకు
సమయం లేదు
తిందామంటే ఎవరైనా తిండిలో విషం
పెట్టారేమో అని భయం
ఎవ్వరిని నమ్మలేని స్థితి
ఎవరైనా చంపుతారేమోనన్న భయం
భార్యాపిల్లలపై కూడ సందేహం
ఉన్న డబ్బంతా ఎవరైనా
పట్టుకుపోతారేమోనన్న భయం
ఈ భయం దయ్యంలా పట్టుకుంది
ఆరోగ్యం ఎప్పుడో నన్ను వీడిపోయింది
అనారోగ్యం పట్టుకుని పీడిస్తోంది
బాధలు చుట్టూ తిరగటం మొదలు పెట్టాయి
ఆశ ను వదులుకోలేక
భయాన్ని వదిలించుకోలేక
సమయాన్ని నా చెప్పుచేతల్లోకి
తీసుకోలేక రోగాల బారిన పడ్డా
ముందు స్థితే బాగుందనిపించింది
కాని,పరిస్థితులు చేజారిపోయాయి
ఆశ తో పయనం చేస్తూనే వున్నా.
బాధలు పడుతూనే వున్నా

-ఎస్ .ఎమ్ .షరీఫ్
9618045319

ప్రాసమంజరి పద్యాలు

జీవితం చీకటే కాదు ఎల్లప్పుడూ
ఓటమి విజయ మూలమే ఎల్లప్పుడూ
నవ్వుల పువ్వులు పూయాలి ఎల్లప్పుడూ
శాంతము ఆరోగ్య మూలం ఎల్లప్పుడూ.

కమ్మని ప్రేమను పంచును జగతి అమ్మరా
కలత లన్నియు తీర్చును కన్నతల్లేరా
కోటి వెలుగుపంచు ఆమృత దీప్తి కొమ్మరా
జగతిలో నిండుదనము నిచ్చు కోవెలరా.

పరహితముచేయుమెప్పుడుహితమిదుటఘనము
మేలిదుచు మేలు పొందుము సద్గుణముశుభము
ప్రేమించు మంచిని చెడు ద్వేష ఖించజనుము
నీతిపథమువెడలు నడువ కవినీతిపథము.

జన్మపంచిన వారికడదాక విడువకుము
ఎల్లప్పుడు వారిని సేవించి తరించుము
వారి సేవయే సద్భాగ్యముగా నెంచుము
వారిదీవెనలు మనుగడగా భావించుము.

తల్లిదండ్రుల సేవ సురపూజ గదలచుము
వారిటచూపిన మార్గముననే గమించుము
తొలిదైవము తల్లిదండ్రులని భావించుము
జననీజనకులు నీకాదర్శమనెం చుము.

కనులన్ని చెమర్చునే కరుణతో నిండిన
మమతలకు విలువిచ్చే బంధాలు నిల్చిన
కలకాల మేనిలచిన స్నేహమే కల్గిన
వీణులకు విందాయేకోయిలలు పల్కిన

-ధనాశి ఉషారాణి
9121096397

బెల్లప్పల పెంక

పండుగొచ్చేనని పట్టుబట్టి
పిల్లలు మంది ముఖం జూడరా?
అప్పోసప్పో మనింట్ల మనంజేయాలే
పది దినాల ముందునుంచే కొట్లాడి
పైసలు లేకున్నా పెంక పెట్టేది అమ్మ .

కోపిన్ బియ్యం అడ్డెడు
కమ్మని ఆసన కాటన్ నూనే
సేటు దగ్గర సేరు సెనగపప్పు
కొనలేక ఉద్దెరప్పుతో నాయన

పొద్దంతా కాయ కష్టం చేసినా!
అలసటనంత చిలక్కొయ్యకు తగలేసి
ఎక్క దీపం గుడ్డి వెలుగు కింద
కట్టెల పొయ్యితో తంటాలు
సెగ పొగలతో కుస్తీలు
కారం పెట్టినట్లు కండ్ల మంటలు
రాత్రంతా పిండి పిసికి బెల్లప్పలు చేసేటోళ్లు

పెద్ద పేర్పెడు చెవుబిల్లలు
అంబటి గంపెడు ముండ్ల మురుకులు
చిన్న గుల్లెడు కారమప్పలు
మెత్తని పత్తిలాంటి పూరీలు .

లోటా గిలాసల
లొట్టెడు చాయి పోసి
నానేసిన బెల్లప్పలు
బెల్లం కంటే కమ్మగుంటుండే

గిప్పుడంటే బేకరీ ఫుడ్డు తిని తిని
బెల్లప్పలు చేదైనవి గాని
బెల్లప్పలు ఉంటే
వారం పది దినాలు
పండుగే పండుగ.

-డా.ఎడ్ల కల్లేశ్
9866765126

బతుకు బండి

బతుకు బండి దేహానికి..
జోడెడ్లు విజ్ఞాన వివేకాలు
రథ సారథి పక్కాగా నీవే
ప్రేరణలే చక్రాల కందెనలు
గతుకుల రోడ్లే కష్టనష్టాలు
పగ్గాలే ఇంద్రియ నిగ్రహాలు
తారు రోడ్లే సుఖ ప్రయాణాలు
కంకర రోడ్లే జీవన కుదుపులు
బండి పరుగు అదుపు తప్పి..
చక్రం సీల ఎగిరి పడిపోతే..
తలకిందులగుట ఖాయం !
జీవితమో సప్తస్వర సంగీతం
అనివార్యమైన జగన్నాటకం
సవాళ్ళ జలపాత పయనం
ఆటుపోట్ల సాగర తరంగం
అస్పష్టమైన రేవు రహస్యం
సమస్య వెనుక సమాధానం
దుఃఖం తెర వెనుక సుఖం
అప'జయం'లో దాగిన 'జయం'
జీవితమో వేసవి చలివేంద్రం
శీతాకాలంలో చలిమంట
వర్షాకాలంలో రక్షణ గొడుగు !
జనన మరణాలు అనివార్యం
ఏడుస్తూ లోకానికి వచ్చాం
పది మందిని ఏడిపిస్తూ పోదాం
జీవితం ష(సా)రా మామూలు కారాదు
చేతిలోని ఆస్తులతో సంతృప్తి చెంది..
లేని జ్ఞానాన్ని నిత్యాన్వేషణ చేస్తూ..
ఓ యాగంలా, ఓ యోగంలా..
నిరంతర చైతన్య వాహినిలా..
ఆనంద మకరందాల మందాకినిలా..
సాగాలి సాఫీగా
బతుకు బండి పయనం !

-మధుపాళీ
9949700047

ఈ నెల 20న శ్రీ కళా సుబ్బారావు కళావేదికలో
74 మంది రచయిత్రుల కథలతో
సర్వాంగ సుందరంగా ముస్తాబైన లేఖిని రచయిత్రుల కథా సంకలనం

'కథల లోగిలి'

ఆవిష్కరణ సందర్భంగా పుస్తక సమీక్ష



-ప్రతులకు:
శ్రీమతి అత్తలూరి విజయలక్ష్మి
సెల్:96768 81080

డెబ్భైనాలుగు 'కథల లోగిలి'

కథ' అనేది మనిషితోపాటే పుట్టింది. జరిగిన సంఘటనలను ఒకరినొకరు తెలుపుకో వడం నుండి. జ్ఞాపకాలను తిరగేసుకోవడం ద్వారా, గడచిన జీవితాలు, ఎదురైన అమానుష, అనూహ్యమైన, సంఘటనల నుండి ఆనందం, ఆశ్చర్యాలకు సంఘటనల దాకా కథలుగానే భావి తరాలకు ప్రవహిస్తాయి. నా మటుకు ఇవన్నీ జీవితాల్లో సంఘటనలే. మనతో నిత్యం మాట్లాడుతున్న పాత్రలే. ఒక సంపూర్ణ రూపాన్ని సంతరించుకుని కథగా మన ముందు నిలబడతాయి. రామాయణ, మహాభారతాల నుండి ప్రారంభమైన కథలు, ఇప్పటికీ మనిషి జీవితం మీదుగా ప్రయాణం చేస్తూనే వున్నాయి. అయితే ఏది కథ? కథకు ప్రామాణికం ఏదయినా వుందా? ఇలా వుంటేనే కథా? అసలు కథకు గల లక్షణాలు ఏమిటి? అనే ప్రశ్నలు నిత్యం సాహితీ వేత్తలందరికీ ఎదురవుతూనే వుంటాయి. ఈ విషయం ప్రస్తావించినప్పుడు నాకో వాక్యం గుర్తుకు వస్తుంది. ప్రేమ అనేది చూసే కళ్ళల్లో వుంటుందే తప్ప కనిపించే వ్యక్తి లో వుండదు అని. కథ కూడా అంతే. ఎదుటివారి మనసుకు నచ్చితే అదే కథ. అదే కథ పదిమందికి నచ్చితే ఉత్తమ కథ. అదే వందమందికి నచ్చింతే అది పదికాలాలు నిలిచిపోయే కథ.అంతే! కాకుంటే ఒక్కో సంఘటన ఒక్కొక్కరు ఒక్కొలా చెబుతారు. అదే కథ. ఒక్కో మనిషి ఒక్కోలా మాట్లాడతారు. జీవితాన్ని సమాజం ఒకలా చూస్తుంది. ఒక్కో దృశ్యం ఒక్కో కంటికి ఒక్కోలా కనిపిస్తుంది. కాబట్టి ఈ కథే గొప్పది. ఈ కథలో ఏమీ లేదు. అసలు ఇది కథే కాదు అనే హక్కు ఎవరికీ లేదు. ఒకరికి నచ్చనంత మాత్రాన అది కథే కాదు అనడం కూడా సమంజసం కాదు. అంటూ ఆధునిక ధోరణి సాగుతోంది

ఇటీవల ఒక యువ రచయిత ఒక పత్రికలో చిన్న ఇంటర్వ్యూ ఇస్తూ, ఎంతసేపు మమ్మల్ని ప్రాచీన సాహిత్యాన్ని చదవండి. అలా రాయాలని ప్రయత్నించండి అంటున్నారు. అంటే అందరూ వారిని చదివే రాయాలా? వారిలానే రాయాలా? మాకంటూ కొన్ని పద్ధతులు, ఆలోచనలు వుండవా? అందుకే నాకు నేనుగా, నాకు తోచిన విధంగా రాసుకుంటాను అని. ఒక విధంగా ఆలోచిస్తే నిజమే కదా? ప్రాచీనం నుండి ఆధునికం, ఆధునికం నుండి అత్యాధునికం అనే తీరాలకు చేరిపోతున్నా అదే మూసలో రాయాలనడం సమంజసం కాదు కదా? అందరూ కాకున్నా కొం దరైనా ఈ విధంగా ఆలోచిస్తే బావుణ్ణు కదా అనిపి ంచింది. ఇలా అత్యాధునిక ధోరణి సాగుతోంది.

1910 లో ఆధునిక తొలి కథానిక గురజాడ అప్పారావు రచించిన "దిద్దుబాటు"తో ప్రారంభమై పోరంకి దక్షిణామూర్తి, వల్లంపాటి వెంకటసుబ్బయ్య వంటివారు తొలుత కథపై విశేష కృషిచేసి చక్కటి విశ్లేషణ కూడా పాఠకులకు అందజేసారు. ఆ తర్వాత అనేకులు శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి, కందుకూరి, చిలకమర్తి, రాయసం వెంకట శివుడు, పానుగంటి, చింతా దీక్షితులు, వేలూరి శివరామశాస్త్రి, విశ్వనాథ సత్యనారాయణ, అడవిబాపిరాజు, మునిమాణిక్యం, మల్లాది, కొడవటిగంటి, బుచ్చిబాబు వంటివారు కథా సాహిత్యాన్ని పరిపుష్టం చేసినా, స్త్రీలలో కూడా ఏమాత్రం తీసిపోనట్లు ఇల్లిందల సరస్వతీదేవి, వాసిరెడ్డి సీతాదేవి, నాయని కృష్ణకుమారి, భానుమతీరామకృష్ణ, ముప్పాళ రంగనాయకమ్మ, ఆచంట శారదాదేవి,శివరాజు సబ్బలక్ష్మి, ద్వివేదుల విశాలాక్షి, ఆర్ వసుంధరాదేవి, సి, ఆనందారామం, వేదుల శకుంతల, అచ్యుతవల్లి, డి.కామేశ్వరి, గోవిందరాజుల సీతాదేవి, కె.వి కృష్ణకుమారి, ఇంద్రగంటి జానకీ బాల వంటివారు ప్రసిద్ధ కథా రచయిత్రులుగా చలామణీ అయ్యారు.

అలాగే అనే కంటే అంతకంటే గొప్పకథల్ని సేకరణ ఇపుడు మన ముందున్న రెండు భాగాలుగా విడుదలైన కథల సంపుటి "కథల లోగిలి'. ఇందులో వున్నవారంతా ఉద్దండులైన కథా రచయిత్రులే. వీరితో పాటు వర్ధమాన రచయిత్రులు కూడా వీరితో సరిసమానంగా వుంచి, చరిత్రలో నిలిచిపోయే గ్రంథం తీసుకొచ్చారంటే ఒక తరం మరో తరానికి దారి చూపినట్లే భావించాలి. తామే అని కాకుండా , మీరు కూడా మాతో..అన్నట్లుగా అనిపిస్తోంది. ఇదివరలో 'దీపతోరణం' అనే పేరుతో వాసాప్రభావతి గారు కథా సంపుటి తెచ్చిన తర్వాత వెలువడిన మరో అద్భుతమైన కథా సంపుటి ఇది. డెబ్భైనాలుగు మంది రచయిత్రులు కథలు రాయడం అంటే, కథల్ని సేకరించడం అంటే మాటలు కాదు. ఎంతో ప్రయాసతో కూడిన ఈ పనిని వాసా ప్రభావతి గారి తర్వాత కథా రచనలో ఉద్దండులైన అత్తలూరి విజయలక్ష్మి, పొత్తూరి విజయలక్ష్మి, గంటి భానుమతి. మంథా భానుమతి వంటి వారి సారథ్యంలో అద్భుతంగా వెలువడింది అంటే ఈ తరాన్ని ఒక దీపాన్ని వెలిగించి కాపాడినట్లే కదా? పుస్తకానికి ఎంతో ముఖ్యమైన పని తప్పులు సరిదిద్దడం, ఆ పనిని ఎంతో శ్రద్ధగా నిర్వహించిన శ్రీమతి నండూరి సుందరీ నాగమణి గారికి, కథలన్నీ చదివి పొరపాట్లను సరిదిద్దిన శ్రీమతి అల్లూరి గౌరీలక్ష్మి గారికి హృదయపూర్వక ధన్యవాదాలు. మరీ ముఖ్యంగా ప్రముఖులు మేధో సంపన్నులు, డా॥ కె.వి రమణాచారి గారు, ప్రముఖ కవి వోలేటి పార్వతీశం గారు, సుప్రసిద్ధ కథ, నవలా రచయిత యండమూరి వీరేంద్రనాథ్ గారు, ప్రముఖ కవయిత్రి శీలాసుభద్రాదేవి గారు, ప్రముఖ చిత్రకారులు బ్నిం గార్ల ముందు మాటలు మరింత ఈ గ్రంథాలకు మరింత వన్నె తెచ్చాయి వీరికి ధన్యవాదాలు. ముఖ్యంగా హృదయానికి హత్తుకునేలా ముఖచిత్రాన్ని అందించిన బ్రహ్మ 'ఉలి' గారికి లేఖిని తరపున కృతజ్ఞతలు. ఎంతో పేరెన్నిగన్న రచయిత్రులు స్నేహితులు, యద్దనపూడి సులోచనారాణి గారికి, వాసా ప్రభావతి గార్లకు ఈ గ్రంథాలను అంకితం ఇవ్వడం ఒక విధంగా వారి నుండి ఆశీస్సులు అందుకున్నట్లుగానే ఉంది.

ఇంతమంది రాసారు కదా? మరి కథల విషయం? అనుకుంటే ఇక వెళ్లాల్సిందే.. ఇందులో డెబ్భైనాలుగు కథలున్నాయి. ఎన్నో ఏళ్ళుగా కథా రచన పట్ల నిబద్ధత కనబరుస్తూ రచిస్తున్న కథయిత్రులే ఇందులో వున్నారు. అన్నీ కథలు. విలువైనవీ. సమాజా నికి ఏవో చెప్పాలని కొన్నీ, సమాజ పోకడల్ని ఎత్తిచూ పుతూ కొన్ని, హెచ్చరికలతో కొన్ని, జీవిత పాఠాలతో కొన్ని సాగాయి. ఒక మనిషి ఎంత కాలం జీవించామని కాదు.. ఆ జీవితంలో ఎంతవరకు నియమ నిబద్ధత లతో జీవించ గలిగాము అని తెలిపే అద్భుతమైన కథ ఆలూరి విజయలక్ష్మి గారి "అంతర్ముఖం" వృత్తి రీత్యా వైద్యులు కావడంతో వైద్యుల మధ్య సాగే జీవితాన్ని కథాంశంగా తీసుకుని, ఎంత గొప్పవారైనా వారికి తగిన సమస్యలు వారికి ఎదురవు తాయి. ఆ సమస్యల మూలం గా తన జీవితానికి ఇక ఏమీ మిగలలేదనే నిర్ణయానికి రాకుం డా సమాజం పట్ల ఎలా దృష్టి సారించాలనే విషయాన్ని వింధ్య, వేణు ల జీవితాల ద్వారా తెలియజేసారు.

సమాజంలోని ప్రతి ఒక్కరూ సువాసనలు వెదజల్లే పూల తో సమానమని తెలియజేసే రీతిలో ఒక పూలతోటలా తీర్చిదిద్దిన కథ అమృతలత గారి "బోగన్విలియా". సాయం చేసే గుణం వున్న ప్రతి ఒక్కరూ ఒక పూల మొక్కతో సమానంగా భావిస్తారు. నిజానికి ప్రాణానికి విలువిచ్చి ఆ ప్రాణాల్ని కాపాడే నెపంలో ఎందరో పేదవారు బలిఅయ్యారు. అలాంటి వారిని గుర్తించేవారు లేరు కదా? అని బాధపడతారు. కనీసం సంబంధిత అధికా రులు కూడా చేయలేని పనిని కొందరు పనివారు చేయడం పట్ల వీరిని కదా ప్రభుత్వం గుర్తించి గౌరవించాల్సింది అని తెలిపే తీరు ఎంతో ఆదర్శవంతంగా వుంది. కరోనా క్వారెంటైన్‌లో ఇరుగుపొరుగువారితో పడే అష్టకష్టాలను కథాంశంగా తీసుకుని రచించిన కథ ఆకెళ్ళ సుబ్బలక్ష్మి గారి "ఆ చీకటి రోజుల్లో" సరదాగా సాగింది.

అత్తగారు కూడా అమ్మే అనే ఆలోచనను పూర్తిగా పదిలేసిన ఈ తరం వారికి అత్తలూరి విజయలక్ష్మి గారి కథ "ఆమె అమ్మే" అనే కథ చెంపపెట్టులా వుంది. తనని ఎంత కష్టపెట్టినా తల్లి తన బిడ్డల శ్రేయస్సునే కోరుకుంటుందనేది చాటి చెప్పారు. కథ చిన్నదైనా కథాంశం గొప్పది. రాష్ట్రాలు వేరయ్యాక బార్యాభర్తలు పడే బాధని వివరిస్తూ అందులో కూడా మంచిని వెదుకుతూ, ఎక్కడికెళ్ళినా మంచి మనసుంటే మంచివారే దొరుకుతారు అనే కోణంలో రచించిన కథ అల్లూరి గౌరీలక్ష్మి కథ "కొత్త మట్టి" ఎంతో సందేశాత్మకంగా వుంది. ఎక్కడికి వెళ్ళినా మనల్ని మనమే పాలించు కోవాలి అనే వాక్య ం అక్షరసత్యంగా తోచింది. మనుషులంతా అత్యాధునికంలోకి ప్రయాణి స్తున్నా, అమెరికాకి అమలాపురంలా వెళ్ళి వస్తున్నా మానసికంగా మాత్రం ఇంకా ఇంకా ఎదగడం లేదా అనే ఆవేదన కనబరచారు. మనుషులు కదా వారంతే! అవసరానికి మాత్రమే వాడుకుంటారు. తర్వాతే తప్పులు వెదుకుతారు. ఈ విషయాన్ని తెలిపే విషయంలో ఎంతో వాస్తవికతను తెలియజేసి, అందరినీ ఆశ్చర్యపడేలా చేసిన కథ "చనుబాలు'. ఈ కథను రేణుకా అయోలా గారు రచించారు. చదువు పేరుతో వేరే ప్రాంతాలకో, దేశాలకో వెళ్ళిన వారు మళ్ళీ తల్లితండ్రుల్ని పట్టించుకోని బిడ్డల తీరును,, వివరిస్తూ, తిరిగి అదే బిడ్డ తప్పు తెలుసుకుని తల్లిని చేరేలా ఎంతో ఆర్ద్రంగా సాగిన కథ మాధవి బైటారు రచించిన "చిక్కం" కథ ఎంతో బావుంది. కథాంశం పాతదే అయినా కథను నడిపే తీరులో కొత్తదనం కనిపించింది.

'ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న' అనే విషయాన్ని మరొక్కసారి గుర్తు చేసిన కథ బందారు సుజాత గారి "ఆకాశమంత మనసు' చదువుతుంటే భావితరాలకు మార్గదర్శకంలా వుంది.

వినాయకుని విగ్రహానికి వేలకు వేలు తగలేసే మహారాజులున్న ఈ కాలంలో ఎంత చేసినా చివరికి బంకమన్ను వినాయకుడినే పూజించే స్థితికి వచ్చిన తీరును తెలిపే దిశగా రచించిన కథ లావణ్య బుద్దవరపు గారి 'ఏ వన్ వినాయకుడు' బావుంది. అంతలేసి డబ్బు పెట్టినా ఏది ప్రాప్తమో అదే దక్కుతుంది అన్నట్లుగా నడిపిన తీరు ఆసక్తికరంగా వుంది. ఏ బంధమైనా సక్రమంగా వున్నప్పుడే విలువ అని తెలిపుతూ చెంగల్వల కామేశ్వరి రచించిన కథ నాకు నువ్వు -నీకు నేను'' లో సమాజానికి అందించిన హితవు బావుంది. ఈరంకి ప్రమీలారాణి గారి ఇది మయసభా! కాదు కాదు" అని నాటకీయంగా పేరు పెడితే చదివాను. మధ్యతరగతి యువతి చేసిన ప్రయత్నం ఎంతో గొప్పగా చెప్పారు. నిజానికి అనుభవానికి మించిన చదువుండదు అనేది నిరూపించిన కథ ఇది. మొదటి వాల్యూమ్‌లో ఇంకా అనేకమంది దాసు హవిష, మీనాక్షి శ్రీనివాస్, ముఖ్యంగా హెూతా పద్మినీదేవి కథ ఎంతో మానవీయ కోణంలో సాగిన తీరు హర్షించదగినది. సరస్వతి కరవది, ఉమాదేవి కల్వకోట, లక్ష్మీ రాఘవ. కందేపి లక్ష్మీ రాఘవ. గోళ్లమూడి కిరణ్మయి. సుజల గంటి,. కందాళ ఉషారాణి, మంగళ గౌరి వంటి అనేక మంది రచయిత్రులు తమ కథల ద్వారా చక్కని శైలిని కనబరిచారు. మరొక సీనియర్ రచయిత్రి కస్తూరి అలివేణి గారు రచించిన కథ "అబలా?సబలా?" అనే కథలో ఒక భర్త తన భార్యను చదువుకునేందుకు ప్రోత్సహించి, తీరా ఆమె ఎదగడం గమనించాక విడాకులు ఇవ్వడం, అం దుకు ఆమెపై నింద వేయడం వంటివి సర్వసా ధారణంగా జరుగుతున్నా ఈ కథలో ఒక స్త్రీ ఎదిగితే ఒంటరిగానే వుండాలా?అనే ఆవేదన తెలియజేసారు. నిజానికి ఇది చాలా సున్నితమైన విషయం అయినా జరుగుతున్న తీరును తెలియ జేసిన తీరు ఎంతో మందిలో ఆలోచింప జేస్తుంది.

మరొక వాల్యూమ్‌లో వున్న 37 కథల విషయానికి వస్తే ముక్తేవి భారతి గారి రచన ఇరుకు కథలో మనుషుల హృదయాలలోని ఇరుకు మనస్తత్వాన్ని తెలిపిన తీరు, డా॥ మంథా బానుమతి గారి కథ 'దండేషు మాతా' అనే కథలో తాగుడు వ్యసనంతో బాధపెట్టిన తీరులో వున్న భర్త తప్పు తెలుసుకుని భార్యను క్షమాపణ అడిగే తీరు ఎంతో హృద్యంగా నడిచింది. భార్యల క్షమాపణ వల్లే ఎన్నో కుటుంబాలు నిలుస్తున్నాయనే విషయం మరొకసారి గుర్తుకు తెచ్చారు. శ్రీ కృష్ణుని లీలా నాటక రంగాన్ని ఆ మహాత్మ్యాన్ని వివరించిన కథ అశేశ్వరుడు. రచన తటపర్తి జ్ఞానప్రసూన. వీరి కథ ఇక్కడున్న కథల్లో కొత్తగా వుంది. అంటే ఆధ్యాత్మికంగా ఎంతో ముచ్చటగా వుంది. అలాగే పోలాప్రగడ రాజ్యలక్ష్మి గారి కథ "ఓ చిలక కథ, పొత్తూరి విజయలక్ష్మి గారి కథ 'అమ్మ ఫోటో', తమిరిశ జానకి గారి కథ 'ఒక నిజం ఒక మనసు', తురగా జయశ్యామల గారి కథ పావలా కావాలి వంటి కథలు కళాఖండాల్లా కనిపిస్తాయి. ఎందుకంటే కథా రచనలో వీరికున్న మెళకువ లేవని మరోసారి రుజువు చేసారు. వారు ఎంచుకున్న వస్తువులు కూడా ప్రత్యేకతను కలిగి వున్నాయి. ఇక నండూరి సుందరీ నాగమణి గారి కథ "మహారాణి'',మన ఇంటిపని మనం చేసుకుంటూ బానిసత్వం అని బాధపడటం ఎందుకు నీ కుటుంబానికి నువ్వే మహారాణివి అని చెప్పి కూతురు జీవితాన్ని తల్లి సరిచేయడం ఎంతో చక్కగా వుంది. ఇపుడు కావాల్సింది ఇదే కదా అనిపించింది. మరో చక్కని కథ నెల్లుట్ల రమాదేవి గారి కథ "చెడిపోయిన మనిషి" నిజంగా గుర్తుండిపోయే కథ. కష్టం చేసే జీవితాల మధ్య జరిగే మానసిక యుద్ధాలు, పేదరికాన్ని, వున్నదాంట్లో పలకరించుకునే మనిషి తనాన్ని వెరసి తీర్చిదిద్దిన తీరు అద్భుతం. తెలంగాణ మాండలికంలో సాగిన సంభాషణ ఈ కథకు మరొక ఆకర్షణ. నేమాని మాలతి గారి కథ నాతో నేను సరికొత్త పంథాలో నడిచాయి. ఇదే కోవలోకి నడిచే మరో కథ గాయత్రి పెండ్యాల గారి 'సిరికి వెన్నెల వస్తే' ఎంతో మానవీయతను చాటింది. మనుషుల్లో ఐక్యత వుంటే ఇంతలా వుంటుందా? అని కొత్త పంథాలో సాగిన కథ "కలసివుంటే కలదా సుఖం' రచన శ్రీపేరి. కళాకారులు ఎక్కడున్నా కళాకారులే అని తెలియజేసే కథ పుట్టి నాగలక్ష్మి గారి 'ఇరుకులో మెరసిన తార', సీవియస్ కృష్ణకుమారి గారి అనుదీప కథ, ప్రత్యేకంగా సమ్మెట ఉమాదేవి గారి ఖేల్ షురూ తప్పనిసరిగా చదవవలసిన కథ. ఒక కథకు ఎన్ని ప్రత్యేకతలుండాలో అన్నింటినీ తెలియజేసిన కథ. చక్కని శైలి ఈ కథ పత్యేకత. ఇంకా అనేకమంది ప్రఖ్యాత రచయిత్రులు, షామిర్ జానకీ దేవి, ఉగాది వసంత, కుసుమ, మణి, వాడపల్లి పూర్ణ, బాలామూర్తి, జ్యోతి వల్లబోజు, వారణాసి వెంకట విజయలక్ష్మి, రత్నశ్రీ వరెం, విజయా కిషన్ రెడ్డి, విజయలక్ష్మి పండిట్, సంధ్యా యల్లాప్రగడ, శైలజామిత్ర, నళినీ ఎర్రా, అభినేత్రి పంగల వంటి వారు అనేకం సామాజిక కోణంలో ఒక్కొక్కరూ కథరూపంలో స్పందించిన తీరు ఎంతో ఆకర్షణీ యంగా తోచింది. నిజానికి ఉద్దండ రచయిత్రుల కంటే వర్ధమాన రచయిత్రులలో కథాంశం ఎంతో బలంగా వుంది. శైలి కొత్తగా వుంది.

కథనం చదవాలి అనిపించేలా వుంది. ఎందుకంటే తరానికి తరానికి ఆలోచనా విధానంలో మార్పు వుంటుంది కదా? అనిపించేలా సాగింది. మొత్తానికి డెబ్భైనాలుగు కథలన్నింటినీ వివరించాలంటే కాస్త కష్టతరం. ముఖ్యంగా ఈ కథలను పిహెచ్‌డీ, ఎంఫిల్ చేసే వారికి ఎంతో వుపయుక్తంగా వుంటుంది అనిపించింది. ఇంతమంది రచయిత్రుల కథలు ఇలా రావడం ఎంతో ఆనందదాయకం. వీరి వెనుక ఎంతో కృషి చేసిన రచయిత్రులకు ధన్యవాదాలు.

-శైలజామిత్ర
9290900879

ఎలా అవుతుంది సమాజానికి భారం

ఉచితం ఉచితం అంటూ మహోన్నతమైన
పథకాలకు మసి పూస్తున్నామెందుకు మనం?.
ఏది ఉచితం ఏది అనుచితం అర్థం చేసుకోలేక
కొందరు చేస్తున్నారు వితండవాదం.
సమాజ సంస్కరణలో తెల్ల కార్డు,
ఆరోగ్యశ్రీ తరువాత మహోన్నతమైన పథకం
ఉచిత బస్సు ప్రయాణం.
ఈరోజు బస్సులు కలకలలాడుతూ
పొదుపు చేస్తున్నాయి నాడు నలుగురితో
వృధా అవుతున్న ఇంధనం.
ఉచితం అంటున్నారే కానీ
ఇక్కడ ఉచితం ఎలా అవుతుంది!
ప్రభుత్వ ఖజానా నుండి ఇచ్చిన ధనం
మనది కాదా?
ఆకలి గొన్న వాళ్లకు ఆహారం తీరుస్తున్న విధంగా
అందుతోంది ఈ పథక ఫలితం,
న్యాయం కాదా?
బేద భావాలు లేని మానవత్వంతో
సమానత్వం కలిగినటువంటి ఈ పథకం
ఎలా అవుతుంది సమాజానికి భారం?
మహత్తర పథకాలను పార్టీలపరంగా ఆలోచించి
దూషించటం ఇది సమాజంలో
రుగ్మతల అమానుషం.
సమాజమంటే ఒక ఇల్లే, ఈ సమాజాన్ని
అర్థం చేసుకోలేని
కొందరు మనుషులే చేస్తున్నారు గందరగోళం
అజ్ఞానంతో కొట్టుమిట్టాడుతున్న కొందరు
మనుషులే అమానుషంగా
సృష్టిస్తున్నారు వైశమ్యం.
ఏ ప్రభుత్వం పాలించినా!
ప్రభువులము ప్రజలే అన్న విషయం
విస్మరించి మాట్లాడుతున్న వైనం,
అవగాహన లేమితో అనర్థమైన మాటలు
మాట్లాడి సమాజాన్ని తప్పుదోవ పట్టించి
విచ్ఛిన్నం చేయాలనుకొంటున్న
కొందరి విద్వేష పన్నాగం.
ఏ పార్టీలో ఉన్నా అందరూ
మనవాళ్లే ప్రజాప్రతినిధులుగా
మనకు సేవలు ఇస్తున్నారన్నది నిజం,
పార్టీల పేరుతో పగలను పెంచుకొని
మనల్ని మనమే మోసం చేసుకోవడం
ఎలా అవుతుంది సముచితం.
సమాజ శ్రేయస్సు కై ఎవరు పాటుపడినా
అందరం హృదయపూర్వకంగా
అభినందించడం శ్రేయస్కరం.
మనలో మనం ఐక్యమత్యంతో లేనప్పుడు
భావి భారతం
అభివృద్ధి చెందడం ఆగమ్యగోచరం.
సమాజంలోని వయోవృద్ధులను గౌరవిస్తూ
వారికి కూడా బస్సు ప్రయాణంలో
కల్పించాలి ఉచితం.
ఏదో ఒక రోజు అందరూ వయోవృద్ధులు కాక
తప్పదు అందుకే అందరికి
ఇలాంటి పథకాలు అవసరం.
మనం నిర్మించుకున్న సమాజంలో
అసహాయ స్థితిలో ఉన్నప్పుడు దీనివల్ల
ఎవరికి కాము భారం.
మనం మనస్ఫూర్తిగా పరిచిన పూల బాట
భావితరాలకు బంగారు బాట కావాలన్నదే
నా అభిమతం.

-బిటవరం శ్రీమన్నారాయణ,
98899699009.

రెక్కలు

రమ్మంటే
రాదు
పొమ్మంటే
పోదు.
సహజాతం
కవిత్వం

నీడల్ని నరుక్కుంటూ
వెళ్ళడమంటే
శ్మశానాల్ని
విస్తరించడమే
మన నీడ
మనకి నీడనివ్వదు

కొన్ని జ్ఞాపకాలు
గాయం చేస్తాయి
కొన్ని గాయాల్ని
జ్ఞాపకాలు మాపుతాయి
సంజీవని
కాలసందర్భం.

-పి.శ్రీనివాస్ గౌడ్
9949429449

సప్తపది

జీవిత సత్యాల ఆవిష్కరణం
సామాజిక బ్రతుకుఘటనల వ్యాఖ్యానం

సృజన కర్త
సుధామ
నిర్వహణ
విహారి
శాంతిమూర్తి

"జనాదరణ"
పదానికి సప్తపది పోటీలో సప్తపదులు వాట్సప్ గ్రూప్ లో
బహుమతి పొందిన వాటితోబాటు ఎంపికయిన
ఈ వారం నేటినిజం సాహితీకిరటాలుకు
వివిధ కవుల సప్తపదులు

అచిరకాలం లోనే
అత్యంత ప్రాచుర్యం పొందిన
లఘుకవితా ప్రక్రియ

కొలువులు
నెలవులు
జనాదరణను బట్టే లభించును ఎన్నో పదవులు
-డా.కె.శైలజ బెంగళూరు

దడ
గడ
జనాదరణ లక్ష్యంగా పనిచేస్తేనే ప్రభుత్వాలకు
మనుగడ!
-డాక్టర్ శైలజ మామిడాల
హనుమకొండ

అనాదరణ
నిరాదరణ
మంచి వ్యక్తిత్వం వున్నవారికి లభిస్తుంది జనాదరణ!
-పప్పు సుజాతారావు, విశాఖపట్టణం

ఆదరణ
నిరాదరణ
ప్రజలకు మంచి చేస్తేనే నాయకులకు జనాదరణ
-పోచం లక్ష్మీనర్సయ్య
(ప్రభుత్వ హిందీ ఉపాధ్యాయుడు)
యాదాద్రి భువనగిరి

సమాచరణ
ఉదాహరణ
విద్య నేర్పే గురువరులకు ఎల్లెడలా జనాదరణ.
-ఆర్ ఎస్ రాజకుమార్, విశాఖపట్నం

తిరస్కరించు
బహిష్కరించు
పెడతోవ పడుతున్న యువతను జనాదరణతో
సంస్కరించు.
-కొత్త ప్రియాంక(భానుప్రియ)
హైదరాబాద్

జనాదరణ
నిరాదరణ
మంచికి తావిస్తే ఎవరైనా పొందుతారు
ఆదరణ.....!!
-జి.కె.నారాయణ(లక్ష్మి శ్రీ)
జోగుళాంబ గద్వాల్

అక్కడ
ఇక్కడ
జనాదరణతో అత్యధికవసూళ్లు, తొక్కిసలాటలో
రక్షణ ఎక్కడ?
-పూడిపెద్ది వెంకట సుధారమణ
విశాఖపట్నం

ఆటు
పోటు
ఎగసిపడే కెరటం -జనాదరణ. నమ్ముకుంటే చేటు
-డా.పి.వి.రామ కుమార్
హైదరాబాద్

పనితనం
నేర్పరితనం
జనాదరణ అంటే సంస్కృతి - విశాలం,
మంచితనం.
-కే. ఎం. కే. మూర్తి
సికింద్రాబాద్

ఆదరణ
ఉద్ధరణ
ప్రభుత్వాలు కళలను ప్రోత్సాహిస్తేనే పొందుతాయి
జనాదరణ!
-పట్నాయకుని రామకృష్ణారావు
కంచరపాలెం.విశాఖపట్నం.

ఓట్లు
నోట్లు
జనాదరణ కోసం నాయకులు పడుతుంటారు
అగచాట్లు .
-యడవల్లి విజయలక్ష్మి
రాజమండ్రి

ఆదరణ
నిరాదరణ
మంచి పనులు చేస్తూ పొందాలి -జనాదరణ.
-బిక్కుమూరి రాజేశ్వర్,
నిర్మల్

ఆదరణ!
నిరాదరణ!!
ఎంతెత్తు ఎదిగినా వంగి అందినప్పుడే
జనాదరణ!!!
-మన్నవ సుధాకర్
కృష్ణలంక విజయవాడ

ఆదరణ
నిరాదరణ
కవిత్వము రసాత్మకమైతే నిరంతరము
పొందుతుంది జనాదరణ
-కపిలవాయి అశోక్ బాబు
నాగర్ కర్నూల్

నీరాజనాలు
ప్రయోజనాలు
జనాదరణ అంటే కాదు -ఎగబడటం జనాలు.
-కత్రోజు నర్సింహాచారి,
సికింద్రాబాద్.

ఉదయశ్రీ
విజయశ్రీ
20శతాబ్దంలో జనాదరణ పొందిన కవి కరుణశ్రీ
-భువనేశ్వరి మారేపల్లి
హైదరాబాద్

మెరుగు
కరుగు
సంపద పోయిన నాడు జనాదరణ తరుగు
-విన్నకోట ఫణీంద్ర,
హైదరాబాదు

ఆదరణ
ప్రేమాదరణ
విశ్వవిజేతగా నిలిచి గూకేష్ పొందియున్నాడు
జనాదరణ
-పురం అనూరాధ ఏలూరు.

ఉద్ధరణ
ఆదరణ
సంస్కృతి ప్రతిబింబించే కళలకు ఉండాలి
జనాదరణ.
-పట్నాల ఈశ్వరరావు
విజయనగరం

ఆదరణ
సముద్ధరణ
సేవాజలంతో , తాదాత్మ్యంతో పెంచి
పోషించుకోవాలి జనాదరణ
-వి శ్రీనివాస మూర్తి
హైదరాబాదు

ఆమరణ
జనాదరణ
జన్మచరిత్రల త్యాగం స్వార్థం కాదొక ఉదాహరణ.
-క్రొవ్విడి వెంకట బలరామమూర్తి
హైదరాబాద్.

సమయపాలన,
నియమపాలన,
జనాదరణ కలిగియున్న వ్యక్తులే అందివ్వగలరు
సుపరిపాలన.
-దినవహి సత్యవతి, గుంటూరు

ఆదరణ
నిరాదరణ
కవిత్వం వ్యాపారం శాశ్వతత్వానికి పొందాలి
జనాదరణ
-ఆచార్య వై వి సుబ్రహ్మణ్యం,
హైదరాబాద్,

ఆచరణ
అనుసరణ
నైతికతను ప్రబోధించే విజ్ఞానుల ప్రవచనాలకే
జనాదరణ
-కోటమహంతి వెంకటరావు (కోవెరా),
విశాఖపట్నం

ఆదరణ
నిరాదరణ
మాతృభాషపై మమకారం లేక కోల్పోతోంది
జనాదరణ.
-సాధన.తేరాల, ఖమ్మం.

సాయం
గాయం
గారడీలతో జనాదరణ - నెగ్గాక నాయకుడు
మాయం
-వి నాగమణి
హైదరాబాద్

సంభవం
వైభవం
జనాదరణ లేక నాటకం కోల్పోతున్నది ప్రాభవం
-కె. అర్జున్, విశాఖపట్నం

పిలిచెటోడు
పలికెటోడు
జనాదరణ పొందినోడు కలకాలం ఇల
నిలిచెటోడు
-ఆలేటి పరంజ్యోతి ఖమ్మం

జనాదరణ
నిరాదరణ
అయినవారు తరిమేస్తే వృద్ధాశ్రమంలో పొందాలి
పరాదరణ
-ఉదంద్రాపు రమణబాబు, నరసన్నపేట

అభిమానం
బహుమానం
ప్రభవించే కళలకు ప్రాప్తించే జనాదరణ
కొలమానం.
-మురళి ఎఱ్ఱాప్రగడ, పలివెల.

సమాచరణ
బహుకారణ
నాగరికతకు చిహ్నం దేశంలో కళలకు జనాదరణ!
-ఎన్ ఆర్ తపస్వి , చెన్నై

ప్రచురణ
వితరణ
సాహిత్యగ్రంథాలకి కొరవడే జనాదరణ
ప్రచురణకర్తల నిరాదరణ
-పి.బాలాత్రిపుర సుందరి. హైదరాబాద్

ఆదరణ
అనాదరణ
గెలుపు ఓటములకు మధ్య వారధి జనాదరణ
-కాసుకొలను లక్ష్మి సీత హైదరాబాద్

ఆదరణ
సమాదరణ
పరులకు హితాన్ని బోధిస్తే వారికెప్పుడూ
జనాదరణ.
-బెహరా నాగభూషణ రావు
గజపతినగరం

అందము
చందము
జనాదరణ పొందిన సినీగీతాలు దోచేస్తాయి
దెందము
-ఇలపావులూరి రాజ్యలక్ష్మి హైదరాబాద్

జనాదరణ
వశీకరణ
సఫలీకృతమయ్యాక నిర్లక్షం చూపితే తప్పదు
నిరాదరణ.
-దబ్బీరు ప్రభాకర్,రాయపూర్

వహించు
వహించు
జనాదరణ పొందాలంటే ధర్మం ప్రధానం
గ్రహించు.....!!
-శ్రీమతి భారతీకృష్ణ. హైదరాబాద్

ఆలన
లాలన
ఎప్పుడైనా జనాదరణ పొందినదే స్వచ్ఛమైన
ప్రభుత్వపాలన.
-సింహాద్రి వాణి విజయవాడ.

నదీమ తల్లి

నదీమ తల్లి
పంచభూతాత్మ వల్లి
అవని పై సిరుల కల్పవల్లి
అమృత నిర్ఝరిని గంగామతల్లి!
ఎప్పుడు పారే యేరే
ఉర్వి లో స్వర్గధామం!
నదీ పరివాహక ప్రదేశాలు
ఆది మానవుని బ్రతుకు తెరువు కు ఆదెరువులు
నదీమ తల్లి
ఆధునిక మానవుని జీవితంలో
నింపింది క

నాటి తరం వారి కథలు నేటి తరానికి

కథల వంతెన

కిర్రు చెప్పులు

–దార్ల రామచంద్ర

1995లో రాసిన కథ

"తాతయ్య ఇగో.. అన్నయ్య ఈరోజు బడికి పొయ్యేటప్పుడు చెప్పులు పోగొట్టకుండు" చెప్పింది పాప. రమణ అన్నయ్యపై చెప్పుడు మాటలు విన్న తల్లి "ఓ రాజుగా.." పిలిచింది కొడుకుని గొంతెత్తి.

"వస్తున్నానమ్మా" అంటూ వచ్చాడు రాజు కడుపులో భయం భయం.

''ఏరా నీ చెప్పులేవి?'' నిలదీసినట్టు అడిగింది తల్లి రాజును.

బిక్క మొఖమేసుకొని నీళ్ళు నములుతు చెల్లెలు వైపు చురచురా చూస్తూ నా.. నా.. చెప్పులు పోయినయమ్మ'' అన్నాడు గుటక తిప్పుకొని.

"పోతే పోయినాయిలే.. ఆ గొప్ప చెప్పులు! వాని కొట్టబాకులే" అని సపోర్టుగా పలికిండు తాతయ్య.

కోపం ఆపుకోలేక రాజుని జుట్టుపట్టి చడామడా చెంపదెబ్బలు కొట్టింది తల్లి.

"అబ్బా సూరమ్మ వాన్ని కొట్టొద్దన్నానా? ఎందుకు వాన్ని బాధపెడతావు. అవేమన్నా కిర్రు చెప్పులా?" అన్నాడు తాతయ్య.

కిర్రు చెప్పులా? అవెట్టుంటవో మన మనస్సులోనే ఆ మాట వినగానే వాటి గురించి తెలుసుకోవాలనుంది రమణ.

"కిర్రు చెప్పులా! వాటి గురించి చెప్పవా తాతయ్య" అంది తాతయ్యతో రమణ.

''అదేదో పెద్దకథలే వాటి గురించి చాంతాడంతా పొడుగు ఆ కథ ఇప్పుడు వద్దు" అన్నాడు తాతయ్య.

రమణ పట్టుపట్టింది. కథ చెప్పాలంటూ మారాం చేసింది.

తాత కథ చెప్పటం, రమణ 'ఊ' కొట్టడం మొదలైంది.

ఆనాటి వృత్తి తనపాత జీవితం గురించి చెప్పటం ప్రారంభించాడు.

"కరకరమని పొద్దుపొడిచి బారెడెక్కింది. ఎండ చురచురమని కాస్తుంది. మా గుడిసెలు పక్కపక్కనే కలుసుకుంటాయి. మా ఇంటి పక్కనే మైసయ్య ఇల్లు ఉంది" మైసయ్య పనిపెట్టి పానరాయి మీద గూటం దెబ్బ కొడుతూ తోలును ఊనుతు వరి చేస్తుండు. సీరియస్‌గా చెప్పులు కుట్టేపనిలో ఉన్నాడనిపిస్తుంది. అరె దిగకపోతే ఎద్దుకొమ్ముతో గుచ్చి తీసి చెప్పు కుదుతుండు. కత్తి తెగకపోతే అంతే పనిని తొందరగా పూర్తిచేసి ఆతృతగా ఉన్నట్టుంది.

"మైసన్నా" అంటూ పిలిచిండు భద్రం "ఆ.. ఎవరూ?" తలపైకెత్తి చూసి భద్రం నువ్వా? ఎప్పుడచ్చినవు తమ్ముడా?"

"రాత్రి పొద్దుపోయింది వచ్చేసరికి?" ఈ చెప్పులు వెరైటీగా ఉన్నాయే అన్నాడు.

భద్రం. "అవును తమ్ముడు కిర్రు చప్పులా? అంటే?"

ఓ చిరునవ్వు నవ్వి, "నీకు తెలియదులే నువ్వు చదువుకుంటున్నావుగా" అన్నాడు మైసమ్మ.

"కాళ్ళకు తొడుక్కుని నడుస్తుంటే కిర్రు కిర్రు మంటు తమాషాగా శబ్దం వస్తుంది. ఆ చెప్పుల్ని దొర రకం చెప్పులంటారు. గిప్పుడర్థమైందా?"

"ఔ గట్లనా" చెప్పులపై ఎర్రటి ప్లాస్టిక్‌తో చేసిన పూలలాంటి కుచ్చులు రకరకాలుగా అలంకరణతో చేసిన ఆ చెప్పులు ప్రత్యేక తయారి తరహాను తెలియజేస్తున్నా అందంగా ఆకర్షణీయంగా చూసిన వాళ్ళను ఆకట్టుకునేట్లుగా ఉన్నాయి.

"ఎవరికి కుడుతున్నావ్ చెప్పులు?"

> "తాలే.. లల్లాయిలే.. శితాలే.. లల్లాయిలే" అంటూ డప్పు వాయించడంలో మైసన్నది తిరిగిన చెయ్యి. చిర్రపట్టి చిటికలేసి డప్పుకొట్టడం, చిందు వేయటం మైసయ్యకు వెన్నతో పెట్టిన విద్య"

"మన ఊరి సర్పంచ్ దొరకి" సర్పంచ్ దొరకా?" కనుబొమ్మలెగరేస్తు అన్నాడు భద్రం.

"అవును సర్పంచ్‌కే చిన్నా" అన్నాడు మైసయ్య మరోసారి.

"ఈ చెప్పుల్ని దొర ఎప్పుడు ఏసుకున్నట్లు చూడలేదే! అని మనస్సులోనే అనుకున్నాడు భద్రం.

"అన్నా! నిజంగా ఈ చెప్పుల్ని సర్పంచ్ దొరకేనా?!" మళ్ళీ రెట్టించి అడిగిండు భద్రం.

"అవును–అవును" తలాడించాడు. మైసయ్య ముసిముసి నవ్వులునవ్వుతు అందరు ఈ చెప్పుల్ని తొడగరు. దొరకు, పటేల్, పట్వారి, మాలీపటేల్, పోలీస్ పటేల్‌లాంటి వాళ్ళు దొరలకు మాత్రమే ఈ చెప్పుల్ని చేయించుకుంటారు" అన్నాడు మైసయ్య.

"ఓసారి నాకాళ్ళకి తొడుక్కుని చూస్తా ఎట్లుంటవో... కిర్రు కిర్రు చెప్పులు చప్పుడస్తదో జర చూస్తా ఇయ్యవా" అంటూ అడిగిండు భద్రం.

"గట్లనా పిల్లకాయ చేష్టలు కాదు. మాసినట్టు పాతగా అనిపిస్తే దొర కోప్పడుతాడు జర సమాజ్ అయిందా'' అన్నాడు మైసయ్య చిరుకోపం ప్రదర్శిస్తూ..

"ఎట్లుంటవో, ఎట్ల చప్పుడస్తదో తొక్కి చూస్తే తప్పా?"

"తప్పా.. తప్పన్నరా?' మైసయ్య లేచి చెంబుచేత పట్టుకొని దొడ్డికి పోయిండు రాజుకంటే మొండివాడు బలవంతుడన్నట్లు మనస్సులోనే అనుకోని చెప్పులేసుకుని కాళ్ళకు నాలుగడుగులు అటూ ఇటూ రెండు మూడుసార్లు నడిచి చూసిండు. కిర్రుమనే సౌండ్ సంగీతంలా వస్తుంది.

'ఓహో!'' మనస్సులోనే మైసయ్యను మెచ్చుకున్నాడు. సింధూ నాగరికత ముందునుంచే ఉత్పత్తిలో భాగం పంచుకొని, శ్రమతో అన్నిటిని సృష్టించింది. మనమే కదా! భద్రం మనస్సు పుటల బతుకులోతుల్లోకి మళ్లింది.

మసక మసక చీకట్లో నిద్రలేచిండు మైసయ్య చుట్ట చుట్టుకోని పొయ్యిలో నిప్పుతో చుట్ట అంటించుకొని మూలన ఎర్ర మట్టిమీద ఉన్న కోడవలిని పట్టుకొని, నెక్కొయ్య మీద తాడు తీసుకొని అడుగులు సారించి అడవికి బయలుదేరాడు. బారెడు పొద్దెక్కాక కట్టెల మోపు ఎత్తుకొని ఇంటికి చేరిండు మైసయ్య.

భార్య కమలమ్మను పిలిచి తెచ్చిన తంగేడు కట్టెల మోపు చూపిస్తు ఆ పుల్లల్ని వదల కొట్టమన్నాడు.

"గట్లనే వదల కొడ్తలే" అంది కమ్మలమ్మ. చెక్క పట్టుకొని వచ్చి పుల్లల్ని తోలు వదలకొట్టి ఎండలో ఎండబోసింది ఆ పొట్టుని.

కమలమ్మని మైసయ్య పిలిచి "మొన్నటి ఎద్దుతోలు, ఉప్పు. సున్నం పట్టించిన దాన్ని తట్టలో పెట్టిన దాన్ని తీసి గాబులో పడెయ్యి. రెండు మూడుకుండల నీళ్ళు పొయ్యి" అన్నాడు.

"చేస్తలే" తలాడించింది కమ్మలమ్మ. తోలు గోలంల ఏసి, ఒలిచిన తంగేడు. చెక్క పొట్టుని అందులో పోసి రెండు మూడు కుండల నీళ్ళు పోసింది. కొంచెం సున్నం, ఉప్పు అందులో ఏసింది. ఆరు ఏడు రోజులు తరువాత ఆ గల్లాలోంచి తోలును కత్తితో ఊనిండు మైసయ్య. కొద్దిగా వాసన వస్తుంది. ఆ తోలు, గల్లాలోని కుళ్ళు కంపు మురుగు వాసన కొడుతున్నాయి.

ముక్కు మూసుకొని బిగ్గరగా "అబ్బే– ఏందో ఈ వాసన మురుగువాసన" అంటూ గొనుక్కుటే పోతుండు గూడెంలోకి "ఏం పని మీద వచ్చిండే" అంటూ మనస్సులోనే అనుకున్నాడు మైసయ్య.

నీళ్ళలో జాడించి, ఎండలో ఒకరోజు ఎండిన తర్వాత మంచిగ తయారైంది. ఆ తోలుతో దొరగారి కచ్చడం బండి ఎడ్లమెడకు గజ్జెల పట్టాలు చేసిండు. దొర కచ్చడం పోతుంటే గలగలమని శబ్దం వచ్చేది. దొరగారిఫ్రిజ్‌లాంటి నీళ్ళకు నీళ్ళ తిత్తి.. దొరకు దొరసానికి కిర్రు చెప్పులు. దొరపాలేర్లకు ఇరవై జతల చెప్పులు. దొర ఇరవై అరకలకు భేరటాకులు, ఊరి వడ్రంగికి కొలిమితిత్తి, గొండ్ల వాళ్ళకు తాడెక్కి ముస్తాదులు, దొరగారికి చంద్ర కోల ఇలా రకరాల తోలు వస్తువులు కుట్టిచ్చేవాడు మైసయ్య.

కూటి కొరకు కోటి విద్యలన్నట్లు మా ఊళ్ళో ఇలాంటి కుటుంబాల చేతి వృత్తిపై బతికెటోల్లకు ముప్పై నలభైదాకా ఉంటాయి. రైతు లంబాడ తండ రైతుల్ని ఊరంతా బాగాలుగా పంచుకొని పట్టడం నా వాళ్ళ కులవృత్తి.

''ఈ సంవత్సరం కాలం మంచిగైంది. కట్టమైసమ్మకు పెట్టాలే. చెరువు తూము పదిలి వరి నాట్లు మొదలు పెట్టాలే" అంటూ ఊరి మాదిగ దప్పు దండోరా వేసాడు. నాట్లు అయినాక అందరూ ఊరంతా వండుక తిని (వనభోజనం) పోయింద్రు. పందుల్ని, మేకల్ని కోళ్ళని ఎవరికి తోచిన ఆర్థిక స్తోమతను బట్టి వాళ్ళు కోసుకొని ఉత్సాహంగా పండుగలా ఆ రోజు గడిపేటోల్లు.

"మా మాదిగలు కొందరు ఎవరి ఆసామి రైతుల దగ్గర వాళ్ళు అన్నం, కూరలు అడుక్కొచ్చు. కొనేటోళ్ళు లేదురా.. పో అంటూ ఇసడించే వాళ్ళు కొందరు కుక్కలకన్నా హీనంగా చూసేటోల్లు.. ఛీ... చా.. లేదురా.. పో గాడిద కొడకా అని తీసి పారేసేటోల్లు" ఈ పద్ధతి చూసి భద్రంకు ఈ బ్రతుకులొద్దురా అనిపించేది.

మనసులోనే గత చరిత్ర జ్ఞాపకానికొచ్చింది భద్రంకు.

చావుకాడ దప్పులు కొట్టి పాడెమీద శవం కాలేదాక కష్టం దగ్గర కుక్కలాగ కాపలా కాయడం చేసేవాళ్ళు

"తాలే.. లల్లాయిలే.. శితాలే.. లల్లాయిలే" అంటూ డప్పు వాయించడంలో మైసన్నది తిరిగిన చెయ్యి. చిర్రపట్టి చిటికలేసి డప్పుకొట్టడం, చిందు వేయటం మైసయ్యకు వెన్నతో పెట్టిన విద్య.

పెండ్లీలకు పీరీల సవార్లకు డప్పు కొట్టడం, చాటింపులు, దండోరా వేయడం మాదిగల కుల వృత్తి. మాదిగ.. మాలలు లేకుండా గ్రామం తన జీవనాన్ని ముందుకు నడిపించేది కాదు. కాలు కూడా కదుపలేదు.

ఈ ఏడుకాలం మంచిగైంది. వరి కోతలు కోసింద్రు. కుప్పలు ఏసింద్రు. ఈ సీజన్లలో తీరిక ఉండదు. దొర కల్లం జోలి మనస్సులో పడింది కమలమ్మకు కోడికూతతోనే భర్తను నిద్ర లేపింది.

"ఏమయ్యా! ఈ రోజు దొరగారి కల్లం చెయ్యాలే. గింత శ్రద్ధలేకుండా నిద్రపోతున్నావు.. లే.. మొఖం కడుక్కో పోదాం" అంది కమలమ్మ మైసయ్యని.

"ఇద్దరు రెండు కొడవళ్ళు తీసుకొని పారక ఒకటి కుండ ఒకటి పట్టుకొని బయలుదేరారు. వరి మడినంతా కొయ్యకాలు కోసింద్రిద్దరు. మట్టిగడ్డలు చిదిపి నున్నగా సదును చేసింద్రు. కమలమ్మ కుండతో నీళ్ళు తెచ్చిపోస్తుంది. మైసయ్య కల్లంలో చల్లుతుండు. దొర పెద్ద జీతగాడు. గొడ్లను బంతికట్టి, కళ్ళంలోకి తీంపుతుండు. నున్నగా చదునుగా తయారైంది. కళ్ళంను పొరకతో మంచిగ శుభ్రంగా ఊడ్చింది కమలమ్మ.

రాత్రి సందకాడనే బండి కట్టుకొని, బంతికి ఎడ్లని ఇంకొన్నింటిని తోలుకోని బండిమీద ఇతర సామానులు వేసుకొని పెద్దజీతగాడు బయలుదేరిండు. ఇరవైమంది జీతగాళ్ళు 25 రోజులు రాత్రనక, పగలనక కుప్ప కొట్టింద్రు. వీళ్ళతో పాటు మైసయ్య కూడా కుప్ప కొట్టిండు, రెండువందల పుట్ల వరిధాన్యం వడ్లు తూర్పార పోసింద్రు పెద్ద జీతగాడు వడ్లు కొలిసిండు. .. బండ్లకు వడ్లు ఎక్కిచ్చి రెండురోజులు తోలింద్రు వడ్లు చివరి నాలుగు కుండలు కల్లంలో ఉన్నాయి. "బాంచెన్ దొరా ఈ గింజలు ఉండనియ్యిండ్రి" అంటూ దొర కాళ్ళమీద పడింది. బతిమలాడింది. కాళ్ళవేళ్ళా పడి మొక్కింది.

"బాంచెన్ దొరగారు నా పోరగాళ్ళను బతకనీయ్యండ్రి. ఈ గిన్నిగింజలు ఉండనీయండ్రి" అంటూ మైసయ్య కమలమ్మ ప్రాధేయపడింద్రు.

"మరో రెండు కుండలు కొలువురా అన్నాడు దొర?"

కల్లం అడుగు బొడుగులు ఊడ్చి బాగు చేసుకున్నది. కాలులో కొన్ని, పొల్లులో కొన్ని తూర్పారా పోసింద్రు. అన్నీ కలిపి ఓ నాలుగు కుండల వరకు అయినాయి. అవి తినిపారేసిన ఇస్తారాకుల్లో వెతుకులాట ఆ గింజులు కనిపించినాయి.

ఏడాంతంతా గొడ్డుచాకిరి చేసినా! వరినాటుల నుండి కుప్పకొట్టే వరకు పని చేయించుకొని, మాదిగపనితోపాటు ఈ ఎట్టి చాకిరి ఏడాది చేసినా!

> "వృత్తి వూడితే వూడింది. ఆత్మ గౌరవం మిగిలింది. అంటరానితనం తగ్గుమొఖం పట్టింది. ఈ విధానం వల్ల పూర్తిగా మార్పురాకపోయినా, పాక్షికంగా మార్పు జరిగినందువల్ల మైసయ్యకు భద్రంకు గొప్ప మానసిక సంతోషంగా ఉంది"

చివరకు యియ్యేవడ్ల గింజలు గతి" మనసులో బాధపడ్డాడు మైసయ్య. భార్య కమలమ్మ కూడా ఈ బాధల కంతం లేదా?" అని వాపోయింది.

పెద్దబిడ్డా పెండ్లీడుకు వచ్చింది. పెద్దమనిషై ఆరెండ్లయింది. ఈ ఏడైనా లగ్నం చేద్దామంటే ఈ ఆధారం గిట్లుదే. లగ్గంకు పెట్టే లాచనాలు, కులం బంతి భోజనం లగ్గంకు పై ఖర్చులు అన్ని తడిసి మోపెడంతా ఖర్చు వస్తది. మాకష్టం బండేడు. ఆదారం పిడికేడు ఎట్లా. ఈ బతుకుల్ని ఎల్లదీసేది" మనసులోనే చింతించింది.

అప్పోసప్పో చేసి బిడ్డలగం చేసిండు మైసయ్య. అప్పుమీద నాగు, నాగుకు అసలు నాగు, పెరిగి అప్పు తీర్చటానికి ఇద్దరు కొడుకుల్ని పాలేర్లుగా పెట్టిండు మైసయ్య. ఏడేల్లు పనిచేసినా అప్పు తీరలేదు. కొన్నాళ్ళకు చిట్టచివరకు అప్పు జైలునుండి బయట పడిండు మైసయ్య.

చిన్నప్పటినుండి తన కులవృత్తి నేర్పుదామను కుండు తన కొడుకులకు మైసయ్య పరిస్థితులు కలిసిరాక పశువులకాపర్లుగా చిన్నతనమునుండే పనిలోకి దింపిండు. పెండ్లీడు వచ్చేదాక జీతాల పాలైరి. చలి నీళ్ళకు వేడినీళ్ళలా సంసార సాగరం ఈదిండు మైసయ్య..

''భద్రం గీషాపులో మన మాదిగ వస్తువులెందుకున్నాయి? దేశంలో మార్పుతో పాటు, సంఘం మారుతోంది. దేశంలోని పారిశ్రామికా వేత్తలు పరిశ్రమలను స్థాపించింద్రు. మాదిగలకు సంబంధించిన తోళ్ళ పరిశ్రమలు కార్కానాలు, తోలు వస్తువుల వృత్తి మాదిగల కులవృత్తికి ప్రత్యామ్నాయంగా పరిశ్రమలు పుట్టుకొచ్చాయి. మోటలకు బదులు ఆయిల్, కరెంట్ ఇంజన్ వచ్చింది. నాగటికి బదులు యంత్రాలు వచ్చాయి. చేతివృత్తులకు బదులుగా దేశంలో పరిశ్రమలు వస్తువులు ఉత్పత్తి చేయసాగాయి. మారుతున్న కాలంతో పాటు పల్లెల్లో ఎన్నో మార్పులు వచ్చాయి. పరిశ్రమల్లోని వస్తువులు దేశంలో దర్శనమిచ్చాయి. నాగ్‌పూర్, కాన్‌పూర్ బాటా కంపెనీ చెప్పులు, షోలాపూర్ బ్యాగ్, ప్లాస్టిక్ చెప్పులు, లెదర్‌బూట్లు, బెల్ట్‌లు రకరకాల తోలు వస్తువులు దేశమంతటా షాపుల్లో ఎక్కడపడితే అక్కడ కోకొల్లలుగా లభిస్తున్నవి. అందుకే కావచ్చు తమ్ముడు? "రైతులు, దొరలు, కాపులు, రెడ్లు, చెప్పులు చేయించుకోవటం తగ్గించింద్రు. ఈ షాపుల్లో కొనుక్కోవడం మొదలు పెట్టింద్రు.

క్రమంగా వారు ఆ చెప్పులకే అలవాటుప డ్డారు. మెల్లగా మన వృత్తి కనుమరుగైంది. అంటూ వాపోయాడు భద్రంతో మైసయ్య చెప్పుకుంటు.

"నా యిద్దరు కొడుకులకు పెండ్లి చేసినా, కొంత అప్పయినా దాన్ని తీర్చలేకపోయినా, పట్నం పంపినా పెద్దోడు ఉప్పరిపని చేస్తుండు. చిన్నోడు రిక్షా తొక్కుతుండు. అప్పుతీరక వాళ్ళు మేము పట్టణంలోనే ఉండిపోయాము" అన్నాడు మైసయ్య. ఇప్పుడు పట్టణంలో మిమ్మల్ని ఎలా చూస్తున్నారు. మైసన్న?""ఓరేయ్ మైసయ్య రా... రా పోరా అంటూ యిక్కడ ఈసడింపులు లేవు. కులం గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. ఓ రిక్షా అబ్బాయి ఇటురా!.. ఫలానా కాడికి ఎంత తీసుకుంటా వబ్బాయి. బాబు రిక్షా ఎంతకొస్తావు.. అంటూ మనిషిని గౌరవంగా మనస్సుల్లాగానే పిలుస్తుండ్రు. చూస్తుండ్రు" అన్నాడు మైసయ్య. వృత్తి వూడితే వూడింది. ఆత్మ గౌరవం మిగిలింది. అంటరానితనం తగ్గుమొఖం పట్టింది. ఈ విధానం వల్ల పూర్తిగా మార్పురాకపోయినా, పాక్షికంగా మార్పు జరిగినందువల్ల మైసయ్యకు భద్రంకు గొప్ప మానసిక సంతోషంగా ఉంది. అప్పు విధానంతో ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉంది.

(జ్వలిత సంపాదకత్వంలో వెలువడిన "ఖమ్మం కథలు" నుండి...)

తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల శాఖ ప్రతి వారం 'జూమ్'లో నిర్వహిస్తున్న "సోమవారం కవిసమ్మేళనం–కవివారం'లో కవులు పాల్గొని చదివిన కొన్నికవితలను నేటినిజం పాఠకుల కోసం..

నిర్వహణ –కందుకూరి శ్రీరాములు –బెల్లంకొండ సంపత్ కుమార్

నల్లికుట్లోడు!

చీమలు పెట్టిన పుట్టలు
పాములకు నెలవైనట్లు.
తేనెటీగలు పెట్టిన తేనె
తెరువరుల పాలైనట్లు.
కాకి పొదిగిన కోయిల గుడ్లు
కోయిల పిల్లలైనట్లు.
తుమ్మెద గూట్లోని పచ్చపురుగు
భ్రాంతి కలుగు భ్రమరంబైనట్లు.
తా కుడువక దాచిన సొమ్ము
దొంగల పాల్ చేసినట్లు.
ఆల్చిప్పలో పడ్డ స్వాతిచినుకులు
మేటి ముత్యములైనట్లు.
చుట్టూ వల్మీకము పెరగంగ
దారి దొంగ వాల్మీకి అయినట్లు.
నల్లులు కుట్టి మెళుకువగా ఉన్న
ఇంట దొంగలు పడరన్నట్లు.
పురుగుపుట్ట చీమలు తుమ్మెద్దైన
దొంగ నల్లి యైన మేలు రా!.
నరునివై వుండి నలుగురికి
చేయూత అందించవేలరా!.
పక్కనే ఉండి తెలియకుండా
నల్లి లెక్క కుట్టు నల్లికుట్లోడు !.
నల్లికుట్లోన్ని నమ్మకురా
వాడు తేలు కొండి రా.
నమ్మి నాన బోస్తే
పుచ్చి పనికిరాని బుర్రలైతయి !.

– పి.బక్కారెడ్డి
9705315250

నిర్జీవ కళారాశి

ఉదయం తన ఉనికిని
చాటుకునే ప్రయత్నం లోపు
సడి లేకుండా
ఆమె నెమ్మదిగా తెచ్చిన
చక్కెర లేని చాయ్
అతని నాలుకపై చల్లారుతుంది
రసాస్వాదన లేకుండానే.
రాత్రి కలలు ఆమెను
ఏ ఆశలతో మురిపిస్తాయో
తెల్లవారుతూనే
మొదలవుతుంది యుద్ధం
ఆమె మౌనమంటే
ఎంతో భయం అతనికి
ఆమె చూపుల ప్రశ్నలకు
అతని కళ్ళు నేలకు వాలుతాయి
పొదుపు మాటలు
నిశ్శబ్దానికి హారతి పడతాయి.
రెక్కలు మొలిచిన
రెండు పక్షుల బాటలో
ఎగిరి దూరంగా వెళ్ళడానికి
ఒప్పుకున్న పర్యవసానం
గుండెను లోతుగా తవ్వి
ఎప్పటికీ దూరం కాని
ఒంటరితనాన్ని మిగిల్చింది.
ఇద్దరు ఉన్న ఇంట్లో
ఎవరికి వారు ఏకాంత తీరాలు
జ్ఞాపకాల ఎండమావులతో
ఎడారై కాలుతున్న హృదయాలు
రాతిరి చీకటి గదిలో ఆమె
అతని కౌగిలి సేదలో
పువ్వులా ముడుచుకొని
రోజంతా నింపుకున్న ఆవేదనను
కరుణ రసంగా స్రవిస్తుంది
నిర్జీవ కళారాశి అయిన
ఆమెను పొదువుకొని
కన్నీటిని రెప్పలలో దాస్తూ
మాటలు రాని శిల్పంగా అతను...!!

–అరుణ ధూళిపాళ

చితాలఉచ్చు–ప్రగతికి ఉరి

ఎన్నికల్లో యెన్నేన్ని కలలలో
ప్రతిఐదేళ్ళకొకసారి జరిగేతంతే
కండువాలు ఖుజాలు మారుతుంటాయి
పొగిడిన నోళ్ళే తెగుడుతుంటే
జనాలందరు నోళ్ళెళ్ళబెట్టి
గుడ్లెళ్ళబెట్టి కళ్ళప్పగించి చూస్తున్నారు
వలలు విసరుతూ జనులందరికి
ఏదికావలో అదిఅందజేస్తు
సుక్కనీరులేకపోయిన
తడారిపోతున్నగొంతుకు
మద్యపుచుక్కలు
సప్పపడ్డనాలుకలకు బిర్యానీ పొట్లాలతో
రాబోయేఐదేళ్ళదాక
బతుకుల ఆగమాగం చేసే ప్రణాళికలే
తాత్కాలిక నజరానాలు లక్ష్మీ కటాక్షాలు
చిఱు జల్లులు వాగ్దానాలు
మనస్సులలో దింపుదుకల్లంఆశలు
కొడిగడుతున్నబతుకులకు
ఏవోకొత్తకాంతిరేఖలుగాజులకళ్ళకు
ఉచిత పథకాల ఉచ్చులో
కార్మిక కర్షక యువశక్తిని
నిర్వీర్యం చేసేరాజకీయపథకాలు
పనిని కల్పిస్తేతమకాళ్ళమీదనిలబడి
తలెత్తుకొనితిరుగకుండదగా
నిరోద్యోగ నిర్మూలనకు తిలోదకాలు
యువతకుజరుగుబాటులేక
వక్రమార్గంపట్టిచేటి ఊబిగుంటలు
ఇంటింటికి ఓట్లబిక్షకై
నోట్ల సంచులతో తిరుగుతారు
బీదబిక్కి పేదమద్యగొప్పలనే
తెడాలసలేఉండక ప్రతియింటి
గడపలుతొక్కుతుంటె
సమసమాజ స్థాపన జరగుతున్నట్లు
ప్రతిసారి జరిగే ఎన్నికల్లో జనాలు
గొర్రెల్లాగ కసాయిల చేతిలో మోసపోతు
బలిపశువుల్లె పోతూనేయుంటారు
గడ్డి పోచలేనుగునుబందించినట్లు
చలిచీమలే సర్పాని గెల్చినట్లు
మానవులకు ఓటేఆయధం
తలరాతలు మార్చె నయాగారం.

–సుదర్శనం వేణుశ్రీ.

పరంజ్యోతి

ముక్కుపచ్చలారని ముద్దుబిడ్డ రహదారి రక్కసికి కబళమయింది
కొడిగట్టే దీపం నాలుగు దీపాలను వెలిగించిగానీ కొండెక్కలేదు
జ్వలించే దీపమై మరో నాలుగిళ్ళలో
జ్యోతి వెలిగించిగానీ కోవెల చేరలేదు
అచేతనంలోకి జారిన ఆత్మజ్యోతి పరంజ్యోతి స్వరూపమై
పంచహారతి వెలిగించిగానీ
పరమాత్మలో ఐక్యం కాలేదు
అవయవ దానంతో అమ్మతనానికి అర్థమిచ్చిన మానవతకు వందనం
ముక్కలైన కన్నపేగు మరో పేగు బంధానికి పాదుగా మారిన
మహోన్నతకు అభివందనం

–పద్మశ్రీ చెన్నోజ్వల

ఒకరికొకరుగా

భాష అర్థం అయితలేదో
భావం అగుపడతలేదో
గమ్యం చేరాక
మనసే మదనపడతలేదో
నడిచిన దారి
ఎక్కిన మెట్లు మారిపోయి
ముంచేస్తుంది ఈ లోకంలో
అందరిలో ఒకరిగా
అంతే స్వార్థంగా
సమిధలైన వాళ్ళ ఆశయం
అక్కడే ఆగకుండా త్రోవ
ఒకటి ఉంటేనే
మార్పు మరో అంకురం
సృష్టించుకుంటుంది
మొదలు నేనే కావచ్చు
అంతిమం యావత్ ప్రపంచం
సాగాలి
సరిహద్దులు తొలగాలి
శిఖరమై నిలవాలి
ఒకరికొకరుగా

– కె. భానుజ

ప్రియతమా!

ఎదురుచూపుల్లో
అలసిన నా కన్నులకు
నీ రాక పున్నమ.
రెప్పవేయనికంటివరద
నీ కౌగిలిలోకి
ఇంకిపోయిన క్షణాలు..
మూగబోయిన మనసు పరిమళాలు
ప్రేమపుప్పొడిగా
పెదవులంటినఆనందాలు
అయినా..నాకేదోభయం
ఏ ఉన్మాదం జడలు
విప్పుతుందో..
ఎట్నుంచిఏం ముంచుకొస్తుందో!
సెలవులు రద్దు చేసి రమ్మంటారేమో!
ప్రియసఖా నీకు తెలుసా!
నీవు లేని రాత్రులు
మెలిపడ్డ వేదనలెన్నో
గుండెల్లో పేలుతున్న
శబ్దాలు..
కళ్ళ ముందు కలత దృశ్యాలు..
మనసు నిద్రకువన్ని గాయాలో!
నిద్ర మెలకువకానిస్థితిలో
పాశమేదో లాగుతున్నట్టు,
ఊపిరి విలవిలలో
నన్ను నేనే ప్రాణ ప్రతిష్ట
చేసుకుంటూ..
అదిరిపడి లేస్తుంటాను.
ప్రియ సైనికా!
ఈసారి నీ వెళ్లేప్పుడు
నీ నీడగా నా ప్రాణం
నా తోడుగా నీవూ ఇక్కడే..
వెలుగు పూల
కుంకుమ భరిణలో
దాపెట్టే చూసుకుంటా
రోజు హారతిచ్చి
వీర తిలకం
దిద్దుతూనేఉంటా..
ప్రియతమా! భద్రంగా
తిరిగొస్తావు కదూ
ఓ నా ప్రాణమా!
పదిలంగా వస్తావు కదూ

–గడ్డం సులోచన
7702891559.

చాకోలెట్....

పిల్లలు,పెద్దలని తేడాలులేని
ప్రాంతీయభావం,
కులమతభేదపు నీడలు లేని
రుతుకాలాల భావంఎరుగని
అందాల క్యాడ్ బరిని
తనివితీరా ఆస్వాదిస్తూ
పంచదార
ప్రపంచానికి తరలిపోదాం
ఎదలోని
సవాలక్ష సమస్యలను సాఫ్ చేసి
టెన్షన్లన్నింటిని మాఫ్ చేసి
సెల్లు, టీవీ లను స్విచ్ఛాఫ్ చేసేసి
దునియామరచి డైరీ మిల్క్‌ను చప్పరిస్తూ బైటూ చేసుకుందాం
దివ్యలోకం ద్వారాలు తెరుద్దాం
వాదాలు ,భేదాలు విడిచి
ఒళ్లంతా కళ్లుగా ఎదురుచూచే
గల్లీ కొట్టుకు నాలుగడుగులు
అలా నడిచి
ఒక ఫైవ్ స్టార్ కొనుక్కొని తింటూ
తీయతీయని
రుచుల ఒడిలో ఓలలాడుదాం
ఓకే భూమ్యాకాశాల క్రింద
కబుర్లెన్నో కుప్పపోసుకుని
కమ్మని కాఫీ బైట్ ని కొరుకుతూ
సాయంకాలం సంతోషాన్ని
చాకోలెట్ ఒక మధువులూరే
మధుర పదార్థం
మనసుకు మహావేడుకనుట యదార్థం
అది వుంటే ఆనందలోకం
అది తింటే తీయనీ మైకం
అణువణువూ సమభావం
చప్పరింతల్లో చెప్పలేనంత
పరవశం
అది నోట్లో పడితే ఎవరుకారు
దాని వశం.

–రమేశ్ నల్లగొండ

అత్తయ్య మా దగ్గరే ఉండాలి

మామయ్య చచ్చిపోయాడు
చచ్చినట్లు అత్తయ్య మా దగ్గరే ఉండాలి.
డబ్బుల లెక్క తెలియదు
మామయ్య ఫెమిలి పెన్షన్ వస్తుంది
ఎవరి దగ్గరా వద్దు
అత్తయ్య సంవత్సరమంతా
మా దగ్గరే ఉండాలి.
అత్తయ్య ఇంటి చాకిరంతా చేస్తుంది
పని చేయకంటే చిన్న బోతుంది
ఎంతో ఆరోగ్యంగా ఉండటానికి
రహస్యం ఇంటి చాకిరి చేయడమే
దగ్గు రాదు
దమ్ము రాదు
జ్వరం రాదు
డాక్టర్ అవసరమే ఉండదు
అత్తయ్య కు
అసలు డబ్బు అవసరమే రాదు.
మేమంతా రాత్రి ముందే నిద్రించినా
ఆమె ఇంకా పని కాదే
వంటింటి వాసము.
మా అందరి కన్నా ముందే లేస్తుంది
మాకు టీలు టిఫినులు చేస్తుంది
మనుమలకు మనుమరాళ్లకు డ్రెస్సులు
వేసి స్కూలు బస్సు ఎక్కిస్తుంది
మళ్లీ వంట చేస్తుంది
కూరలన్నీ ఎంతో రుచి.
.నేను పనిచేద్దామంటే ఏ పని నాకు
మిగలనీయదు అత్తయ్య
ఏం చేద్దాం!
పని అంటే అత్తయ్యకు ఆరాధన
కర్మిష్టి.
పండగలైనా లగ్గాలైనా
ఎవరు రమన్నా ఎక్కడికి వద్దు.
అత్తయ్య మా దగ్గరే ఉండాలి
ఇల్లే వైకుంఠం అత్తయ్యకు

–కందాళై రాఘవాచార్య

గుండెకు నిప్పు అంటిస్తున్నాయి

నేను రాతిరంతా పుస్తకాలతో
మాట్లాడుతుంటే
లోకం చీకటి వెలుతురులన్నీ నాతో
విప్పి చెబుతున్నవి
కొన్ని నా గుండెకు నిప్పు అంటిస్తుంటే
కొన్ని తుపాకీనీ నా చేతికిస్తున్నాయి
కొన్ని కన్నీళ్లను మనసు నుంచి దులుపుతున్నవి
నీటిలో దూకిన సూర్యుడు బల్బులో దూరి
వెన్నెల వెలుతురు పోస్తుండు
చెట్ల ఆకులు ఫ్యాన్ రెక్కలలో చేరి నా పైకి చల్లని గాలిని వీస్తున్నాయి
ఆకాశగంగా బిందెలో పడుకొని
గ్లాస్ తో నా దాహం తీరుస్తుంది
నా భార్య నా ప్రక్కనే గురకతో శారీరక శ్రమను వెళ్లగొడుతుంది
పట్నం చీకటి దుప్పటి లో దూరి
రేపటిని కలగంటుంది నిశ్శబ్దమై
సూర్యుడు ఎప్పుడో డ్యూటీ దిగి
ఇంటికెళ్లిపోయిండు
అమావాస్య చీకటి చంద్రునికి
సెలవు ప్రకటించింది
ఆకాశంలోబాల కార్మికులు మాత్రమే
మిణుగు మిణుగురు మంటూ చీకటులను ఊడ్చేస్తున్నారు
మేఘాలు నేల స్వేదను మింగి చల్లగా మత్తుగా నిద్రపోతున్నాయి

–గుండెల్లి ఇస్తారి
9849983874

ఆహ్వానము
శరత్ సాహితి కళా స్రవంతి, కరీంనగర్ &
తెలంగాణ సాహిత్య వేదిక, కరీంనగర్
సం

మళ్ళీ ఒకసారి.. ఆ విన్యాసాన్ని నాకు అనుగ్రహించు!

తడబడే శైశవంలోనో
తుళ్ళిపడే బాల్యంలోనో
నీ ముందో, అమ్మ ముందో
అడుగువేస్తే
ఆమె మురిసిపోయి పొంగిపోయింది
అందరూ విద్యాభ్యాసం
అక్షరాలతో మొదలు పెడితే
నేను అడుగులతో మొదలు పెట్టినప్పుడు
అమ్మ సంతోషానికి హద్దులెక్కడ
అప్పటి ఆనందకర సన్నివేశానికి
నువ్వు ఒక సాక్షివి కదా!
దయాళ్ శరణ్ శిష్యరికంలో
పాదాలు పదాలై కదలడం
నీ దయ కాదా!
కూచిపూడి నృత్యానికి
ఆచార్యత్వాన్ని నెఱిపిన
నా జగన్నాధుడువి నీవే కదా!
కృతులో కీర్తనలో
కదంబంగా కట్టిన నృత్యరూపకాలో
అంగికమో, సాత్త్వికమో
అభినయ సర్వస్వమో
నీ కరుణ కాదా!
ఊళ్ళేకాదు, దేశాలు దాటించి
కళాకారిణిగా పట్టం కట్టి
నృత్యజగతిలో నాకు ఒక చిరునామా
నువ్వు వ్రాసి ఇచ్చిన
వీలునామా కాదా!
గుణ దోషాలెంచగల పరమేష్ఠివి
నాలో నీ దృష్టికి సోకిన దోషమేమిటి
అడుగు తీసి అడుగు వెయ్యలేని
నా దుష్ఠికి కారణమేమిటి
పదం పట్టని పాదం
ముద్రపట్టని హస్తం
తనువుకు బాణాలై బాధిస్తున్నాయి
మళ్ళీ ఒకసారి
ఆ విన్యాసాన్ని నాకు
అనుగ్రహించు
శ్వాసక్రియ సాగినందాక
కొనసాగించు
కదలని నా పాదంలో
లయను ఇంకోసారి ప్రతిష్ఠించు
నిశ్శబ్దపు చీకటి ఆవరించిన వేళ
సవ్వడి చేసే మువ్వకు
స్వామి! ఇంకో ఉషోదయాన్ని
దయాళువై కనికరించు

(నటరాజుకి నర్తకి నివేదన

– మద్దాళి రఘురాం
9866057777

సంస్కృతిపై దాడిని ప్రతిఘటించేందుకే అరుణోదయ పోరాటం

అత్యంత ప్రాచీనమైన మన సంస్కృతిపై బ్రాహ్మణీయ భావజాలం, ఫాసిజం పేరుతో ప్రస్తుతం జరుగుతోన్న దాడిని ప్రతిఘటించేందుకే అరుణోదయ వంటి సంస్థలు పనిచేస్తున్నాయని పలువురు వక్తలు పేర్కొన్నారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అరుణోదయ 50 వసంతాల ముగింపు కార్యక్రమం సుధాకర్ అధ్యక్షతన ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా **'ప్రజా సాంస్కృతిక ఉద్యమంలో ఎదురవుతున్న సవాళ్లు'** అనే అంశంపై అంబటి నాగయ్య కీలకోపన్యాసం చేశారు. **సామ్రాజ్యవాద సాంస్కృతిక దాడిని నివారించడం ఎలా?** అనే అంశంపై ప్రొఫెసర్ కొండా నాగేశ్వర రావు ఉపన్యసించారు. అనంతరం అరుణోదయ వ్యవస్థాపక అధ్యక్షురాలు విమలక్క బృందం పలు గీతాలతో సాంస్కృతిక కార్యక్రమం నిర్వహించారు. ముంబయి రాము పవన్ (నిశాంత్ నాట్య మంచు) అరుణోదయం సావనీర్ ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రొ॥జయధీర్ తిరుమలరావు, బోయ సంకులు, కొల్లాపురం విమల, తదితరులు పాల్గొన్నారు.

ఈనెల 8న గుంటూరు, 2/7బ్రాడీపేటలోని కొరటాల హాలులోబండికల్లు వెంకటేశ్వర్లు ఫౌండేషన్' నిర్వహించిన 8వ జాతీయ స్థాయి కథల పోటీ విజేతలకు బహుమతి ప్రదానం జరిగింది. విజేతలు గంగవరపు సునీత, విజయ శ్రీముఖి, రోహిణి వంజారి, పారుపల్లి అజయ్ కుమార్, యమ్. కోటేశ్వరరావులతో నిర్వాహకులు బండికల్లు జమదగ్ని, బండికల్లు శ్యామ్ ప్రసాద్, చందు సాంబశివరావు, ఉగ్గిరాల సీతారామయ్య, శిరంశెట్టి కాంతారావు మరియు శిరేల సన్యాసి రావు తదితరులు.

రచయితలకు భాషపై పట్టు అవసరం

ఆదివారం రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాలులో రాజా వాసిరెడ్డి ఫౌండేసన్ ఆధ్వర్యంలో రాజా వాసిరెడ్డి మల్లీశ్వరి రచించిన గ్రంథాల పరిచయ సభలో ప్రసంగిస్తున్న డా॥ ఎ.కె.ప్రభాకర్, వేదికపై సంతోష్, బిక్కి కృష్ణ , జెల్లి విద్యాధరరావు, డా॥ నాళేశ్వరం శంకరం, రచయిత్రి రాజావాసిరెడ్డి మల్లీశ్వరి, శ్రీమతి శాంతి నిర్మల.

తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో రాజా వాసిరెడ్డి ఫౌండేసన్ ఆధ్వర్యంలో రాజా వాసిరెడ్డి మల్లీశ్వరి రచించిన గ్రంథాల పరిచయ సభ ఆదివారం రవీంద్రభారతి కాన్ఫరెన్స్ హాలులో జరిగింది. ఈ సందర్భంగా నుడిగుడి,ఒక్కపదం అర్థాలెన్నో పుస్తకాల పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా ప్రముఖ సాహితీవేత్త డా॥నాళేశ్వరం శంకరం, డా॥బిక్కి కృష్ణ, డా॥బీరం సుందరరావు, డా॥ఎ.కె.ప్రభాకర్ తాడి ప్రకాష్, ముదిగొండ సంతోష్, శాంతి నిర్మల హాజరై పుస్తకాలను సమీక్షించారు. ఎవరూ రాయని విధంగా రాయబడిన తొలి గ్రంథాలైన వీటి విలువను వివరించారు, ఒక్క పదాన్ని తీసుకుని ఆ పదం పదాంశంగా, పదాంతంగా పదాంత ధ్వనిగా ఉన్నప్పుడు మారే పదాలను, వాటి అర్థాలను వివరించడం అభినందనీయమని అన్నారు. భాష మీద రచయిత్రికున్న పట్టు ఆమె ప్రతి రచనలో తెలుస్తుందని అన్నారు. కార్యక్రమంలో జెల్లి విద్యాధరరావు, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

విప్లవోద్యమ నిర్మాణానికి దిక్సూచి కేవిస్ రచనలు

విరసం వ్యవస్థాపక సభ్యురాలు కృష్ణాబాయి కేవిస్ సంపూర్ణ రచనల్లో 2 సంపుటాల ఆవిష్కరణ

కొండపల్లి సీతారామయ్య రచనల్లోని 2 సంపుటాలను ఆవిష్కరిస్తున్న కృష్ణాబాయి, సుజాత, అల్లం నారాయణ, వి. శ్రీనివాస్, హర్నా రాకూర్

కొండపల్లి సీతారామయ్య (కేవిస్) రచనలు విప్లవోద్యమ నిర్మాణానికి దిక్సూచిలా పని చేస్తాయని వక్తలు పేర్కొన్నారు. మార్క్సిజం, లెనినిజం, మావో ఆలోచనా విధానాన్ని ఆచరించడానికి మన దేశ కాలమాల పరిస్థితులకు అన్వయించడానికి కేవిస్ రచనలు చదవాల్సిన అవసరం ఎంతైనా ఉందని నొక్కి చెప్పారు.కేవిస్ మెమో రియల్ కమిటీ ఆధ్వర్యంలో భారత కమ్యూనిస్టు విప్లవ మహోపాధ్యాయుడు దివంగత కొండపల్లి సీతారామయ్య సంపూర్ణ రచనల్లోని 2 సంపు టాలను సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విప్లవ రచయితల సంఘం వ్యవస్థాపక సభ్యురాలు కృష్ణాబాయి మాట్లాడుతూ విప్లవోద్యం నిర్మాణ పద్ధతులపై కొండపల్లి సీతారామయ్య స్పష్టమైన అవగాహన కలిగిన నాయకుడని, ప్రజా సంఘాల నిర్మాణంలో ఉక్కు మనిషిగా చారిత్రాత్మకమైన పాత్ర పోషించారని కొనియాడారు. కుల సమస్యపై కేవిస్ వ్యాసం చదువుతుంటే అంబేద్కర్ రచనలు గుర్తొచ్చాయని ప్రొఫెసర్ సూరెపల్లి సూజాత శ్లాఘించారు. తెలంగాణ ఉద్యమానికి దన్ను గా నిలిచింది కమ్యూనిస్టు పార్టీలేనని, వారు పాల్గొనడం వల్లే ప్రత్యేక రాష్ట్రం సఫలీకృతమైందని అల్లం నారాయణ వ్యాఖ్యానించారు. కమ్యూనిస్టు పార్టీ నిర్మాణంలో ఆత్మవిమర్శ అవసరాన్ని తెలియజేసిన అరుదైన మార్క్సిస్టు కొండపల్లి సీతారామయ్య అని స్వతంత్ర జర్నలిస్టు హర్న రాకూర్ అన్నారు. కేవిస్ రచనలు ఇంగ్లీషులోకి అనువాదం కావాలని సూచించారు. కొండపల్లి సీతారామయ్య మారు పేర్ల తోనే రచనలన్నీ చేశారని లభ్యమైన వాటన్నింటినీ పది సంపుటాలుగా కేవిస్ మెమోరియల్ కమిటీ నుంచి వెలువరిస్తున్నట్లు డాక్టర్ వి. శ్రీనివాస్ తెలిపారు.

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక, దర్పణం సాహిత్య వేదిక సంయుక్తంగా ప్రతిరోజూ ఒక అంశం ఇచ్చి కవిత్వ రచన చేయిస్తున్నాయి. కవిత్వాన్ని నిరంతరం సాధన చేయిస్తున్నాయి. కవులు రాసిన పద్యాలు, వచన కవితలు, గేయాలను విశ్లేషించి; మెరుగు పరచుకోవడానికి ప్రతిరోజూ సూచనలు, సలహాలు ఇవ్వడం జరుగుతోంది. ఈ దైనందిన కార్యక్రమంలో భాగంగా 1338వ రోజు 'భూకంపం' అనే అంశంపై పలువురు కవులు తమ కవితలను పంచుకున్నారు. కవితల సాధన చేస్తున్న కవులందరికీ అభినందనలు. 'భూకంపం' అంశంపై వచ్చిన కొన్ని కవితలను 'నేటి నిజం' పాఠకుల కోసం ప్రత్యేకంగా అందిస్తున్నాం. –సంపాదకులు

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా సాహిత్య వేదిక & దర్పణం సాహిత్య వేదిక వాట్సాప్ సవ మూహం
అడ్మిన్ & ఏకాంశ కవిత్వ నిర్వహణ:
–డా॥రాయారావు సూర్యప్రకాశ్‌రావు, 9441046839

కోపంతో పుడమితల్లి

తొక్కినా తన్నినా తవ్వినా
ఆకాశ హర్మ్యాలు నిర్మించినా
భరిస్తూ
తనకు పుట్టిన
చెట్టు బిడ్డలను కొట్టేస్తూ ఉంటే
కడుపుకోత
సంతోషంగా
గల గల పారే నదులను
కాలుష్య కాసారాలుగా చేస్తుంటే
బాధ
చూస్తూ ఎంత కాలం భరించాలి
ఏమిటి నాకీ పరీక్ష.
స్వార్థమెక్కువైన మనిషి
దేన్ని బతుకనిస్తలేడు
బండ్లతో పొగలు నింపేస్తున్నడు
ఊపిరాడక కొట్టుకుంటున్న!!.
అడవులను కొట్టేస్తున్నడు
జంతువులను తినేస్తున్నడు
ఏంటి నా కీ కడుపుకోత!!.
నాలో నేనే కుమిలిపోతూ
నాలో నేనే విసుగుజెంది
ఒక్కసారి ఉద్రేకమెక్కువై
మనసు పట్టలేక
గుండెలో సలిగే బాధతో
కంపించి ఊగి ఊగి పోతూ
మనిషిని
భయభ్రాంతులకు గురిజేస్తున్న.
చందమామను చేరిన మనిషి
తాను నిలబడ్డ
భూమి తల్లిని మరచిపోతూ
కన్నతల్లి లాంటి నన్ను
ఎంతో బాధపెట్టి
తమాషా చూస్తున్నడు
అందుకే నేను
అవకాశం వచ్చినప్పుడు
నా తడాఖా చూపిస్తున్న!!.
ఇప్పటికైనా మారతవా మనిషి
నన్ను కాలుష్యపు పొరలనుండి
కాపాడుతావా
లేకుంటే నీ భవిష్యత్ ప్రశ్నార్థకమే!!.

–డా.చీదెళ్ళ సీతాలక్ష్మి

ఆక్రందన!

"అయ్యో అమ్మా!బాధ!"
భూమాత ఆక్రందన
గర్భంలో
ఎగసిపడుతున్న జ్వాలలు
నరనరాలు
పటక్ పటక్ చిట్లుతూ
ఫెటీల్మని
గుండె పొరలు చీల్చుకుని
మట్టి బండరాళ్లు దొర్లుతూ గడబిడ.
అసుర నరకాసులు
బతుకు మెతుకు నిచ్చే తనను
అణువణువు కుళ్లబొడుస్తుంటే
కుళ్ళి కుళ్ళి ఏడుస్తూన్న ఆమెను
కబళించే బకాసురుల
దురాశతో కూలుతున్న వనాలు
అణు ధార్మిక శక్తి కి
గనుల తవ్వకాలతో
బాధతో విలవిల గిలగిలతో
ఓ ప్రక్క కాస్త ఒరిగే
అంతస్తుల భవనాలు
పేకమేడలు
వేల ప్రాణాలు గాల్లో హరి హరీ
మూల్గులు గాయాలతో
చావుబతుకుల్లో
శివా శివా రోదనలు!
రుద్రభూమి లో
పిశాచాల వికటాట్టహాసాలు.
నోర్స్ పురాదేవుని ఆగ్రహం
గ్రీకు పోసే ఇదోన్ ప్రతాపంతో
భూకంపాలు తాండవం.
గుర్రపు నాడా ఆకారం
జోన్ వద్ద భూకంపం తీవ్రత
సీస్మోమీటర్ సాధనంతో కొలత
రిక్టర్ స్కేల్ ఏడు దాటితే
యముని మహిష ఘంటికలు
గణగణలు
చిత్రగుప్తుని చిట్టాలో
లెక్క లేనన్ని సంఖ్యలు.
ప్రకృతి ప్రకోపిస్తే
ఓ మనిషీ!
నీవుండవు ఖాయం.

–ఎ.రాజ్యశ్రీ

భూతాపం

ఓ భూమాతా!
కూర్చున్న కొమ్మను
నరుక్కునే ఈ
మూర్ఖులను క్షమించి నీవు
అనుభవిస్తున్నబాధలను
ప్రకంపనలు రూపంలో
చూపినా
తెలుసుకుని మార్చుకోని మాకు
నీపై నివసించే హక్కెక్కడిది.
కోపంతో కంపిస్తూ
అవనమ్మ చెప్పినా
ఆగి వినే సమయం మనకెక్కడిది?
డబ్బు కోసం డబ్బువెనుక
పరుగుపెడుతూ లేస్తూ.
అరుణాచలేశుడు
మూడోకన్ను తెరచి
మనలను చరచి చెప్పినా
మనం
ఆత్మ వంచన దారి వీడం
మనం నివాసముంటున్న
మన భూమిని
వృక్ష రహితం చేసి
మన చావులు మనమే
భూకంపాల రూపంలో
కొని తెచ్చుకుని
భస్మాసుర వారసులమని
రూఢి చేసుకుంటూ
అమ్మను కష్టాలపాలు చేస్తూ
భూమాత కోపాన్ని
రుచి చూస్తున్నాం!.

–ప్రశాంతి రేవూరి

ప్రకృతి కోపం

భూమి గర్జించినప్పుడు
అంతరాల నుండి
ఎగసిపడుతున్న అగ్నిజ్వాలలు
భూమి ఛిద్రమవుతున్న శబ్దం
కళ్ళ ముందే
కూలిపోతున్న భవనాలు
మృత్యువు
ముంచుకొస్తున్న భయం.
మనసులు ఛిద్రమవుతున్నాయి
ఆశలు కరిగిపోతున్నాయి
ప్రియమైనవారిని
కోల్పోయిన వేదన
నిరాశ నీడలు ఆవహిస్తున్నాయి.
ప్రకృతి శక్తి ఎంతటిది!
మనం ఎంత చిన్నవారమో!
ఈ విధ్వంసం
మనల్ని మార్చాలి.
ప్రకృతిని కాపాడాలి
భవిష్యత్తు కోసం.
మన హృదయాలలో
కొత్త ఆశలు మొలకెత్తాలి.
కలిసి నిలబడి
కలిసి కట్టుకుందాం.
ఈ విపత్తు
మనల్ని బలపరచాలి.
మనం మరింత
మానవతావాదులుగా మారితేనే
ఈ లోకం శాంతంగా ఉంటుంది

–విజయలక్ష్మి వడ్డేపల్లి.

ప్రకోపం

పుడమి మారుతుంది
నేస్తం
చేస్తున్నాం కలిమి
అభివృద్ధి పేరుతో
తవ్వకాలు
సెజ్ ల పేరుతో
ప్రకృతి వినాశనం
భూమి భారం పెరిగి
విస్ఫోటనం
జనాభా విస్ఫోటనం
తప్పదు ప్రకోపం
లాతూర్ కకావికలం
అపార్టుమెంట్లు ఆగం
చిన్న చిన్న కదలిక
పరుగులతో జనం
ఆగం
అన్ని తానై భరించి
ఎన్నో పురిటి నొప్పులు
భరించి
చివరి మజిలీ
తట్టు కోలేక
నొప్పులు భరించక
ఆగం అవుతుంది
నా బంగారు పుడమి
దానికి మనమే కారణం
ప్రకృతితో చెలిమి
భూకంపాలకు విరుగుడు.

–ఉమాశేషారావు వైద్య

గుండెలో దడదడ

భూమికపించింది
గుండెలదిరె
కదిలే సమస్తాలు
రెప్ప పాటులో
కదలి కటకటలాడే.
వింతలూ విడ్డూరాలూ
భూమి పైన ఒత్తిడి బరువు
చెట్లు, మానులను నరకడాలు
పాపకృత్యాలు
నీతిమాలిన పనులు.
అమ్మ ధరిణి మాత
గుండెలవిసిపోయి గగ్గోలు
ఏద్వలేక, పరువుకై
చిన్న కదలికతో
తెలిపిన బాధ.
అకృత్యపు నీడలు
ఆవేశపరుల దుష్టత్వాలు
నిండిపోయి
ధరణి భాగ్యాన్ని మండిస్తే
నిశ్చల గతిలో
నధయాడు వారికే ప్రకంపనలు.
అమ్మ ధరణి కినుకతో తెలిపింది
జాగ్రత్తగా మసలండి
మనుగడ బాగుపరచండి
నీతులు చెప్పేవారే కానీ
జాతిగా నడిచేదేవరూ?.

–కె.కె.తాయారు

అమ్మో! భూకంపం!

యథాతథంగా
పాఠశాల నడుస్తోంది
అంకితభావంతో
బోధించే వాళ్ళు బోధిస్తున్నారు,
ఇతరుల కథాకాలక్షేపం
వినేవాళ్ళు వింటున్నారు
తతిమ్మావాళ్ళు
వింటున్నట్టు
భ్రమ కల్పిస్తున్నారు
అంతలో ప్రమాద సూచిక
సైరన్ మోగింది గీ...మని
భూకంపఘంటికలని గ్రహించిన
అధ్యాపకులూ విద్యార్థులూ
అప్రమత్తులయ్యారు
గబగబ పిల్లలందరూ
తలలపై పుస్తకాలు పెట్టుకుని
వరుసల్లో క్రిందకు పరుగులు!.
తోపులాటలవకుండా
ఎక్కడికక్కడ హెచ్చరికలు
అందరి గుండెల్లో భయం
ఎవరిమీద ఏం పడుతుందోనని!
ఆపత్కాల సమయంలో
నిర్దేశించుకున్న వరుసలలో
కిందినుంచి మొదలుపెట్టి
తరగతిగదులను దడదడ
ఖాళీ చేయిస్తున్న టీచర్లు
ఒక పెద్ద వయసు
ఉపాధ్యాయురాలు
పరిస్థితినర్థం చేసుకుని
దారి చూపించేలోపు
కుర్రవాళ్ళు భయాందోళనలతో
మరో వైపు పరుగులు
ఒక్కసారి అంతా
అర్థం కాని గందరగోళం
అంతలోనే సర్దుకుని
అరనిమిషంలో
విద్యార్థులూ ఉపాధ్యాయులూ
ఆటల మైదానంలో
సమీకృతం
తత్తరపాటుకు గురవుతున్న
గుండెలతో
తమ ప్రియాతిప్రియమైన
భవనాన్ని తనివితీరా
చూసుకుంటున్న క్షణాలలో
అభ్యాస నిమిత్తమై
మోగించిన భూకంప ఘంటికకు
సత్వరంగా స్పందించిన
అందరికీ ధన్యవాదాలతో
ప్రిన్సిపాలు మెచ్చుకోళ్ళు
తేలికగా ఊపిరి పీల్చుకున్న
ప్రతిఒక్కరిలో హర్షాతిరేకం.
భౌతికశాస్త్రఅధ్యాపకురాలి
సూచనల పిమ్మట
తిరిగి తరగతిగదులకు
బిరబిరపయనం!.

–ముద్దు వెంకటలక్ష్మి

భయకంపం

చలనశీల భూగర్భం
భూ శిఖరం ఘర్షణలో
హిమగిరుల వైఫల్యం
ఫలకాలలో పతనంతో
జారిపడే కొండ చరియ.
గడ గడ యని వణికె భూమి
దడ దడ యని జారే పుడమి
ప్రమాదాల అంచున
కకావికలు జన జీవనం.
కూలి పడే భవనాలు
గాలిలో ప్రాణాలు
శిథిల శిలా విన్యాసం
బతుకు మహా వినాశం.
ఏ క్షణమున ఏమౌనో
ఎవరెరుగని ప్రమాదం
భూకంపం భయకంపం
అంతులేని సంక్షోభం.
కనుమూసి కనుతెరిచే
అప్రమత్తమౌ క్షణం
అత్యవసర ప్రతిస్పందన
ఒకరి కొకరి చిరుసాయం.
అందించుటే కర్తవ్యం.

–కనపర్తి లక్ష్మయ్య

అగ్రహం

సహనానికి మారు పేరు భూమాత
సహనానికి ఒక హద్దు ఉంటుంది
హద్దు మీరితే శిక్ష తప్పదు
అనుభవించుక తప్పదు
కళ కళ లాడే
చెరువులని పూడ్చి
అంతస్తులు లేపుతారు.
నీటి కోసం బోర్లు
బోర్ల కోసం
ధరణి గుండెకి తూట్లు
పక్క వాడు
యాభై అడుగులు వేస్తే
నేను ఇంకా
ఎక్కువ అడుగులు పోవాలి
అక్కడా పోటీనే
పచ్చని చెట్లని కొట్టి
పైకి లేపే ఆకాశహర్మ్యాలు
అమ్మ గుండెల్ని చీల్చే గోతులు
పచ్చని పొలాలతో
పరవశించే తల్లి
కాంక్రీట్ జంగిల్
సహించే కొద్దీ బాధలే
బాధ ఎవరితో చెప్పుకోవాలి
చెప్పుకోలేని ఆగ్రహం
అప్పుడపుడు అయినా
వెళ్ళగక్కాలి
అదే భూకంపం
అనవసర అకృత్యాలు
ఆపమని చేసే హెచ్చరిక!.

–మోటూరి శాంతకుమారి

భూమికి ఆపదొచ్చింది!!!

నన్ను ఎత్తుకున్న భూతల్లే
నిన్న గజగజ వణికింది
ఏ జరమో ఏమో
అనుకుందామనుకున్నా
సకల జీవరాశికి ఆయువిచ్చేదాయే
వట్టి వట్టి వణుకుడు కాదాయే
మట్టిముంతల నీళ్ళు ఒలికినట్లాయే
ఇదేమి ఇచ్చంత్రమో భూకంపమట!.
పర్వతాలను మహాసముద్రాలను
తనువున దాల్చిన భూమాతకు
భూకంపం వచ్చింది.
నాకు నాడీ చూసి
వైద్యుడిచ్చే మందు
భూమిచ్చిన
సంజీవని కానుకే
గిప్పుడు భూమి
కడుపుల నొప్పికీ
తాళలేక తల్లడిల్లి పోతుంది
పెద్ద పెద్ద సదువులు
సదివినోళ్ళంతా
భూమికి
మంచి వైద్యం సేయాలె
మళ్ళీ మళ్ళీ రాకుండా
పాబంది జేయ్యాలె.
లేకుంటే
మనతోటి జీవాలకు
నివాసమైన
ఈ భూమి మిగులదు
ఇన్నోల్లెవరో ఇనలేల్లెవరో
జరంత మనసున వెట్టుండ్రి
భూమికే ఆపదొచ్చింది!!!
జాగు సేయక
మన తప్పెక్కడుందో
సరి జేయాలి
ముందు తరాలకు
భరోసా ఇవ్వాలి.

–ఏదెల్లి రాములు

గేయానికి హృదయం లయ

అమరావతి సాహితీ మిత్రులు సభలో డా॥రావి రంగారావు

గేయానికి హృదయం లయ అని ప్రముఖ సాహితీవేత్త డా. రావి రంగారావు తెలిపారు. గుంటూరు బ్రాడీపేట సర్వీస్ హెల్త్ ఆర్గనైజేషన్ సమావేశ మందిరంలో అమరావతి సాహితీమితులు నిర్వహించిన సాహిత్య సమావేశంలో ఆయన "గేయాలు ఎలా రాయాలి" అనే అంశం గురించి ప్రసంగించారు. సృష్టి మొత్తం లయాత్మకం అని, కవిత్వం కూడా మొదట లయాత్మకంగానే పుట్టిందని ఆయన అభిప్రాయపడ్డారు. నిరక్షరాస్యులు కూడా లయ హృదయం పట్టుకోగలరని, జానపద గేయాలు అలాగే పుట్టుకొచ్చాయని ఆయన వివరించారు. గేయానికి రకరకాల నడకలు ఉంటాయని, ప్రధానంగా మూడు నాలుగు ఐదు ఆరు మాత్రా గణాలతో గేయాలు నడుస్తాయని, అనుభవం ఉన్న కవులు నడకలలో ఎంతో వైవిధ్యం చూపిస్తారని, అందులో సినిమా కవులు సిద్ధహస్తులని ఆయన తెలియజేశారు. వర్తమాన కవిత్వ ప్రక్రియలలో గేయానికి కూడా అద్భుతమైన స్థానం ఉందని, అది జనరంజక ప్రక్రియ అని, ప్రజా సమస్యల మీద గేయాలు విరివిగా రాయాలని ఆయన కవులకు పిలుపు నిచ్చారు. పెనుమాక నాగేశ్వర రావు రాసిన కథల సంపుటి "అమర సుఖం" గురించి వక్కలగడ్డ వెంకటేశ్వర రావు సోదాహరణంగా ప్రసంగించారు. పాత్రల గురించి, సన్నివేశ కల్పన గురించి, శైలి గురించి విపులంగా మాట్లాడారు. మేడిశెట్టి యోగేశ్వర రావు (మచిలీపట్నం) "ఈ మాసం కవి"గా పాల్గొని అనేక గేయాలు వినిపించి సభను రంజింప చేశారు. ఈ కార్యక్రమంలో "నిక్కచ్చికవిత" సత్కారం కోసం పింగళి భాగ్యలక్ష్మి నిర్వహించిన కవి సమ్మేళనంలో "డస్ట్ బిన్" అనే అంశం గురించి చల్లా సత్యవతి (పిడుగురాళ్ల), విష్ణు మొలకల భీమేశ్వర ప్రసాద్ (తెనాలి), పూసపాటి కృష్ణ సూర్య కుమార్, సూర్యదేవర రవికుమార్, మేడిశెట్టి సుభద్రా కృష్ణ, శరకణం కనకదుర్గ, వి వి రావు, గడల శివప్రసాద్, మస్తాన్ మొదలైన కవులు పాల్గొన్నారు. "నిక్కచ్చి కవిత" సత్కారానికి ఎంపికైన చల్లా సత్యవతికి శాంతశ్రీ ట్రస్ట్ వారు 500 రూపాయల నగదు బహుమతిని అందజేశారు. అమరావతి సాహితీ మిత్రులు సంస్థ నిర్వహించిన అవినీతి వ్యతిరేక కవితల పోటీలలో విజేత లైన సింగరాజు శ్రీనివాసరావు (ఒంగోలు), సూర్యదేవర రవికుమార్ (గుంటూరు), టి లీలా కృష్ణ (తెనాలి), "నిక్కచ్చి కవిత" విజేత చల్లా సత్యవతి అమరావతి సాహితీ మిత్రుల సత్కారం అందుకున్నారు. తొలుత ఇ. చంద్రయ్య వినిపించిన సుభాషితాలతో కార్యక్రమం ప్రారంభమైంది.

సినారె కవితా పురస్కారం 2022 కు కవితా సంపుటుల ఆహ్వానం

సాహితీగౌతమి ప్రతియేట ప్రతిష్ఠాత్మకంగా అందజేస్తున్న సినారె కవితా పురస్కారం 2022 కి గాను ఇరు రాష్ట్రాలనుండి వచన కవితా సంపుటులను ఆహ్వానిస్తున్నాం.

కవులు 2019,20,21 సం"లలో ముద్రించబడిన వారివారి కవితా సంపుటులను ఈ పోటీకోసం 4ప్రతులు తేదీ: 31-12-2024 లోగా పంపించాలిగతంలో ఈ పురస్కారం పొందిన కవులకు అవకాశం లేదు.అలాగే దీర్ఘకవితలు,గేయాలు,నానీల వంటి ప్రక్రియలలో ప్రచురించబడినవాటిని ఈ పోటీలకు స్వీకరించబడవు. కేవలం వచన కవితా సంపుటులను మాత్రమే పంపించాలి.

పంపించాల్సిన చిరునామా:- కన్వీనర్, డా॥ఎడవల్లి విజయేంద్రరెడ్డి, శివానంద ఆసుపత్రి, ఇం.నం.3-3-181, సవరన్ స్ట్రీట్, కరీంనగర్ -505001. వివరాలకు సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులను 9490401861, 9395553393 నంబర్ లలో సంప్రదించగలరు.

అధ్యక్షులు **–నంది శ్రీనివాస్**
ప్రధాన కార్యదర్శి **–కొత్త అనిల్ కుమార్**
సాహితీ గౌతమి-కరీంనగర్

సాహిత్యం, సామాజిక నిర్వహిస్తున్న
'బుధవారం బాద్షా' పోటీ ఫలితాలు

అడ్మిన్: రమాదేవి
8985613123

నిర్వహణ:
శ్రీమతి సత్య నీలిమ

తలరాత మార్చే గీత

ఆత్మ సార్వత్రిక శాస్త్రం
మానవాళికి పర్తించే...
కాలాతీతమైన జ్ఞానం
కొత్త కొత్త పదాలను
అర్థాలను పొందగలిగే
గొప్పదనం కలిగి
అన్ని సమయాలలో
ప్రదేశాలు పరిస్థితులలో
మనిషిగా నిలబెట్టే
శాశ్వతమైన గీతాసారం!!.
మనిషి జీవితానికి
లక్ష్యాన్ని ఏర్పరచి
బాధలనుండి బయట
పడేలా చేస్తూ...
శాశ్వత స్వేచ్ఛను
ఆనందాన్ని పొందగలిగేలా
జీవితంలో
జీవించడం నేర్పుతుంది!!.
జీవితంలో తిరోగమనాలు
అనిశ్చలతలను
ఎదుర్కొనే శక్తినిస్తుంది
మనసును నియంత్రిస్తూ
కోపాన్నధిగమించేలా చేస్తూ
ఒత్తిడిని తట్టుకునే
కళలలను నేర్పుతుంది!!.
ప్రశాంతమైన జీవితాన్ని
గడుపుటకు ఆచరణాత్మక
మార్గదర్శకాలను అందిస్తూ
పని వినోదం....
ఆహారం విశ్రాంతిలో
సమతుల్యతను సాధిస్తుంది!!.
శారీరక మానసిక...
ఆధ్యాత్మిక శ్రేయస్సును
ప్రోత్సహిస్తూ
మానవ సంబంధాలలో
సామరస్యం తెస్తుంది
జీవిత నైపుణ్యాలను
పెంపొందించి...
వ్యక్తిత్వాన్ని
మెరుగు పరుస్తుంది!!.
భగవద్గీత సందేశాన్ని
భగవాన్ శ్రీకృష్ణుడే
నిర్దేశించాడు
గీత నేర్చుకుంటే
మన తలరాతనే
మార్చుకోవచ్చును!!.

–మద్దెల సరోజన

బతుకు మార్చే గీత

తల రాత బ్రహ్మ రాసినా
కృషి నీ స్వంతమైతే
విజయం అతిథిలా వచ్చి
సుఖాన్ని నీడచేసి
పహరా కాయిస్తుంది.
కృషి ఉంటే
మనుషులు ఋషులౌతారు
మహా మేధావులై
మానవ సమాజానికి
భరోసా తానై భావి తరాల
బాధను తీర్చే బంధువై
దరిద్రాన్ని తరిమే ఆయుధమౌతుంది.
సోమరితనం స్వంతమైతే
కాలం మందగమనంతో కదిలి
ఊపిరి కూడా తీర్చుకోవటంలో
మొద్దునిదుర పోతుంది.
జీవితం వడ్డించిన విస్తరాకు కాదు
అన్ని ఉన్నా అల్లుర్నోట్లో శని ఉన్నట్లు
ప్రయత్నం పక్కకు పెడితే
ప్రాణం కూడా పరుగుపెట్టిస్తుంది.
జీవితం ఓ వరం
అది అనుభవించే మార్గం
వేతకటమే మన తలరాత
మంచితనం కంటిచూపైతే
ముల్లుకూడా పూవై తాకుతుంది
మనుషుల్లో మంచిని చూస్తే
మన బతుకు గీత మనవారిని
కలిపి బంధాలు పెంచుతుంది.

–డా.బి.సుధాకర్

బతుకు మార్చే గీత

కురుక్షేత్రంలో
శ్రీకృష్ణ పరమాత్మ
కిరీటికి గీతోపదేశం చేసిన
మార్గ శుద్ధ ఏకాదశి రోజునే
గీతా జయంతి.
శ్రీకృష్ణ భగవానుని
ముఖ పద్మము నుంచి
ఉద్భవించింది గీత .
భగవద్గీత
సర్వవేద పరిపూర్ణ రూపిణి
చిన్మయ స్వరూపిణి
స్వారాజ్య ప్రదాయిని
దీనజనోద్ధారిణి
నిత్య జీవిత సంగిని
సాక్షాత్ కృష్ణ రూపమే గీత.
గీతయే శ్రీకృష్ణుని
ఉత్తమ తత్వము
నాశ రహితమైన జ్ఞానము
బ్రహ్మ స్వరూపమే.
గీత ఒక గ్రంథమే కాదు
నిత్య చైతన్య మూర్తి
నిష్కామ కర్మలే
గీతా లక్షణములు.
భగవద్గీత
ఆధ్యాత్మిక గ్రంథమే కాదు
మానవాళికి జీవనగీత.
దేహం, మనసు, బుద్ధిని
దాటి జ్ఞానాన్ని, తత్వాన్ని
మానవాళికి ప్రసాదించిన గీత.
(గీతా జయంతి సందర్భంగా)

–గజవెళ్ళి శ్రీనివాసాచారి

విజ్ఞాన భానీదాగారాం

శ్రీ కృష్ణుడు బోధించిన
జ్ఞానామృతం
లోకానికి దొరికిన
విజ్ఞాన భానీదాగారాం
తనను తాను తి
లుసుకునే ప్